బుధవారం
5-3-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 163
పేజీలు : 8, వెల: రూ.5.00

Simultaneously published from
Hyderabad, Vijayawada, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

సెర్బియా పార్లమెంటులో స్మోక్ బాంబులు

బెల్‌గ్రేడ్: ప్రతిపక్షాల నిరసనలతో సెర్బియా పార్లమెంటు అట్టుడికిపోయింది. స్మోక్ బాంబులు, మండే స్వభావమున్న పదార్థాలు, కోడిగుడ్లు, వాటర్ బాటిళ్లనూ సభ్యులు విసురుకున్నారు. దీంతో ముగ్గురికి గాయాలు కాగా ఒకరి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. యూనివర్సిటీ విద్యకు నిధులు పెంచే బిల్లుపై పార్లమెంటులో ఓటింగ్ సమయంలో గందరగోళం నెలకొంది. అధికార, విపక్షాల మధ్య వాగ్వాదం... స్మోక్ బాంబులు విసరడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

ఫైనల్‌కు భారత్

చాంపియన్స్ ట్రోఫీ సెమీస్‌లో ఆసీస్‌పై ఘన విజయం

రాణించిన కోహ్లీ, చివర్లో హార్దిక్, రాహుల్ మెరుపులు

దుబాయ్: ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ వన్డే క్రికెట్‌లో టీమిండియా అప్రతిహత విజయపరంపరను కొనసాగిస్తోంది. ట్రోఫీ గెలుచుకునేందుకు ఒక్క అడుగు దూరంలో నిలిచింది. మంగళవారం ఆస్ట్రేలియాతో జరిగిన సెమీ ఫైనల్‌లో 4 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి... ఫైనల్స్‌లో ప్రవేశించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 49.3 ఓవర్లలో 264 పరుగులకు ఆలౌటైంది. 265 పరుగుల లక్ష్యాన్ని టీమిండియా 48.1 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి ఛేదించింది. దీంతో 2023 వన్డే ప్రపంచ కప్ ఫైనల్ ఓటమికి కంగారూలపై భారత్ ప్రతీకారం తీర్చుకున్నట్లయింది. విరాట్ కోహ్లీ (84, 98 బంతుల్లో 5 ఫోర్లు) జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. శ్రేయస్ అయ్యర్ (45, 62 బంతుల్లో 3 ఫోర్లు) మరోసారి మంచి ప్రదర్శన చేశాడు. కేఎల్ రాహుల్ (42), హార్దిక్ పాండ్య (28) తమ వంతు సహకరించారు. కెప్టెన్ రోహిత్ శర్మ (28; 29 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), అక్షర్ పటేల్ (27; 30 బంతుల్లో

- మిగతా 2 లో

జామియా విద్యార్థుల సస్పెన్షన్‌పై ఢిల్లీ హైకోర్టు స్టే

న్యూఢిల్లీ: ముందస్తు అనుమతులు తీసుకోకుండా క్యాంపస్‌లో నిరసనకు దిగి...జామియా మిల్లియా ఇస్లామియా విద్యార్థులు సస్పెన్షన్‌కు గురయ్యారు. క్యాంపస్‌లోకి ప్రవేశాన్ని నిరాకరిస్తూ యూనివర్సిటీ ప్రాక్టర్ తమను సస్పెండ్ చేయడాన్ని సవాల్ చేస్తూ నలుగురు విద్యార్థులు ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో వారి సస్పెన్షన్‌పై స్టే విధిస్తూ ఢిల్లీ హైకోర్టు మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ వివాదాన్ని పరిష్కరించడం కోసం వైస్ ఛాన్సలర్ పర్యవేక్షణలో యూనివర్సిటీ అధికారుల కమిటీని

- మిగతా 2 లో

మహారాష్ట్ర మంత్రి ముండే రాజీనామా

ముంబై: మహారాష్ట్రలో పౌర సరఫరాల శాఖ మంత్రి ధనంజయ్ ముండే తన పదవికి రాజీనామా చేశారు. బీడ్ జిల్లాలో సర్పంచ్ దారుణ హత్య వ్యవహారం రాజకీయంగా ప్రకంపనలు సృష్టిస్తున్న నేపథ్యంలో ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ ధనంజయ్ ముండే తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. సర్పంచ్ సంతోష్ దేశ్‌ముఖ్ హత్య కేసు విషయంలో మంత్రి పదవికి రాజీనామా చేయాలని ధనంజయ్ ముండేను సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ఆదేశించగా... తన రాజీనామాను సమర్పించినట్లు సంబంధిత

- మిగతా 2 లో

కన్నడ నటి రాన్యా రావ్ అరెస్టు

బెంగళూరు: అక్రమంగా బంగారాన్ని తరలించిన ఆరోపణలతో కన్నడ నటి రాన్యా రావ్ అరెస్టు అయ్యారు. ఆమె దుబాయి నుంచి దాదాపు 15 కేజీల బంగారాన్ని తీసుకు రాగా బెంగళూరు విమానాశ్రయంలో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రాన్యా తరచూ దుబాయ్ వెళ్లి వస్తుండటంతో ఆమెపై నిఘా పెట్టారు. 15 రోజుల్లో నాలుగు సార్లు దుబాయి వెళ్లొచ్చిన రాన్యా... గోల్డ్ బిస్కెట్లను దుస్తుల్లో దాచి, తెచ్చేవారని అధికారులు తెలిపారు. కర్నాటకకు చెందిన ఓ పోలీసు అధికారికి రాన్యా బంధువని

- మిగతా 2 లో

మేడారం, గోదావరి పుష్కరాలు ప్రతిష్ఠాత్మకంగా జరుపుకుందాం

- ఇందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం కావాలి
- అర్బన్ పార్కులు, టైగర్ రిజర్వు అభివృద్ధిపై దృష్టి
- పురాతన ఆలయాల పునరుద్ధరణకూ చర్యలు
- భట్టి విక్రమార్క, కొండా సురేఖ

విశాలాంధ్ర-హైదరాబాద్: సమ్మక్క, సారలమ్మ (మేడారం) జాతర, గోదావరి పుష్కరాలను ప్రతిష్టాత్మకంగా చేపట్టేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మంత్రి కొండా సురేఖ తెలిపారు. రెండు ఉత్సవాలు సజావుగా సాగేలా చర్యలు ఉండాలని దేవాదాయ శాఖకు సూచనలు చేశారు. అదే సమయంలో ఎకో టూరిజం అభివృద్ధి చేయాలని, పురాతన ఆలయాలను పునరుద్ధరించడంపై మార్గదర్శకాలు అందించారు. అర్బన్ పార్కుల అభివృద్ధితో ఆదాయం పెంచేలా మార్గాలు అన్వేషించాలన్నారు. భట్టి విక్రమార్క, కొండా సురేఖ మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో ప్రీ బడ్జెట్ సమావేశాన్ని నిర్వహించారు. దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖల అధికారులతో చర్చించారు. శాశ్వత ప్రాతిపదికన పనులు జరగాలని సూచించారు. టైగర్ రిజర్వ్ ప్రాంతాలు, అర్బన్ పార్కుల అభివృద్ధితో ఆదాయం పెంచుకోవాలని అన్నారు. పురాతన ఆలయాలు పునరుద్ధరించేలా పురావస్తు శాఖకు సూచనలు చేశారు. రాష్ట్రంలోని ఆరు ప్రధాన ఆలయాలాభివృద్ధికి కార్యాచరణపై చర్చించారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో అర్బన్ పార్కుల అభివృద్ధితో ఐటీ ఉద్యోగులు వారాంతాల్లో సేద తీరేందుకు అవకాశం ఉంటుందన్నారు. అటవీ హక్కు చట్టం ద్వారా పోడు భూములకు పట్టాలు ఇచ్చామని, అటవీ శాఖతో సమన్వయం లేక కొన్ని ఇబ్బందులు వస్తున్నట్లు సంబంధిత అధికారులు వెల్లడించగా త్వరలోనే అటవీ, గిరిజన, ఉద్యాన, వ్యవసాయ, ఇంధన శాఖల అధికారులతో సమావేశం నిర్వహిస్తామని భట్టి తెలిపారు. గిరిజన రైతుల సమస్యల పరిష్కారం, వివిధ పంటల సాగుతో అటవీ విస్తీర్ణాన్ని పెంచుకోవడం, పంపుసెట్ల వినియోగం కోసం సోలార్ విద్యుత్ కల్పన వంటి అన్ని

- మిగతా 2 లో

బకాయి వెంటనే చెల్లించండి

- సీఎంఆర్ సరఫరా సమయం పెంచండి
- సౌర విద్యుత్ ఉత్పత్తికి అనుమతులు పునరుద్ధరించండి
- ప్రహ్లాద్ జోషికి రేవంత్, ఉత్తమ్ వినతి

విశాలాంధ్ర-హైదరాబాద్: భారత ఆహార సంస్థకు (ఎఫ్‌సీఐ) 2014-15 ఖరీఫ్‌లో సరఫరా చేసిన బియ్యానికి సంబంధించి తెలంగాణకు రావాల్సిన రూ.1,468.94 కోట్లను వెంటనే విడుదల చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి నివాసంలో ఆయనతో భేటీ అయ్యారు. రేవంత్ వెంట మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉన్నారు. నాడు అదనపు లెవీ సేకరణకు సంబంధించిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించిందని, బకాయిలు పెట్టి 10 ఏళ్లు అయిందని గుర్తుచేశారు. ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ యోజన కింద 2021, మే నుంచి 2022, మార్చి వరకు సరఫరా చేసిన అదనపు బియ్యం, 2022 ఏప్రిల్‌లో సరఫరా చేసిన బియ్యానికి సంబంధించిన ఉత్తర్వులు ధ్రువీకరించుకొని...బకాయిలు రూ.343.27 కోట్లు విడుదల చేయాలని రేవంత్ కోరారు. 2021, జూన్ నుంచి 2022, ఏప్రిల్ వరకు నాన్ ఎన్ఎఫ్ఎస్ఏ (నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్) కింద పంపిణీ చేసిన బియ్యానికి సంబంధించిన బకాయి మొత్తం రూ.79.09 కోట్లుగా తెలిపారు. సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) గడువును నెల రోజులు కాకుండా నాలుగు నెలలకు పొడిగించాలని... అప్పుడు సరఫరాలో ఇబ్బందులు రావని వివరించారు. అలాగే రాష్ట్రానికి పీఎం కుసుమ్ కింద గతంలో ఇచ్చిన నాలుగు వేల మెగా వాట్ల సోలార్ విద్యుదుత్పత్తికి అనుమతులను పునరుద్ధరించాలని రేవంత్ రెడ్డి విజ్ఞప్తి

- మిగతా 2 లో

పంజాబ్‌లో రైతు నేతల నిర్బంధం

- అర్ధరాత్రి 200 మందికి పైగా అరెస్టు
- ఆప్ ప్రభుత్వ తీరుపై ఎస్కేఎం, బీకేయూ నిరసన
- నేడు 'చండీగఢ్ చలో' కార్యక్రమం

చండీగఢ్: అన్నదాతలు తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోరుతూ చేపట్టిన 'చండీగఢ్ చలో' కార్యక్రమంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ నిరసనకు ముందు పంజాబ్ పోలీసులు 200 మందికి పైగా రైతులను, రైతు సంఘాల నాయకులను అరెస్ట్ చేశారు. ముఖ్యంగా పంజాబ్ అంతటా అనేక మంది రైతు నాయకుల ఇళ్లపై దాడులు జరిగాయి. ఇది వివిధ ప్రాంతాలలో పోలీసుల చర్యకు వ్యతిరేకంగా నిరసనలకు దారితీసింది. వ్యవసాయ మార్కెటింగ్ విధాన ముసాయిదాకు వ్యతిరేకంగా పంజాబ్-హర్యానా ఉమ్మడి రాజధానిలో వారం రోజుల పాటు 'ధర్నా'కు ఎస్కేఎం పిలుపునిచ్చిన కార్యక్రమంలో భాగంగా చండీగఢ్ వైపు వెళ్లాలని రైతు నాయకులు నిరసనకారులకు పిలుపునిచ్చారు. రైతు నాయకులపై పోలీసు చర్యకు అనేక మంది రాజకీయ నాయకులు ఆప్ ప్రభుత్వాన్ని ఖండించారు.

సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం) పంజాబ్ విభాగం బుధవారం 'చండీగఢ్ చలో' మార్చ్‌తో సహా వారం రోజుల పాటు నిర్వహించనున్న నిరసనలకు ముందు, సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు అనేక మంది రైతు సంఘాల నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్కేఎం నాయకులు, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ మధ్య జరిగిన సమావేశం ఆకస్మికంగా ముగిసిన కొన్ని గంటల తర్వాత ప్రభుత్వం అర్ధరాత్రి దాడులు జరిపిందని

- మిగతా 2 లో

ఎమ్మెల్యేలపై అనర్హత కేసులో తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీం నోటీసులు

విశాలాంధ్ర-హైదరాబాద్: పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు కోరుతూ బీఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారించింది. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై నిర్ణయానికి ఎంత సమయం కావాలో స్పీకర్‌కు తెలపాలని గత విచారణప్పుడు ఆదేశించింది. కౌంటర్లు దాఖలు చేయడానికి ఎలాంటి నోటీసులు రాలేదని, సాంకేతికంగా ఇది గమనించాల్సిన విషయమని జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ అగస్టిన్ మాసిహ్ జార్జ్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం దృష్టికి రాష్ట్ర ప్రభుత్వం, అసెంబ్లీ కార్యదర్శి తరపున న్యాయవాదులు తీసుకెళ్లారు. దీంతో ప్రభుత్వం, అసెంబ్లీ స్పీకర్, కార్యదర్శి, 10 మంది ఎమ్మెల్యేలు, కేంద్ర ఎన్నికల సంఘానికి నోటీసులను కోర్టు జారీచేసింది. కౌంటర్ దాఖలు చేయడానికి ఈనెల 22వ తేదీ వరకు గడువు ఇచ్చింది. అంతకుముందు

- మిగతా 2 లో

టీచర్లు, నేతల అరెస్టులు ఆక్షేపణీయం

తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్

విశాలాంధ్ర-మేడిపల్లి: అంగన్‌వాడీ టీచర్లు, నాయకుల అరెస్టులను ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజ్, తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందూరి కరుణ కుమారి తీవ్రంగా ఖండించారు. ఇవి అక్రమ అరెస్టులంటూ మంగళవారం ఒక ప్రకటన చేశారు. అన్ని జిల్లాల్లో అర్ధరాత్రి నుంచి పోలీసులు అరెస్టులు సాగించినట్లు దుయ్యబట్టారు. ముందస్తు సమాచారం/నోటీసులు ఇవ్వకుండా అంగన్‌వాడీ టీచర్లను వారి ఇళ్లలో నుంచి అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించడం ఆక్షేపణీయమన్నారు. ఏఐటీయూసీ అనుబంధ తెలంగాణ అంగన్‌వాడీ అసోసియేషన్ ఎలాంటి పోరాటానికి పిలుపు ఇవ్వలేదని స్పష్టంచేశారు. ఇంటెలిజెన్స్ తీరు గర్హనీయమన్నారు. నాయకులు, టీచర్లను భయభ్రాంతులకు గురిచేసేలా... పోలీసు వాహనాల్లోకి బలవంతంగా ఎక్కించి పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు సంయుక్త ప్రకటనలో బాలరాజ్, కరుణ కుమారి

- మిగతా 2 లో

నీట్‌కు పకడ్బందీ ఏర్పాట్లు: సీఎస్

విశాలాంధ్ర-హైదరాబాద్: నీట్ పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. మే 4న పరీక్ష నిర్వహణ కోసం ఏర్పాట్లపై కలెక్టర్లకు సూచనలు చేశారు. పరీక్షల నిర్వహణలో రాష్ట్ర ట్రాక్ రికార్డు దృష్ట్యా తగిన భద్రతా ఏర్పాట్లు ఉన్న ప్రభుత్వ భవనాలను గుర్తించి కేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులకు శాంతి కుమారి సూచించారు. నీట్ పరీక్ష ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, సీపీలతో డా॥ బీఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి మంగళవారం టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కేంద్రీయ విద్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల వంటి ప్రభుత్వ భవనాలను గుర్తించి పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు చేయాలన్నారు. భూ క్రమబద్ధీకరణ పథకం పురోగతినీ సీఎస్ సమీక్షించారు. ఇప్పటి వరకు అందిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్లను ఆదేశించారు. ఈ నెల 31 వరకు క్రమబద్ధీకరణ రుసుము చెల్లించిన దరఖాస్తులకు రిబేట్ (రాయితీ)పై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. గతంలో నామమాత్రపు ఫీజులు చెల్లించిన దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి ఆ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. కలెక్టర్లు ఎప్పటికప్పుడు టెలికాన్ఫరెన్స్ నిర్వహించి పురోగతిని పర్యవేక్షించాలని సీఎస్ సూచించారు. సమావేశంలో మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్, లా అండ్ ఆర్డర్ ఏడీజీపీ మహేశ్ భగవత్, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తు, ఆరోగ్య శాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి, స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఈవీ నరసింహారెడ్డి, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నరేందం పాల్గొన్నారు.

ఉక్రెయిన్‌కు సైనిక సాయం నిలిపివేత

రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధాన్ని ఆపేస్తానంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు కానీ ఆయన పగ్గాలు చేపట్టిన తర్వాత రెండు దేశాల మధ్య బంధం బలహీనమైంది.

2లో

ఇప్టాకన్నా ముందే ప్రజానాట్యమండలి

బొంబాయిలో 1943 మే 25న అఖిలభారత ప్రజానాట్య మండలి (ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ - ఇప్టా) ఏర్పడిన రోజుననే అక్కడే ఆంధ్ర ప్రజానాట్య మండలి కమిటీ కూడా ఏర్పడింది. 1943 మే 23 నుంచి జూన్ ఒకటవ తేదీ వరకు బొంబాయిలో భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ప్రథమ మహాసభలు జరిగాయి.

ప్రత్యేక వ్యాసం 4వ పేజీలో

ఇదీ లోకం!

మనం నిలబెట్టినోళ్లంతా గెలవకపోతేనేం గెలిచినోళ్లని మనోళ్లని చేసుకుంటే సరి!

ఉక్రెయిన్‌కు సైనిక సాయం నిలిపివేత

వాషింగ్టన్/మాస్కో: రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధాన్ని ఆపేస్తానంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు కానీ ఆయన పగ్గాలు చేపట్టిన తర్వాత రెండు దేశాల మధ్య బంధం బలహీనమైంది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అమెరికా పర్యటనతో ఈ విషయం బహిర్గతమైంది. శ్వేతసౌధం వేదికగా మీడియా ఎదుట జెలెన్‌స్కీ, ట్రంప్ మధ్య వాగ్వాదంతో వారి మధ్య అభిప్రాయ భేదాలు ప్రపంచానికి తెలిసి వచ్చాయి. ఉక్రెయిన్ తలొగ్గాలని అమెరికా పట్టుబట్టింది... కానీ ఉక్రెయిన్ ఒప్పుకోలేదు. దీంతో పరిస్థితి మరింత జటిలంగా మారింది. ట్రంప్ అక్కసుతో ఉక్రెయిన్‌కు సైనిక సాయాన్ని నిలిపివేశారు. దీంతో కీవ్ మరింత ఇరకాటంలో పడింది. రష్యాతో రాజీ కుదుర్చుకొనేలా ఆ దేశంపై ఒత్తిడి పెరుగుతోంది. మరోవైపు రష్యాకు అమెరికా అనుకూలమని తాజా చర్యలతో స్పష్టమవుతోంది. శాంతికి కట్టుబడి ఉన్నామని... తమ సహాయం వల్ల ఈ సమస్యకు పరిష్కారం ఎంత మేరకు జరగలదో నిర్ధారించుకోవడం కోసమే సైనిక సాయాన్ని నిలిపివేసినట్లు చెప్పుకున్నారు. రష్యాతో కాల్పుల విరమణ ఒప్పందాన్ని చేసుకోకుండా జెలెన్‌స్కీ ఎక్కువ కాలం వెళ్లదీయలేరని ట్రంప్ అన్నారు. ఈ మేరకు శ్వేతసౌధం అధికారి ఒక ప్రకటనలో వెల్లడించారు.

స్వాగతిస్తున్నాం: రష్యా

ఉక్రెయిన్‌కు సైనిక సహాయాన్ని అమెరికా నిలిపివేయడంపై రష్యా హర్షం వ్యక్తం చేసింది. ఇక శాంతిని ఆశించవచ్చు అని క్రెమ్లిన్ మంగళవారం ఓ ప్రకటన చేసింది. అమెరికా నిర్ణయాన్ని పూర్తిగా అధ్యయనం చేయాల్సిన ఉందని క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రీ పెస్కో అన్నారు. 'ఇది నిజంగా జరిగితే... శాంతి ఒప్పందం దిశగా ఉక్రెయిన్‌ను ప్రోత్సహించినట్టే! ఈ యుద్ధానికి ఇప్పటివరకు ప్రధాన సరఫరాదారుగా అమెరికా ఉంది. ఇప్పుడు సాయాన్ని ఆపేసింది. అంటే శాంతి నెలకొల్పేందుకు అద్భుత తోడ్పాటు అందించింది' అని పెస్కోవ్ అన్నారు. ఉక్రెయిన్‌లో శాంతి స్థాపనను ఆకాంక్షిస్తూ ట్రంప్ చేసిన ప్రకటనలను తాము స్వాగతిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

మమ్మల్ని లొంగదీసుకునేందుకే: ఉక్రెయిన్

తమ దేశానికి అమెరికా సైనిక సహాయాన్ని నిలిపివేయడాన్ని ఉక్రెయిన్ తీవ్రంగా ఖండించింది. తమ దేశం రష్యాకు లొంగిపోయేలా చేయాలన్నదే ట్రంప్ ప్రభుత్వ ఉద్దేశమని దుయ్యబట్టింది. ఈ మేరకు ఉక్రెయిన్ పార్లమెంటరీ విదేశీ వ్యవహారాల కమిటీ చీఫ్ మెరెజ్‌కో ఆరోపించారు. కీవ్‌పై ఒత్తిడి తేవడానికే ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారని యూరప్ దుయ్యబట్టింది. అమెరికా సాయం లేకుండా రష్యాతో ఉక్రెయిన్ పోరాడలేదని యూరప్ నాయకులు ఆందోళన వ్యక్తంచేశారు. ట్రంప్ ప్రకటన వెలువడిన అనంతరం వీరు అత్యవసరంగా సమావేశం అయ్యారు. ఉక్రెయిన్ పరిస్థితిపై చర్చించారు. జర్మనీ కొత్త చాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ కూడా అమెరికా తీరును ఖండించారు. ఉక్రెయిన్‌ను బలహీనపరిచేందుకు ట్రంప్ ఉద్దేశపూర్వకంగా ఈ చర్యకు పూనుకున్నారని విమర్శించారు. మరోవైపు జెలెన్‌స్కీ లండన్‌లో నిర్వహించిన యూరప్ దేశాధినేతల సమావేశంలో మాట్లాడుతూ అమెరికాతో ఖనిజాల ఒప్పందానికి సిద్ధమని ప్రకటించారు. రష్యాతో యుద్ధం ముగియాలంటే ఇంకా చాలా కాలం పడుతుందని, ఇది ఇప్పట్లో జరిగేది కాదని చెప్పారు. యుద్ధం ముగిసేంత వరకు అమెరికా తమకు అండగా నిలుస్తుందని ఆకాంక్షించారు.

మెక్సికో, కెనడా, చైనాపై ట్రంప్ సుంకాలు అమల్లోకి...

వాషింగ్టన్: చైనా, మెక్సికో, కెనడా దేశాలపై అమెరికా కొత్త సుంకాలు మంగళవారం నుంచి అమల్లోకి వచ్చాయి. దశాబ్దాలుగా లేని విధంగా టారిఫ్ పెంచేసి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉత్తర్వులు జారీచేశారు. మంగళవారం అర్ధరాత్రి 12.01 గంటల నుంచి కెనడా, మెక్సికో నుంచి దిగుమతి చేసుకునే అన్నింటిపై 25శాతం, చైనా దిగుమతులపై అదనంగా 10శాతం సుంకం అమల్లోకి వచ్చినట్లు అమెరికా అధికారులు తెలిపారు. ట్రంప్ అంతకుముందు శ్వేతసౌధం వద్ద విలేకరులతో మాట్లాడుతూ సుంకాలు వద్దంటే మెక్సికో, కెనడా దేశాలు అమెరికాలోనే ఆటోమొబైల్ ఫ్యాక్టరీ, ఇతర తయారీ కేంద్రాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. 'వారు చేయాల్సింది కారు ప్లాంట్లు నెలకొల్పడం. అది చేస్తే చాలు... ఎలాంటి సుంకాలు ఉండవు' అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

ప్రతిచర్యలు తప్పవు: కెనడా, మెక్సికో

అమెరికా సుంకాలు అమల్లోకి రావడంపై కెనడా, మెక్సికో ఆగ్రహం వ్యక్తంచేశాయి. ప్రతి చర్యలు తప్పబోవని హెచ్చరించాయి. అన్యాయంగా తీసుకున్న నిర్ణయానికి ప్రతి చర్యగా వచ్చే 21 రోజుల్లో 155 బిలియన్ డాలర్ల విలువైన అమెరికన్ ఉత్పత్తులపై 25శాతం సుంకాలు విధిస్తామని కెనడా ప్రధాని జస్టిన్ ట్రుడ్యూ ప్రకటించారు. వాణిజ్య బంధాన్ని దెబ్బతీసేలా... వాణిజ్య ఒప్పందానికి విఘాతం కలిగించేలా అమెరికా వైఖరి ఉందన్నారు. అమెరికా అదనపు సుంకాల కారణంగా ఇకపై అమెరికన్లు నిత్యావసరాలు, గ్యాస్, కార్లు వంటి వాటి కోసం అధికంగా చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. వేలాది ఉద్యోగాలు పోతాయని ట్రుడ్యూ స్పష్టంచేశారు. కెనడాకు సంబంధించి ఒక శాతం కంటే తక్కువ ఫెంటనిల్‌ను అమెరికా సరిహద్దు వద్ద అడ్డుకున్నారని, జనవరిలో స్వాధీనం చేసుకున్న ఫెంటనిల్ దాదాపు శూన్యమని కెనడా ప్రధాని చెప్పారు. ఇప్పటికైనా అమెరికా తన తీరును మార్చుకోవాలని హితవు పలికారు. అటు మెక్సికో కూడా ప్రతి చర్యలకు సిద్ధమైనట్లు ప్రకటించింది. అమెరికా టారిఫ్‌లపై తొలి దశ చర్చలను నివారించి... చివరి నిమిషంలో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ఉత్తర సరిహద్దు వద్దకు వేలాది దళాలను పంపింది. ఇక ట్రంప్ నిర్ణయంపైనే తమ తదుపరి కార్యాచరణ ఆధారపడి ఉంటుందని మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా అన్నారు. మెక్సికో ఏకాభిప్రాయంతో ఉందని ఆమె చెప్పారు.

మహారాష్ట్ర మంత్రి ముండే రాజీనామా

(మొదటి పేజీ తరువాయి)

వర్గాలు పేర్కొన్నాయి. దీనిపై స్పందించిన ఫడ్నవీస్ ముండే రాజీనామాను ఆమోదించి, గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌కు పంపినట్లు తెలిపారు. ఎన్‌సీపీ అజిత్ పవార్ వర్గంలోని కీలక నేత అయిన ధనంజయ్ ముండే సొంత జిల్లా బీడ్‌లోని మసాజోగ్ గ్రామ సర్పంచ్ సంతోష్ దేశ్‌ముఖ్ ఇటీవల హత్యకు గురయ్యారు. ఆయనను కిడ్నాప్ చేసి, చిత్రహింసలకు గురి చేసి దారుణంగా హత్య చేశారు. ఈ కేసును విచారించిన సీఐడీ... వాల్మీక్ కరాడ్‌ను నిందితుడిగా తేల్చింది. అతడిపై 1200 పేజీల అభియోగపత్రం దాఖలు చేసింది. సర్పంచ్‌ను హింసించి హత్య చేసినట్లు అందులో పేర్కొంది. నిందితుడు వాల్మీక్ కరాడ్, ధనంజయ ముండేకు అత్యంత సన్నిహితుడు. ఫలితంగా పౌరసరఫరాల శాఖను నిర్వహిస్తున్న ధనంజయను పదవి నుంచి తొలగించాలని డిమాండ్లు వచ్చాయి. కాగా మంత్రి ధనంజయ్ ముండేకు గట్టి మద్దతు ఇస్తున్న ఎన్‌సీపీ చీఫ్ అజిత్ పవార్‌కు మంత్రికి వ్యతిరేకంగా ఉన్న ఆధారాలను తాను సమర్పించినట్లు సామాజిక కార్యకర్త అంజలి దమానియా పేర్కొన్నారు. దీంతో ధనంజయ్ రాజీనామా చేయాలన్న డిమాండ్లు మళ్లీ మొదలయ్యాయి. ఎన్‌సీపీ (శరద్ పవార్) కార్యనిర్వాహక అధ్యక్షురాలు సుప్రియా సూలే సైతం ధనంజయ్ ముండే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేతో చర్చలు జరిపిన సీఎం దేవేంద్ర ఫడణవీస్ రాజీనామా చేయాలని ధనంజయకు స్పష్టం చేసినట్లు సమాచారం. ధనంజయ పదవికి రాజీనామా చేయగా... దాన్ని ముఖ్యమంత్రి ఫడ్నవీస్ ఆమోదించారు.

అమెరికాపై చైనా ప్రతీకార సుంకాలు

బీజింగ్: తమ దేశం నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై అదనంగా 10 శాతం సుంకాన్ని వసూలు చేసేందుకు అమెరికా సిద్ధం కావడంతో చైనా కూడా ఆ దేశ దిగుమతులపై సుంకాలు పెంచేసింది. ఇకపై 10-15 శాతం అధిక సుంకాలను మంగళవారం నుంచి అమల్లోకి తెచ్చింది. అమెరికా వ్యవసాయ, ఆహారోత్పత్తులపై దిగుమతి లెవీని 10 శాతం నుంచి 15శాతం వరకు పెంచింది. అలాగే 25 అమెరికా సంస్థలపై ఎగుమతులు, పెట్టుబడుల ఆంక్షలు విధించింది. అమెరికా చికెన్, గోధుమలు, మొక్కజొన్న, పత్తిపై సుంకాన్ని 15శాతం పెంచుతూ చైనా ఆర్థిక శాఖ ఓ ప్రకటన చేసింది. సోయా బీన్స్, సోర్గమ్, పోర్క్, బీఫ్, పండ్లు, కూరగాయలు, డెయిరీ ఉత్పత్తులపై 10శాతం లెవీ పెంచుతున్నట్లు వెల్లడించింది. ఈనెల 10వ తేదీ నుంచి కొత్త సుంకాలు అమల్లోకి వస్తాయని తెలిపింది. అమెరికా ఏకపక్షంగా టారిఫ్‌లు పెంచేయడం ద్వారా ప్రపంచ కార్మిక సంస్థ నిబంధనలను అతిక్రమిస్తోందని... తమ మధ్య ఆర్థిక-వాణిజ్య సహకారాన్ని దెబ్బతీస్తున్నదని చైనా వాణిజ్య శాఖ పేర్కొంది. తమ న్యాయమైన హక్కులు, ప్రయోజనాలను కాపాడుకుంటామని చైనా స్పష్టం చేసింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) వివాదాల పరిష్కార యంత్రాంగం ద్వారా అమెరికాపై చట్టపరంగా చర్యలకూ చైనా పూనుకుంది.

రక్షణ బడ్జెట్ పెంపునకు కసరత్తు

చైనా తన రక్షణ బడ్జెట్‌ను పెంచుకునేందుకు కసరత్తు మొదలు పెట్టింది. శక్తిని, సామర్థ్యాన్ని పెంచుకోవడం ద్వారానే శాంతి, సార్వభౌమత్వాన్ని పరిరక్షించుకోగలమన్నది చైనా భావన. ఇదే క్రమంలో ప్రధాని లీ కియాంగ్ బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నారు. ఎయిర్‌క్రాఫ్టుల తయారీ, అత్యాధునిక సాంకేతిక కలిగిన యుద్ధ నౌకల నిర్మాణంతో సాయుధ దళాలను ఆధునీకరించే దిశగా చైనా కసరత్తు చేస్తోంది. ఇందుకోసం భారీగా ఖర్చు పెడుతోంది. గతేడాది 232 బిలియన్ డాలర్లతో రక్షణ బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. అంతకుముందు ఏడాదితో పోలిస్తే ఇది 7.2శాతం ఎక్కువ. నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ బుధవారం నుంచి ప్రారంభం అవుతున్న క్రమంలో బడ్జెట్ ప్రతిపాదనల మేరకు రక్షణకు కేటాయింపులు భారీగా పెరగనున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.

పేదల భూములు తిరిగి ఇచ్చేయాలి

భూ అక్రమాలపై ఐఏఎస్ అధికారితో విచారణ

ఏపీ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్

కబ్జాలను జిల్లా మంత్రుల దృష్టికి తీసుకువెళతాం

విశాలాంధ్ర బ్యూరో-శ్రీ సత్యసాయి జిల్లా: నిరుపేదలకు చెందిన భూములను వెంటనే వారికి తిరిగి ఇచ్చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం నియోజకవర్గం ముదిగుబ్బ మండలం పెద్ద బాపనపల్లి తండాలో గిరిజన భూముల కబ్జా విషయం తెలుసుకున్న రామకృష్ణ మంగళవారం ఆ గ్రామం రచ్చబండ వద్ద భూములు కోల్పోయిన రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గిరిజనులకు చెందాల్సిన 200 ఎకరాల భూమిని ముదిగుబ్బ మండల అధ్యక్షులు గోడ్డుమరి ఆదినారాయణ యాదవ్ కబ్జా చేశారని పెద్ద బాపనపల్లి తండా రైతులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. తమ తాతల కాలం నుంచి ఉన్న భూములను తిరిగి తమకు ఇప్పించి న్యాయం చేయాలని కోరారు. రామకృష్ణ మాట్లాడుతూ పేద ప్రజలు, అమాయక గిరిజనులకు చెందిన 200 ఎకరాల భూమిని ఆదినారాయణ యాదవ్ తమ తమ కుటుంబీకుల పేరుతో ఆన్‌లైన్‌లో పట్టాలెక్కించుకొని, ఆ భూముల మీద బ్యాంకులో రుణం తీసుకున్నారని విమర్శించారు. ఈ భూములు నిరుపేదలవని, వారి భూములు వారికే చెందాలని అన్నారు. ఇక్కడ జరుగుతున్న భూ అక్రమాలను ఈనెల 7న జిల్లా ఇంచార్జ్ మంత్రి, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ దృష్టికి తీసుకు వెళతామని తెలిపారు. అలాగే ధర్మవరం నియోజకవర్గ ఎమ్మెల్యే, మంత్రి సత్యకుమార్ దృష్టికి కూడా తీసుకువెళతామన్నారు. ఈ భూ అక్రమాలపై ఐఏఎస్ అధికారితో విచారణ చేపట్టి పేదల భూమి పేదలకే చెందేలా చేయాలన్నారు. భూ కబ్జాలకు సహకరించిన అధికారులపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ భూములు పేదలకు చెందే వరకు తమ పోరాటం ఆగదని, రాష్ట్ర వ్యాప్తంగా దశలవారీగా ఉద్యమం చేస్తామని స్పష్టం చేశారు. సీపీఐ ముదిగుబ్బ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, వ్యవసాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామచంద్రప్ప, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కాటమయ్య, చేనేత సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకా చలపతి, సీపీఐ ధర్మవరం నియోజకవర్గ కార్యదర్శి మధు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సంతోష్ కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మహదేవప్ప, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య, బత్తలపల్లి మండల కార్యదర్శి బండల వెంకటేశ్ తదితరులతో పాటు సీపీఐ ముదిగుబ్బ నాయకులు, మండల కార్యదర్శి డాబా రామకృష్ణ, గంగిరెడ్డిపల్లి నాయుడు, చల్లా శంకర, రాధాకృష్ణ, రామంజి, వై.రమేష్, మధు, సీపీఐ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

జామియా విద్యార్థుల సస్పెన్షన్‌పై ఢిల్లీ హైకోర్టు స్టే

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఫిర్యాదు చేయాలని కూడా వర్సిటీకి జస్టిస్ దినేశ్ కుమార్ శర్మ సూచించారు. విద్యార్థులు శాంతియుతంగా నిరసన తెలిపినట్లు వారి తరపు న్యాయవాదులు తెలిపారు. జామియా తరపున న్యాయవాదులు అమిత్ సహని, కిస్లే మిశ్రా వాదనలు వినిపించారు. విద్యార్థులు ముందస్తు అనుమతులు తీసుకోలేదని, ఆస్తిని ధ్వంసం చేశారన్నారు. క్యాంటీన్ బయట నిద్రించారని, ఇందుకు అనుమతి లేదని కోర్టుకు తెలిపారు. ఫిబ్రవరిలో కొందరు విద్యార్థులు క్యాంపస్‌లో ఆందోళన చేయగా, ఢిల్లీ పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. గంటల తరబడి విద్యార్థులను పట్టించుకోకపోవడానికి నిరసనగా కొందరు విద్యార్థులు ఆందోళన చేపట్టారు. కాగా, దాదాపు 12 గంటల నిర్బంధం తర్వాత విద్యార్థులు అందరినీ విడుదల చేశారు.

పంజాబ్‌లో రైతు నేతల నిర్బంధం

(మొదటి పేజీ తరువాయి)

ఎస్‌కేఎం పేర్కొంది. 'సోమవారం సాయంత్రం మొదట ముఖ్యమంత్రి భగవంత్ మాన్... ఎస్‌కేం నాయకులతో సమావేశం నుంచి బయటకు వెళ్లారు. తరువాత పోలీసులు నాయకుల ఇళ్లపై దాడి చేయడం ప్రారంభించారు. పోలీసులు తెల్లవారుజామున 3 గంటలకు ఫిరోజ్‌పూర్‌లోని నా ఇంటికి వచ్చి నన్ను అరెస్టు చేశారు' అని క్రాంతికారి కిసాన్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్మీత్ సింగ్ మెహ్మా ఒక వీడియో సందేశంలో ఆరోపించారు. మెహ్మాతో పాటు, క్రాంతికారి కిసాన్ యూనియన్ నాయకులు జంగ్వీర్ సింగ్ చౌహాన్, మంజీత్ రాజ్, సుర్జీత్ సింగ్‌ను కూడా వరుసగా తాండా, బర్నాలా, మోగాలలో అదుపులోకి తీసుకున్నారు. భారతీయ కిసాన్ యూనియన్ (బీకేయూ) ఉగ్రహన్ అధ్యక్షుడు జోగిందర్ సింగ్ ఉగ్రహన్ ఇంటికి పోలీసులు చేరుకున్నారని, కానీ అతని ఆచూకీ తెలియలేదని తెలుస్తోంది. బీకేయూ రాజేవాల్ ప్రధాన కార్యదర్శి మహేష్ చందర్ శర్మ, బీకేయూ లఖోవాల్ అధ్యక్షుడు హరీందర్ సింగ్ లఖోవాల్‌ను కూడా లూథియానా, మొహాలిలోని వారి ఇళ్ల నుంచి అదుపులోకి తీసుకున్నారు. 'పోలీసులు ఎస్‌కేఎం నాయకుల ఇళ్లపై దాడి చేస్తున్నారు. మా డిమాండ్లను పరిగణనలోకి తీసుకునే బదులు, మమ్మల్ని అరెస్టు చేయడానికి పోలీసులను మా ఇళ్లకు పోలీసులను పంపుతున్నారని లఖోవాల్ వీడియో సందేశంలో తెలిపారు. మంగళవారం తెల్లవారుజామున 4 గంటలకు బతిండాలోని తన ఇంటికి పోలీసులు వచ్చారని... పెద్ద ఎత్తున రైతులు అక్కడికి చేరుకోవడంతో తిరిగి వెళ్లారని బీకేయూ ఉగ్రహన్ నాయకుడు గులాబ్ సింగ్ తెలిపారు. 'ఎక్స్' లో చేసిన పోస్ట్‌లో శిరోమణి అకాలీదళ్ మాజీ అధ్యక్షుడు సుఖ్‌బీర్ సింగ్ బాదల్ ఈ పరిణామాలను ఖండించారు. 'పంజాబ్‌లో రైతు నాయకుల ఇళ్లపై దాడి చేసినందుకు దురహంకార ముఖ్యమంత్రిని నేను తీవ్రంగా ఖండిస్తున్నాను. ఆప్ ప్రభుత్వం ఇటువంటి అవమానకరమైన చర్యలను అమలు చేయడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది' అని పంజాబీలో పేర్కొన్నారు. నాయకుల ఇళ్లపై పోలీసులు దాడి చేస్తున్న వీడియోలను పోస్ట్ చేశారు. కేంద్ర రైల్వే సహాయ మంత్రి ఎంపీ రవ్నీత్ సింగ్ బిట్టు 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేస్తూ... 'భగవంత్ మాన్ నేతృత్వంలోని ప్రభుత్వం పంజాబ్‌లో అత్యవసర పరిస్థితిని సృష్టించింది. పంజాబ్ రైతులకు సంబంధించిన సమస్యలపై ఇది బయటపడిన తర్వాత ఇప్పుడు అది వ్యవసాయ నాయకులపై పోలీసు వ్యూహాలను ఆశ్రయిస్తోంది. మేము తరచూ చెప్పినట్లుగా ముఖ్యమంత్రి రాష్ట్రాన్ని పోలీసు రాష్ట్రంగా మార్చారు. రైతులపై పంజాబ్ పోలీసుల చర్యలు తీవ్రంగా ఖండించదగినవి. ఇది పంజాబ్‌లోని ఆప్ ప్రభుత్వ రైతు వ్యతిరేక మనస్తత్వాన్ని స్పష్టంగా ప్రతిబింబిస్తోంది' అని పేర్కొన్నారు. పోలీసు చర్యకు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ప్రతాప్ సింగ్ బజ్వా రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. 'రైతులు తమ న్యాయమైన డిమాండ్లను ఆమోదించాలని నిరసన తెలుపుతున్నారు. రైతులను అరెస్టు చేయడానికి బదులుగా అవినీతి మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులపై చర్యలు తీసుకోండి. రైతు నాయకులను వెంటనే విడుదల చేయాలని నేను డిమాండ్ చేస్తున్నాను' అని అన్నారు. రైతులు 18 డిమాండ్లపై పట్టుబడుతున్నారు. వీటిలో దాదాపు 12 అంశాలు రాష్ట్రానికి సంబంధించినవని ఆ వర్గాలు తెలిపాయి. కాగా, చండీగఢ్‌లో నిరసన తెలిపేందుకు రైతులకు ఇంకా స్థలం కేటాయించలేదు. గత ఏడాది సెప్టెంబరులో రైతులు చివరిసారిగా చండీగఢ్‌లో వారం రోజుల ధర్నా చేశారు.

రైతుల డిమాండ్లను కేంద్రమే పరిష్కరించాలి: సీఎం మాన్

సోమవారం రైతులతో సమావేశం తర్వాత ముఖ్యమంత్రి భగవంత్ మాన్ మాట్లాడుతూ రైతులతో చర్చలకు ఎల్లప్పుడూ తలుపులు తెరిచి ఉన్నప్పటికీ, నిరసనల పేరుతో ప్రజలకు కలిగే అసౌకర్యాన్ని నివారించాలని అన్నారు. చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉందని, రోడ్లు, రైల్వే రవాణాకు అంతరాయం కలిగించడం వల్ల సామాన్యులకు ఇబ్బందులు తప్పవని ఆయన ఒక ప్రకటనలో నొక్కి చెప్పారు. ఇటువంటి అంతరాయాలు నిరసనకారులకు వ్యతిరేకంగా ప్రజల మనోభావాలను మార్చగలవని, దీనివల్ల సమాజంలో మరింత విభజనలు ఏర్పడతాయని, ఈ పద్ధతులను మానుకోవాలని ముఖ్యమంత్రి రైతులకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వారికి మద్దతు ఇస్తున్నప్పటికీ, వారి కీలక డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాల్సిన అవసరం ఉందని పునరుద్ఘాటించారు.

బకాయి వెంటనే చెల్లించండి

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. తొలుత నాలుగు వేల మెగావాట్లకు అనుమతులు ఇచ్చి ఆపై దానిని వెయ్యి మెగావాట్లకు కుదించిందన్నారు. మహిళా సంఘాల ద్వారా సోలార్ విద్యుదుత్పత్తిని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. వీరి విజ్ఞప్తులకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. సమావేశంలో ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి మాణిక్‌రాజ్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ చౌహాన్, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.

మేడారం, గోదావరి పుష్కరాలు ప్రతిష్ఠాత్మకంగా జరుపుకుందాం

(మొదటి పేజీ తరువాయి)

అంశాలను ఆ సమావేశంలో చర్చిస్తామన్నారు. ఉపాధి హామీ పథకాన్ని వినియోగించుకొని చెక్ డ్యాములు, ఇతర పనులు చేపట్టాలని భట్టి విక్రమార్క సూచించారు. హైదరాబాద్‌తో పాటు పరిసరాల్లో 59 అర్బన్ పార్కులను అభివృద్ధి చేసి ఆదాయాన్ని పెంచుకునే మార్గాలను అన్వేషించాలని ఆదేశించారు. వన మహోత్సవంలో విద్యార్థులకు భాగస్వామ్యం కల్పించాలన్నారు. రెండున్నర అడుగుల ఎత్తుకు తగ్గకుండా ఉన్న మొక్కలను నాటడం ద్వారా అవి బతికేందుకు ఎక్కువ అవకాశం ఉంటుందని ఉప ముఖ్యమంత్రి చెప్పారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీం, దేవదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రమా అయ్యర్, అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ డోబ్రియాల్ పాల్గొన్నారు.

తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీం నోటీసులు

(మొదటి పేజీ తరువాయి)

అనర్హత పిటిషన్లపై స్పీకర్ నిర్ణయం తీసుకునేందుకు రీజనబుల్ టైమ్ అంటే ఎప్పటివరకు? ప్రజాస్వామ్య విధానాలు ఏం కావాలి? ఎంత సమయం కావాలి? చెప్పండి అని ధర్మాసనం ప్రశ్నించింది. 'ఆపరేషన్ సక్సెస్, పేషంట్ డెడ్' అన్నట్లుగా వ్యవహరించడం సరికాదని సూచించింది. బీఆర్ఎస్ తరపున సీనియర్ న్యాయవాది అర్యమ సుందరం వాదనలు వినిపించారు. అనర్హత పిటిషన్లపై నిర్ణయంలో ఉద్దేశపూర్వక జాప్యం జరుగుతోందని, స్పీకర్ నిర్ణయం తీసుకోకపోవడమంటే రాజ్యాంగబద్ధ విధులను నిర్వహించడంలో విఫలమైనట్లేనని వ్యాఖ్యానించారు. వాదనల అనంతరం తదుపరి విచారణ 25వ తేదీకి వాయిదా పడింది.

కన్నడ నటి రాన్యా రావ్ అరెస్టు

(మొదటి పేజీ తరువాయి)

సమాచారం. డీఆర్ఐ అధికారులు ప్రశ్నించగా తాను డీజీపీ కుమార్తెనని చెప్పి ఇంటి వద్ద దించేందుకు పోలీసులకు కాల్ చేసినట్టు చెప్పారని సమాచారం. పోలీసు అధికారులతో రాన్యాకు సంబంధమేంటి? ఆ స్మగ్లింగ్‌లో వారి ప్రమేయం ఉందా? అన్న కోణంలో డీఆర్ఐ దర్యాప్తు జరుగుతోంది.

పట్టభద్రుల విజయం సంజీవని

కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయోత్సవ సభలో సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: కూటమి అభ్యర్థుల గెలుపు రాష్ట్ర పునర్నిర్మాణానికి సంజీవనిగా పనిచేస్తుందని సీఎం చంద్రబాబు అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు ఆలపాటి రాజేంద్రప్రసాద్, పేరాబత్తుల రాజశేఖర్ ఘన విజయం సాధించిన సందర్భంగా టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విజయోత్సవ సభలో సీఎం పాల్గొన్నారు. ఈసందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ గత 9 నెలల కాలంలోనే రికార్డుస్థాయిలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని, వీటిని పట్టభద్రులు గమనించే కూటమికి పట్టం కట్టారని అన్నారు. అసాధ్యమనుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిలిపివేత సుసాధ్యం చేశాం. దానిని నిలబెట్టేందుకు అవసరమైన ఆర్థిక సహాయం సాధించాం. విశాఖ రైల్వేజోన్ పూర్తి చేసుకుంటున్నాం. అమరావతి, పోలవరం ప్రాజెక్టులకు నిధులు సాధించి పనులు ప్రారంభించాం. ఆరున్నర లక్షల కోట్ల పెట్టుబడులు సాధించి 5లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేశామని సీఎం వివరించారు. తెలంగాణ కూడా కరవు ప్రాంతాలకు నీటిని తరలించుకోవచ్చని సూచించారు. కాళేశ్వరం అభివృద్ధి చేసి చాలా మంచి పనిచేశారన్నారు. ఇంకా నీరు కావాలని తెలంగాణ తీసుకున్నా తనకు అభ్యంతరం లేదని చంద్రబాబు వెల్లడించారు. ఏపీ ప్రాంతానికి తరలించే నీటి విషయంలో తెలంగాణ బాధపడవద్దని కోరారు.

ఉద్యోగాల వయోపరిమితి 42 ఏళ్లు

ఏపీపీఎస్సీ కీలక నిర్ణయం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : రాష్ట్రంలోని నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త తెలిపింది. ఆంధ్ర ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ద్వారా భర్తీ చేయబోయే ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు వయోపరిమితి పొడిగిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. నాన్ యూనిఫామ్ (సాధారణ) ఉద్యోగాలకు వయోపరిమితి 34 నుంచి 42 ఏళ్లకు, యూనిఫామ్ ఉద్యోగాలకు వయోపరిమితి రెండేళ్లు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఏడాది సెప్టెంబరులో జరిగే నియామకాలకు వయోపరిమితి పెంపు వర్తిస్తుందని తెలిపింది. దీంతో ఏపీపీఎస్సీ ద్వారా గ్రూప్1, గ్రూప్-2 తో పాటు వివిధ విభాగాల పోటీ పరీక్షలకు హాజరయ్యే నిరుద్యోగులకు ఇది మంచి శుభవార్తే. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ ఉద్యోగ నియామకాలు సక్రమంగా జరగడం లేదు. జాబ్ క్యాలెండర్ నిర్దిష్టకాల పరిమితితో అమలు చేయడం లేదు. ఎన్నికల మేనిఫెస్టోల్లో రాజకీయ పార్టీలు హామీలకే పరిమితమవుతుండటంతో ఉద్యోగాల భర్తీ నిలిచిపోతోంది. ఏళ్ల తరబడి నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఎదురు చూసి వయోపరిమితిని కోల్పోతున్నారు. దీనిని గుర్తించిన కూటమి ప్రభుత్వం నాన్ యూనిఫామ్ ఉద్యోగాలకు 34 నుంచి 42 ఏళ్లకు పెంచింది. ఈ వయోపరిమితి పెంపు చాలబోదని, కనీసం 45 ఏళ్లకు జనరల్ అభ్యర్థులకు పెంచాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ డిమాండ్ చేస్తోంది.

వయో పరిమితి 45 సంవత్సరాలు పెంచాలి : ఏఐవైఎఫ్

ఏపీపీఎస్సీతో పాటు ఇతర ఏజెన్సీల ద్వారా నేరుగా నియమించే ఉద్యోగాలకు వయో పరిమితిని 45 సంవత్సరాలకు పెంచాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరుచూరి రాజేంద్రబాబు డిమాండ్ చేశారు. యూనిఫాం సర్వీసులు పోలీసు, అగ్నిమాపక, ఇతర భద్రతా శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగులకు గరిష్ఠ వయో పరిమితిని రెండేళ్లు పెంచగా, నాన్-యూనిఫాం ఉద్యోగాల గరిష్ఠ వయో పరిమితిని 34 ఏళ్ల నుంచి 42 ఏళ్లకు పెంచుతూ ఉత్తర్వులు జారీచేశారని నాన్ యూనిఫాం సర్వీసులకు 45 సంవత్సరాలు పెంచాలని అన్నారు. అనేక సంవత్సరాలుగా నోటిఫికేషన్ విడుదల కాకపోవడంతో నిరుద్యోగులు చాలా మంది అనర్హులుగా మిగిలిపోయారని, వారిని కూడా దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు.

టీచర్లు, నేతల అరెస్టులు ఆక్షేపణీయం

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు. ఈ అరెస్టు గురించి ఇంటెలిజెన్సీ అధికారులను అడిగితే వారు తమకు కారణాలు తెలియదని చెప్పారని, దీనిని బట్టి పోలీసులే ఏకపక్షంగా వ్యవహరించారని అర్థమవుతోందని, ఇది మానవ హక్కుల ఉల్లంఘనేనని నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి విరుద్ధంగా జరుగుతున్న అక్రమ అరెస్టులను ఆపాలని, భవిష్యత్తులో పునరావృతం కాకుండా చూడాలని... లేని పక్షంలో ఆందోళనలు తప్పబోవని బాలరాజ్, కరుణకుమారి తేల్చిచెప్పారు. అరెస్టు చేసిన వారందరినీ బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాగా, అరెస్టైన అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి ప్యారిజాన్‌తో పాటు కవిత, ఉమాదేవి, సులోచన, రమ, సుశీల, సుచిత్ర, శోభ, రమాను మేడిపల్లి పోలీసు స్టేషన్ నుంచి ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి దండు రమేశ్ అనంతరం విడిపించారు.

ఫైనల్‌కు భారత్

(మొదటి పేజీ తరువాయి)

1 ఫోర్, 1 సిక్స్) ఫర్వాలేదనిపించారు. శుభ్‌మన్ గిల్ (8) నిరాశపర్చాడు. ఆసీస్ బౌలర్లలో ఆడమ్ జంపా 2, బెన్ డ్వార్షుయిస్, నాథన్ ఎల్లిస్, కూపర్ కనోలీ ఒక్కో వికెట్ పడగొట్టారు. మార్చి 9న ఫైనల్ మ్యాచ్ దుబాయ్‌లో జరగనుంది. బుధవారం దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ మధ్య జరిగే సెమీ ఫైనల్-2లో విజేతగా నిలిచిన జట్టు తుది పోరులో భారత్‌తో తలపడనుంది. ఆస్ట్రేలియా బ్యాటర్లలో కెప్టెన్ స్టీవ్ స్మిత్ (73; 96 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్), అలెక్స్ కేరీ (61; 57 బంతుల్లో 8 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ శతకాలు సాధించారు. ప్రమాదకర ఓపెనర్ ట్రావిస్ హెడ్ (39; 33 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సలు), మార్నస్ లబుషేన్ (29), బెన్ డ్వార్షుయిస్ (19), జోష్ ఇంగ్లిస్ (11), నాథన్ ఎల్లిస్ (10), మ్యాక్స్‌వెల్ (7) పరుగులు చేశారు. భారత బౌలర్లలో మహ్మద్ షమీ 3, రవీంద్ర జడేజా 2, వరుణ్ చక్రవర్తి 2, అక్షర్ పటేల్, హార్దిక్ పాండ్య ఒక్కో వికెట్ పడగొట్టారు.

హస్తకలలపై శిక్షణ సదస్సు

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : ములుగు జిల్లా అటవీశాఖ కార్యాలయంలో ఎస్ టీ సిరి వాలంటరి ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలోమంగళవారం ములుగు జిల్లాలోని మేదరి కులస్తులకు, అటవీ శాఖ ఆధ్వర్యంలో చేతి వృత్తులపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో హార్నమెంటల్ (బాంభో) సామాగ్రి ద్వారా, తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం లభించే విధంగా, వస్తువులు తయారు చేయడం పై మధ్యప్రదేశ్ కి చెందిన ఇద్దరు ట్రయినలర్లు ద్వారా,30 మంది ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు .ఈ కార్యక్రమంలో ములుగు డిఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్ పాల్గొని చేతివృత్తుల ద్వారా చేసే వస్తువులకు సమాజంలో విపరీతమైన ఆదరణ పెరిగిందని, దీనిని మేదర కులస్తులు, సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన తెలియజేశారు. నెలరోజుల పాటు శిక్షణ కార్యక్రమం ఇవ్వడంతో పాటు, ఇక్కడ తయారు చేసిన వస్తువులను, స్టాళ్ళ రూపంలో మార్కెట్లో అమ్మడం కోసం, ప్రభుత్వం ద్వారా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ములుగు ఎఫ్ఆర్ఓ డోలి శంకర్,ఎఫ్బిఓ శ్యామ్ సుందర్,శివ కృష్ణ , ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి
ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్

విశాలాంధ్ర బ్యూరో - మహబూబాబాద్: పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి జిల్లా పోలీస్ శాఖ ఎల్లపుడు కృషి చేస్తుందని జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. మంగళవారం జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో జిల్లా పోలీస్ స్పెషల్ పార్టీ,బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్,సాయుధ సిబ్బంది తో (దర్బార్) సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మట్లాడుతూ పోలీస్ శాఖలో పనిచేసే ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ కలిగి ఉండాలని, భాద్యతగా తమ విధులను నిర్వర్తిస్తూ ప్రజలకు సేవలందించాలని అన్నారు. పోలీసులు వృత్తి నిర్వహణలో నైపుణ్యాలను పెంచుకోవాలని, నిరంతరం విధులలో ఉండే పోలీసు అధికారులు, సిబ్బందికి వ్యక్తిగత,కుటుంబపరమైన,శాఖాపరమైన సమస్యలను పరిష్కరించేందుకు ఎల్లపుడూ ముందుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ డిఎస్పీ తిరుపతి రావు, ఏ.ఆర్. డిఎస్పీలు శ్రీనివాస్, విజయ్ ప్రతాప్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ చంద్రమౌళి, డీసీఆర్బి ఇన్స్పెక్టర్ సత్యనారాయణ,ఆర్.ఐలు అనిల్, భాస్కర్, సోములు, నాగేశ్వర్రావు, ఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బేస్ బాల్ క్రీడాకారులకు కలెక్టర్ అభినందనలు

విశాలాంధ్ర బ్యూరో - మహబూబాబాద్: సిద్దిపేట జిల్లా గజ్వేల్ లో ఫిబ్రవరి 28 నుంచి మార్చి 2 వరకు జరిగిన ఐదవ రాష్ట్రస్థాయి బేస్ బాల్ సబ్ జూనియర్ బాల బాలికల పోటీల్లో రాష్ట్రస్థాయి లో రన్నర్స్ గా నిలిచిన బాలుర జట్టును మంగళవారం ఐ.డి.ఓ.సి లోని కలెక్టర్ చాంబర్ లో జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ,జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, అడిషనల్ కలెక్టర్ వీర బ్రహ్మాచారి అభినందించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ గతంలో సీనియర్ బేస్ బాల్ పోటీల్లో కూడా మూడో స్థానం సాధించారని, ఇప్పుడు సబ్ జూనియర్ బేస్ బాల్ పోటీల్లో రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం సాధించడం జిల్లాకు గర్వకారణమని అన్నారు. భవిష్యత్తులో ప్రథమ స్థానంలో నిలిచి మహబూబాబాద్ జిల్లా పేరు ప్రతిష్టలు నిలబెట్టాలని అన్నారు అన్నారు.రాష్ట్ర స్థాయి పోటీల్లో బెస్ట్ పిక్చర్ గా అవార్డు అందుకున్న కేసముద్రం మండలం కల్వల మోడల్ స్కూల్ విద్యార్థి పరమేష్ను, జిల్లా బేస్బాల్ క్రీడాకారులను పథకాలు సాధించేలా ప్రోత్సహిస్తున్న మహబూబాబాద్ జిల్లా సెక్రెటరీని ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో బేస్ బాల్ అసోసియేషన్ మహబూబాబాద్ జిల్లా సెక్రెటరీ కల్లూరి ప్రభాకర్, డివైఎస్ఓ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల అరెస్టులు అప్రజాస్వామికం : సిఐటియు

విశాలాంధ్ర - గార్ల : మినీ అంగన్వాడి టీచర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉద్యమానికి సిద్ధమైన అంగన్వాడీ టీచర్ లను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ లలో ఉంచడం ప్రభుత్వ నిరంకుశ పాలనకు నిదర్శనమని సిఐటియు మండల కన్వీనర్ కందునూరి శ్రీనివాస్ విమర్శించారు. మంగళవారం అంగన్వాడీ టీచర్ల ముందస్తు అరెస్టుల నిరసిస్తూ శ్రీనివాస్ మాట్లాడుతూ వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేసారు. అంగన్వాడి వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో హైదరాబాదులో తలపెట్టిన ఆందోళనకు బయలుదేరేందుకు సిద్ధంగా ఉన్న అంగన్ వాడీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులో తీసుకోవడం అప్రజాస్వామికమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న అంగన్వాడి పోస్టులను తక్షణమే భర్తీ చేయాలనీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి అలవాల సత్యవతి, భూక్యా నీలాదేవి, భారతి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు రేడియం స్టిక్కరింగ్ తప్పనిసరి
సీఐ వెంకటేశ్వరరావు

విశాలాంధ్ర - పినపాక : వాహనాల వల్ల రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు తమ వాహనానికి తప్పని సరిగా రేడియం స్టిక్కరింగ్ చేయించాలని ఏడూళ్ళ బయ్యారం సీఐ వెంకటేశ్వరరావు కోరారు. మంగళవారం మండలంలోని సీతారామపురం వద్ద ఆయన వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన స్టిక్కరింగ్ లేని వాహనాలకు అక్కడికక్కడే స్టిక్కరింగ్ చేయించారు. చిన్న చిన్న ముందస్తు జాగ్రత్తలతో ప్రమాదాలను నివారించవచ్చని వాహన దారులకు సూచనలు చేసారు. అతి వేగం ప్రమాదాలకు మూలం అన్నారు. వాహనం నడిపే ప్రతి ఒక్కరు వాహనం పై పూర్తి నియంత్రణ, ఏకగ్రత పెట్టి నడపాలని సూచించారు. అతి వేగంతో వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకుని తమ కుటుంబాలను అనాథలు చేయొద్దన్నారు.

రాష్ట్ర బడ్జెట్లో బీసీలకు రూ.20వేల కోట్లు కేటాయించాలి
బీసీ హక్కుల సాధన సమితి

విశాలాంధ్ర- నేరేడుచర్ల : రాష్ట్ర బడ్జెట్లో బీసీలకు 20వేల కోట్ల రూపాయలు కేటాయించాలని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు విజ్ఞప్తి చేశారు .ఆదివారం నాడు ఆయన బీసీ యువజన సమాఖ్య సమావేశంలో బీసీ యువ నేతలతో కలిసి సూర్యాపేట జిల్లా నేరేడుచర్లలో పాత్రికేయులతో మాట్లాడుతూ శాసనసభ ఎన్నికల సందర్భంగా కామారెడ్డి బీసీ డిక్లరేషన్లు సంవత్సరానికి 20వేల కోట్ల రూపాయలు బీసీల అభివృద్ధి కోసం ఖర్చు పెడతామని హామీ ఇచ్చి ఉన్నారని, కానీ గత బడ్జెట్లో కేవలం 9,700 కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించారని అందులో కనీసం సగం కూడా ఖర్చు చేయలేదని, ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీనైనా కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని, ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్న విధానాన్ని అభినందిస్తున్నామని అలాగే కామారెడ్డి డిక్లరేషన్లో ఇచ్చిన అన్ని రకాల హామీలను అమలు చేసేందుకు ప్రభుత్వం ముందుకు రావాలని ఆయన కోరారు.ప్రధానంగా మూడు లక్షల రూపాయలలోపు వార్షిక ఆదాయం కలిగిన కుటుంబాలకు బీసీ బంద్ పథకాలను వర్తింపజేసి 10 లక్షల రూపాయలు ఆర్థిక సహాయం అందించాలని అన్ని మండల కేంద్రాల్లో చేతివృత్తుల వారైన కమ్మరి కుమ్మరి వడ్రంగి స్వర్ణకారులు నాయి బ్రాహ్మణులు రజకులు చేనేత కార్మికులకు 50 దుకాణాలతో కూడిన షాపింగ్ మాల్స్ ఏర్పాటు చేసి వృత్తి బజారులను ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.బీసీ యువ నాయకులుకొమర్రాజు వెంకట్, దూపాటి అనిల్, నక్క వెంకట్, ఎస్కె పుల్లీ సాహెబ్ ఉన్నారు.

ఎగుమతులకు ప్రభుత్వం చొరవ చూపడం లేదు

- ఐక్య పోరాటాలకు సిద్ధం కండి
- అఖిలపక్ష రైతు సంఘాల నేతలు

విశాలాంధ్ర - ఖమ్మం : వ్యవసాయోత్పత్తుల ఎగుమతులు ముఖ్యంగా మిర్చి ఎగుమతికి ప్రభుత్వం చొరవ చూపడం లేదని ప్రముఖ -వ్యవసాయ శాస్త్రవేత్త బలేజి పల్లి శరత్ బాబు తెలిపారు. గతేదాది పండించిన మిర్చి పెద్ద మొత్తంలో నిల్వ ఉండడం ప్రపంచ -వ్యాప్తంగా మిర్చి దిగుమతి చేసుకునే దేశాలలో వివిధ రకాల సంక్షోభాలు ఏర్పడడం కారణంగానే మిర్చి ధర గణనీయంగా -పడిపోయిందని ఆయన విశ్లేషించారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా మహాసభను పురస్కరించుకుని మంగళవారం మిర్చి -ధర పతనం పరిష్కార మార్గం అనే అంశంపై సదస్సు నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ మీటింగ్ హాల్లో జిల్లా అధ్యక్షులు -దొండపాటి రమేష్ అధ్యక్షతన జరిగిన సదస్సులో శరత్ బాబు మాట్లాడుతూ పండించిన వివిధ రకాల మిర్చిని -పలు దేశాలు దిగుమతి చేసుకునేవి. ఈ ఏడాది దిగుమతుల విషయంలో ఆయా దేశాల స్థానిక పరిస్థితులు అన్నింటికి మించి -అమెరికాలో ట్రంప్ తీసుకుంటున్న చర్యలు కారణమవుతున్నాయన్నారు. భారతదేశ ప్రధాని ట్రంప్ తో సమావేశమైనప్పుడు -ఎగుమతుల విషయంపై చొరవ చూపాల్సిందని శరతా బాబు అభిప్రాయపడ్డారు. భారతదేశంలో పండించే కొన్ని మిర్చి రకాలకు ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్ ఉందన్నారు. రైతులే ఎగుమతి చేసుకుంటే దళారీ వ్యవస్థతో ఇబ్బంది ఉండదన్నారు. -ఎఫ్పివోలుగా ఏర్పడి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. మార్కెట్ను నిరం తరం అధ్యయనం చేయాలని, రైతులకు రైతు -సంఘాల నేతలకు సూచించారు. దేశంలో వ్యవసాయ రంగ పరిశోధనలు అనుకున్న స్థాయిలో రైతులకు ఉపయోగపడడం లేదన్నారు. మిర్చి పంటకు భవిష్యత్తు ఉందని ఎగుమతి అవకాశాలు తప్పక లభిస్తాయని -శరత్బాబు స్పష్టం చేశారు.

ఐక్య పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

ఐక్య పోరాటాలతోనే వ్యవసాయ రంగ సమస్యలు పరిష్కారం అవుతాయని రైతు సంఘాల నేతలు అభిప్రాయపడ్డారు. మోడీ -సర్కార్ వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేస్తూ వస్తున్నదని రైతుల గురించి పట్టించుకునే స్థితిలో లేదన్నారు. ప్రభుత్వం మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలని నాఫెడ్ ద్వారా క్వింటా రూ. 25వేలు చొప్పున మిర్చిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సదస్సులో మార్కెఫెడ్ ద్వారా మొక్కజొన్నలు కొనుగోలు చేయాలని ఏకగ్రీవం గా తీర్మానం చేశారు. ఈ సదస్సులో రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొండపర్తి గోవింద రావు వేదికపైకి అతిథులను ఆహ్వానించగా రాష్ట్ర రైతు సంఘం -అధ్యక్షులు బాగం హేమంతరావు, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, ఎంఎల్సి తాతా మధు, సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు -నల్లమల వెంకటేశ్వ రరావు, రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు పోతినేని సుదర్శన్రావు, అఖిల భారత రైతు కూలీ సం ఘం నాయకులు గుర్రం అచ్చయ్య, మాజీ శాసన సభ్యురాలు బానోత్ చంద్రావతి, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

చర్ల ఇసుక రీచ్‌లలో కలెక్టర్ జితేష్ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : గోదావరి నది పరివాహక ప్రాంతమైన మణుగూరు నుండి గోదావరి నది మీదుగా చర్ల వరకు పడవ ప్రయాణం ఆహ్లాదంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో మంగళవారం జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ పడవ ద్వారా చర్లకు ప్రయాణించారు. తొలుత ఆయన మణుగూరు పర్యటన అనంతరం గోదావరి నది పరివాహక ప్రాంతాన్ని పరిశీలించారు. నక్సల్స్ ప్రభావం అత్యంత వేగంగా ఉండే ఈ పరివాహక ప్రాంతంలో కలెక్టర్ ప్రయాణం సాహసోపేతంగా మారింది. అనంతరం చర్లలో వీరాపురం, మొగళ్ళపల్లి, చింత కుంట ఇసుక రీచులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గడచిన రెండు వారాల్లో చర్ల లోని ఇసుక రీచులను కలెక్టర్ ఈ రోజు రెండవ సారి తనిఖీలు నిర్వహించటం విశేషం. చర్ల మండలం రీచ్ ల విషయంలో బడా బాబులు గిరిజన సొసైటీల ముసుగులో అక్రమాలకు పాల్పడు తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యం లో కలెక్టర్ తనిఖీలే కాకుండా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు కూడా ఇటీవలే ఇక్కడి ఇసుక రీచ్ లను తనిఖీ చేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ రీచ్ లలో రెవెన్యూ, మైనింగ్, టిఎస్ఎండి లు ఇసుక రవాణా ద్వారా వచ్చే రెవెన్యూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇసుక రీచుల్లో నిల్వ ఉన్న స్టాక్ లను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్ ను తనిఖీ చేశారు. సొసైటీలు ఇసుక రవాణా ద్వారా రెవెన్యూ చేకూర్చాలని సూచించారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ పరిశీలనలో చర్ల తాసిల్దార్ శ్రీనివాస్ , మైనింగ్ శాఖ అధికారి దినేష్ , సొసైటీ సభ్యులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఏటూరునాగారం పోలీస్ స్టేషన్ ముందు జాతీయ రహదారికి మోక్షం

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : జాతీయ రహదారి 25 సంవత్సరాల నుండి ఏటూరునాగారం పోలీస్ స్టేషన్ ముందు రోడ్ను భారీ గేట్లతో బ్లాక్ చేసిన సందర్భంగా, రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ, సీతక్క కృషితో, గేట్లు తెరుచుకున్న సందర్భంగా, ఏటూరునాగారం మండల కమిటి అధ్యక్షులు చిటమట రఘు ఆధ్వర్యంలో మంగళవారం హనుమాన్ గుడిలో ప్రత్యేక పూజలు, ముగ్గులు వేసి గుడిలో పూజలు చెల్లించారు. ఈ సహకారం చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క, తెలంగాణ రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేసి , మండల కాంగ్రెస్ పార్టీ తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిటమట రఘు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇర్సవడ్ల వెంకన్న మాట్లాడుతూ 25 ఏళ్ల తరువాత తెరుచుకున్న రోడ్డు కు, పోలీస్ స్టేషన్ ముందు నుంచి 25 ఏళ్ల తరువాత రోడ్డు మార్గానికి మోక్షం కలిగిందని, 2001 లో నక్సల్స్ పోలీస్ స్టేషను పై దాడి చేసి ఐదుగురిని, హతమార్చారన్నారు. అప్పుడు ప్రధాన రోడ్డు పోలీస్ స్టేషన్ ముందు నుండి ఉండటంతో, మందుపాతర్లను, ట్రాక్టర్ల లో అమర్చి పేల్చివేసారని తెలిపారు. అప్పటి నుండి దాదాపుగా ఇరవై అయిదు ఏళ్ల తరు వాత, మంత్రి సీతక్క సహకారంతో, రోడ్డు మార్గం పూర్తి స్థాయిలో యధావిధి స్థాయిలో వచ్చిందని, దీంతో ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షులు ఎండీ అయూబ్ ఖాన్, జిల్లా ఉపాధ్యక్షులు ఎండీ ఖలీల్ ఖాన్,జిల్లా కార్యదర్శి గుడ్ల దేవేందర్, జిల్లా అధికార ప్రతినిధి ముక్కెర లాలయ్య, పిఎసిఎస్ వైస్ చైర్మన్ చెన్నూరి బాలరాజు, ట్రాన్స్పోర్ట్ డైరెక్టర్ వసంత శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ ఎస్ కె సి గాంధీ, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వావిలాల నర్సింగరావు, మండల ప్రధాన కార్యదర్శి వావిలాల ఎల్లయ్య, కన్నాయిగూడెం మండల అప్సర్ పాషా,జిల్లా ఎస్సి సెల్ కార్యదర్శి కొండగొర్ల పోషయ్య,జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి ఎండీ గౌస్ పాషా, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ డొంగిరి మధు బాబు, టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సరికొప్పుల శ్రీనివాస్,టౌన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బండారి లక్కీదేవులపల్లి విజయ్ కుమార్, మాజీ ఉపసర్పంచ్ కర్ల అరుణ, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు కట్కూరి రాధికా,గికూరు భాగ్య,చేల వినయ్ కుమార్,మామిడి రాంబాబు, ఈసం నర్సయ్య,సలీమ్,వంగపండ్ల రవి,మాజీ వార్డ్ మెంబెర్ కొండగొర్ల నర్సింంహులు, పడిదాల హన్మంత్,కె రంజిత్ పాల్గొన్నారు.

బెజ్జూర్‌లో ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర - కొమురం భీం : బెజ్జూర్ మండల కేంద్రంలోని అటవీ శాఖ క్షేత్ర అధికారి కార్యాలయంలో నిర్వహించిన ఉచిత మెగా మెడికల్ క్యాంపును ఆసిఫాబాద్ జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్ కుమార్ కాగజ్నగర్ ఎఫ్డిఓ సుశాంత్ సుబ్దేవ్,రేంజ్ అధికారి ముసవీర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అటవీ శాఖ అధికారి మీరజ్ కుమార్ మాట్లాడుతూ సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో జనరల్ మెడిసిన్ ఎముకల నిపుణులు స్త్రీల వైద్య నిపుణుల చే ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి శ్రావణ్ కుమార్, ఎఫ్ ఎస్ ఓ లు, ఎఫ్బి వోలు, వైద్య సిబ్బంది, ఫారెస్ట్ సిబ్బంది ఉన్నారు.

రూ.5.20 కోట్ల గంజాయి కాల్చివేత

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కొన్నినెలలుగా పట్టుకున్న కోట్ల విలువ చేసే గంజాయి ఎక్సైజ్ అధికారులు ధ్వంసం చేశారు. జిల్లాలోని ఐదు పోలీస్ స్టేషన్ల పరిధిలో 30 కేసుల్లో పట్టుకున్న రూ. 5.20 కోట్ల విలువ చేసే 1040 కేజీల గంజాయిని మంగళవారం కాల్చివేసినట్లు శాఖాధికారులు వెల్లడించారు. ఖమ్మం జిల్లా తల్లేడ మండలం లోని గోపాల్రావుపేట గ్రామంలో ప్రభుత్వ అమోదాం పొందిన ఎడబ్యూ ఎమ్ దహన కేంద్రంలో గంజాయిని ధ్వంసం చేశారు. కాగా ఖమ్మం డిప్యూటీ కమిషనర్ జనార్ధన్రెడ్డి ఆదేశాలతో అశ్వరావుపేట, పాల్వంచ, కొత్తగూడెం, మణుగూరు, ఇల్లందు, భద్రాచలం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లలో పరిధిలో పట్టు కున్న ఈ గంజాయిని నిబంధనల ప్రకారం పూర్తిగా కాల్చేసినట్లు జిల్లా ఎక్సైజ్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

వడ్డెర కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : వడ్డెర కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు రమణయ్య డిమాండ్ చేశారు. మంగళవారం కొత్తగూడెం మండలం, టౌన్ పరిధిలో అఖిలభారత వడ్డెర సంక్షేమ సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా శివరాత్రి సతీష్, ప్రధాన కార్యదర్శిగా ఎం. రమేష్ లతోపాటు మండల యూత్ అధ్యక్షునిగా ఆర్. సందీప్ ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రమణయ్య మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వడ్డెర ప్రజలు తొమ్మిది శాతంగా ఉన్నరని దశబ్దాలుగా పాలకులు తమను అణగ దొక్కుతూ వస్తున్నారని ఆరోపించారు. శ్రమజీవులుగా బతికే తమకు విద్య, ఉద్యోగ ఉపాధి, రాజకీయాల్లో ప్రాధసన్యత లేక ఆర్థిక వనరులు లేక దుర్భరంగా బతుకుతున్నట్లు చెప్పారు. అందుకే తమ కులస్తులను ఎస్టిలో కలపాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. జాతీయ, రాష్ట్ర అధ్యక్షులు వేముల లక్ష్మణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుంజ శ్రీనివాస్ రావు, మహిళా అధ్యక్షురాలు తిరుమల దేవి ల నాయక కొంగు పోరాటాలు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వడ్డెర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

కమిషనర్,టిపిఓ,సబ్ రిజిస్టర్‌లను సస్పెండ్ చేయాలి

విశాలాంధ్ర - వనపర్తి: ఆత్మకూరు మున్సిపాలిటీలో జరుగుతున్న భూ కబ్జాలకు తొత్తులుగా మారిన మున్సిపల్ కమిషనర్, టిపిఓ,సబ్ రిజిస్టార్లను తక్షణమే సస్పెండ్ చేయాలని సిపిఐ జిల్లా నేత ఏ.భాస్కర్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ తాసిల్దార్ కార్యాలయంలో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)ఆధ్వర్యంలో జరుగుతున్న నిరవధిక ఆందోళన ఆరు రోజు మంగళవారం కూడ కొనసాగింది. సిపిఐ నిరవధిక ఆందోళనకు జిల్లా అధికార యంత్రాంగం కదులుతుంది.జిల్లా కలెక్టర్ స్పందించి తక్షణం నిర్మాణం ఆపాలని కలెక్టర్ ఆదేశాల మేరకు బాబా కాలనీలో మాజీ ఎంపీపీ బంగారు శ్రీను రోడ్డుపై అక్రమంగా నిర్మిస్తున్న ప్రదేశానికి మున్సిపల్ అధికారులు వెళ్లి అక్రమ కట్టడా నిర్మాణాన్ని ఆపి జిల్లా కలెక్టర్ కి అక్కడి ఫోటోలు పంపారు. అధికారులు వెళ్లిపోయిన తర్వాత అక్రమ నిర్మాణ పనులు మళ్ళీ కొనసాగడం కోసం మెరుపు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా నేత ఏ. భాస్కర్ మాట్లాడుతూ పట్టణంలోని బాబా కాలనీకి అడ్డంగా నిర్మిస్తున్న టీఎన్జీవో బిల్డింగ్ పక్కల గల 20 ఫీట్ల రోడ్డు కబ్జాకు కారకులైన బంగారు శ్రీనివాసులకు సహకరిస్తున్న ఆత్మకూర్ మున్సిపల్ కమిషనర్,టి పి ఓ.సబ్ రిజిస్టర్ వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. పట్టణంలో అనేక వెంచర్ల లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా 10% భూములను మాజీ చైర్మన్,వైస్ చైర్మన్ కొంతమంది సిండికేట్ గా అవతారం ఎత్తి కబ్జాలకు పాల్పడ్డారని అందుకు కారకులైన వారిపై చట్టరీత్యా చర్య తీసుకోవాలని ప్రజా ఉద్యమం జరుగుతుందని, కబ్జాలపై ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసి నిజా నిజాలు తేల్చాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి కె.విజయరాములు మాట్లాడుతూ కబ్జాదారులు ఎంతటి వారినైనా ఎన్ని రోజులైనా ప్రజా క్షేత్రంలో దోషులుగా నిలబెట్టుతామని అంతవరకు వదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

మానవత్వం చాటుకున్న అజ్మీర తండావాసులు

విశాలాంధ్ర-దంతాలపల్లి: నరసింహుల పేట మండలంలోని అజ్మీర గ్రామపంచాయతీ పరిధిలో ఇటీవల అనారోగ్య అజ్మీరా లచ్చిరం అనారోగ్యంతో మరణించడంతో చదువుల ఖర్చుల కోసం ఇబ్బంది పడుతున్న వారి కుమార్తె అజ్మీరా నందిని బిఎస్సి అగ్రికల్చర్ మొదటి సంవత్సరం కి పాఠశాల ఉపాధ్యాయులు, అజ్మీరా తండ గ్రామపంచాయతీ పరిధిలోని ఉద్యోగులు, విద్యాభిమానులు రూ.55500 ఆర్థిక సాయం అందజేశారు. విద్యాభిమనులు, దాతలు ఎవరైనా ఉంటే ఈ చదువుల తల్లి చదువు పూర్తి చేయుటకు సాయపడగలారని మనవి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అజ్మీర మోహన్ ,నరేష్ ,సునీత ,సేవ్య, పాల్గొన్నారు.

రక్త మూల కణ దానంపై డీకేఎంఎస్ ఇండియా, ఐఐటీ హైదరాబాద్ భాగస్వామ్యం

విశాలాంధ్ర - హైదరాబాద్: రక్త క్యాన్సర్, రక్త రుగ్మతలపై పోరాటానికి అంకితమైన లాభాపేక్షలేని సంస్థ అయిన డీకేఎంఎస్ ఫౌండేషన్ ఇండియా, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్ (ఐఐటీ హైదరాబాద్)తో కలిసి రక్త మూల కణ అవగాహన, దాన కార్యక్రమాన్ని ఐఐటీ హైదరాబాద్ కళాశాల ఉత్సవం ఎలాన్ అండ్ ఎన్విజన్ 2025 సందర్భంగా విజయవంతంగా నిర్వహించింది. 16వ వార్షిక సాంకేతిక-సాంస్కృతిక ఉత్సవంలో డీకేఎంఎస్ ఫౌండేషన్ ఇండియా సామాజిక సంక్షేమ భాగస్వామిగా ఉంది. రక్త క్యాన్సర్లు, ఇతర ప్రాణాంతక రక్త సంబంధిత రుగ్మతలను ఎదుర్కోవడానికి భారతదేశంలో బలమైన రక్త మూల కణ దాత రిజిస్ట్రీని కలిగి ఉండవలసిన అవసరం గురించి యువతకు అవగాహన కల్పించడానికి డీకేఎంఎస్ ఈ అవకాశాన్ని ఉపయోగించుకుంది. ఈ కార్యక్రమంలో 350 మందికి పైగా విద్యార్థులు సంభావ్య రక్త మూల కణ దాతలుగా నమోదు చేసుకోవడానికి ముందుకు వచ్చారు.

దక్షిణాఫ్రికా పర్యాటక రంగంపై ఇండియా రోడ్‌షో 2025

విశాలాంధ్ర - హైదరాబాద్: భారత మార్కెట్ పట్ల తన నిబద్ధతను బలోపేతం చేస్తూ, దక్షిణాఫ్రికా పర్యాటక రంగం రెయిన్బో నేషన్‌కు ప్రయాణం, పర్యాటకాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో తన వార్షిక ఇండియా రోడ్‌షో 2025 ఎడిషన్‌ను ప్రదర్శిస్తుంది. ఈ చొరవ భారతీయ వాణిజ్య భాగస్వాములతో సన్నిహితంగా ఉండటానికి, రెండు దేశాల మధ్య పర్యాటక సంబంధాలను బలోపేతం చేయడానికి కీలకమైన వేదికగా కొనసాగుతోంది. మార్చి 18 నుండి 20 వరకు జరిగే ఈ కార్యక్రమం భారతదేశంలోని మూడు కీలక నగరాలు - ఢిల్లీ, చెన్నై, ముంబైలలో నిర్వహించబడుతుంది. దక్షిణాఫ్రికాలో అత్యంత ప్రాధాన్యత కలిగిన మార్కెట్లలో ఒకటిగా, భారతదేశం పర్యాటక వృద్ధికి కీలక కేంద్రంగా కొనసాగుతున్నందున, ఈ సంవత్సరం రోడ్‌షో వాటాదారులకు విలువైన వ్యాపార అవకాశాలు, లీనమయ్యే అనుభవాలు మరియు దేశ పర్యాటక పరిశ్రమ నాయకులతో ప్రత్యక్ష సంబంధాన్ని అందిస్తుంది. ఇప్పుడు దాని 21వ ఎడిషన్‌లో, ఈ కార్యక్రమం భారత మార్కెట్ కోసం ఒక రిఫ్రెష్ వ్యూహాత్మక దృష్టిని పరిచయం చేస్తుంది.

దేశంలోనే మొట్టమొదటి హైడ్రోజన్ ట్రక్ ట్రయల్స్

విశాలాంధ్ర - హైదరాబాద్: 2070 నాటికి నికర-సున్నా ఉద్గారాలను సాధించాలనే భారతదేశ దార్శనికత దిశగా ఒక మైలురాయి అభివృద్ధిలో, దేశంలో అతిపెద్ద వాణిజ్య వాహన తయారీదారు టాటా మోటార్స్, హైడ్రోజన్-శక్తితో నడిచే హెవీ-డ్యూటీ ట్రక్కుల మొట్టమొదటి ట్రయల్స్‌ను ప్రారంభించిందని ఇక్కడ విడుదల చేసిన ఓ ప్రకటనలో టాటా మోటార్స్ వెల్లడించింది. సుస్థిరమైన సుదూర కార్గో రవాణా వైపు ఒక ముఖ్యమైన అడుగును సూచించే ఈ చారిత్రాత్మక ట్రయల్‌ను కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ, కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి జెండా ఊపి ప్రారంభించారు. టాటా మోటార్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీ గిరీష్ వాఘ్, భారత ప్రభుత్వ, రెండు కంపెనీల నుండి ఇతర ప్రముఖ ప్రతినిధులు పాల్గొన్నారు.

సామ్‌సంగ్ గెలాక్సీ ఏ56 5జీ, గెలాక్సీ ఏ36 5జీల విడుదల

గురుగ్రామ్: భారతదేశంలో అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ సామ్‌సంగ్, తాజాగా అద్భుతమైన మేధస్సుతో కూడిన గెలాక్సీ ఏ56 5జీ, గెలాక్సీ ఏ36 5జీలను విడుదల చేస్తున్నట్లు వెల్లడించింది. సృజనాత్మకతను తిరిగి ఊహించుకోవడానికి అద్భుతమైన శోధన, దృశ్య అనుభవాలను కలిగి ఉంది. పూర్తిగా కొత్త డిజైన్ భాషతో, కొత్త గెలాక్సీ ఏ సిరీస్ స్మార్ట్‌ఫోన్‌లు మెరుగైన మన్నిక, పనితీరును కలిగి ఉంటాయి. అలాగే బలమైన భద్రత మరియు గోప్యతా రక్షణను సైతం కలిగి ఉంటాయి. గెలాక్సీ ఏ56 5జీ, గెలాక్సీ ఏ36 5జీలలో అద్భుతమైన మేధస్సు అందుబాటులో ఉంది. ఇది భారతీయ వినియోగదారుల కోసం ఏఐ ప్రజాస్వామ్యీకరణను అనుమతిస్తుంది. అద్భుతమైన మేధస్సు, ఒక సమగ్ర మొబైల్ ఏఐ సూట్, గెలాక్సీ అభిమానులకు ఇష్టమైన ఏఐ ఫీచర్‌లతో సహా అధునాతన ఏఐ ఫీచర్‌లను అందిస్తుంది.

సుందరం ఫైనాన్స్‌లో డిజిటల్ డిపాజిట్ సదుపాయం

ముంబయి: భారతదేశంలో అత్యంత విశ్వసనీయ ఎన్‌బీఎఫ్‌సీలలో ఒకటి సుందరం ఫైనాన్స్ లిమిటెడ్ డిజిటల్ డిపాజిట్ సదుపాయాన్ని ప్రవేశపెట్టింది. దీని ద్వారా పొదుపులను మరింత సులభంగా, సురక్షితంగా అందుబాటులో ఉండేలా చేస్తోంది. 70 సంవత్సరాలకు పైగా ట్రస్ట్ , ఆర్థిక భద్రతకు ప్రతీకగా నిలిచిన సుందరం ఫైనాన్స్, లక్షకు పైగా డిపాజిటర్లతో బలమైన స్థావరాన్ని కలిగి ఉంది. మూడున్నర దశాబ్దాలుగా, సంస్థ డిపాజిట్ల విషయంలో ఐసీఆర్ఏ, క్రిసిల్ నుండి ఏఏఏ రేటింగ్‌ను సాధించింది. ఇది అత్యున్నత స్థాయి భద్రత, విశ్వసనీయతను నిర్ధారిస్తుంది. ఇప్పుడు, సుందరం ఫైనాన్స్‌లో డిపాజిట్ ఖాతా ప్రారంభించడం కేవలం ఒక క్లిక్ దూరంలో ఉంది. వినియోగదారులు సులభతరమైన, సురక్షితమైన డిజిటల్ ప్రక్రియ ద్వారా తమ డిపాజిట్లను పెట్టుబడి పెట్టవచ్చు, నిర్వహించవచ్చు.

ఫెలోషిప్ కోసం టీచ్ ఫర్ ఇండియా తుది గడువు మార్చి 9

విశాలాంధ్ర -హైదరాబాద్: విద్యా సమానత్వాన్ని పెంపొందించేందుకు అంకితమైన, లాభాపేక్షలేని సంస్థ టీచ్ ఫర్ ఇండియా, తన 2025 ఫెలోషిప్ కోసం తుది గడువును ప్రకటించింది. ఆశావహులైన అభ్యర్థులు బాలల భవిష్యత్తుపై శాశ్వత ప్రభావాన్ని చూపే, రేపటి నాయకులను ప్రేరేపించే అవకాశం ఉంది. దరఖాస్తు చేసుకునేందుకు చివరి గడువు మార్చి 9, 2025. టీచ్ ఫర్ ఇండియా ఫెలోషిప్ అనేది రెండేళ్ల, పూర్తి సమయం, చెల్లింపు కార్యక్రమం. ఇది విస్తృత శ్రేణి నేపథ్యాలు, అనుభవాలకు చెందిన వ్యక్తులను ఒకచోట చేర్చుతుంది. దేశవ్యాప్తంగా 500 కన్నా ఎక్కువ విశ్వవిద్యాలయాలు, కళాశాలలు మరియు 300 కన్నా ఎక్కువ కంపెనీల నుండి ఫెలోలను ఎంపిక చేస్తారు. ఫెలోషిప్ దరఖాస్తు ప్రక్రియ చాలా కఠినమైనది. భారతదేశంలోని తెలివైన, అత్యంత ఆశాజనకమైన వ్యక్తుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తుంది.

ప్రణాళికాబద్ధంగా గోదావరిఖని నగర అభివృద్ధి

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి ,సింగరేణి: కోట్లాది రూపాయలతో ప్రణాళికాబద్ధంగా గోదావరిఖని నగర అభివృద్ధి పనులను ప్రారంభించామని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజఠాకూర్ అన్నారు.మంగళవారం ఆయన 29.5 కోట్లతో లక్ష్మీ నగర్ రోడ్ల వెడల్పు అభివృద్ధి పనులను,29.5 కోట్లతో యు జి డి, సెంట్రల్ లైటింగ్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ,పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ40 సంవత్సరాలు గ్యారెంటీగా లక్ష్మీ నగర్ ప్రాంతంలో వ్యాపారస్తుల సహకారంతో 40 ఫీట్లతో రోడ్లు వెడెల్పు కార్యక్రమం చేపట్టామని అన్నారు.ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం అభివృద్ధి పనులు మొదలుపెట్టామని వివరించారు.లక్ష్మీ నగర్ ప్రాంత ప్రజలు, రామగుండం నియోజకవర్గం ప్రజలు,వ్యాపారస్తులు ప్రతి ఒక్కరు కూడా జరిగే అభివృద్ధి కార్యక్రమాలను సహకరించాలని అన్నారు.

తెలంగాణ సోషల్ వెల్ఫేర్ బాలికల రెసిడెన్షియల్ కళాశాల తనిఖీ

విశాలాంధ్ర - కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి తెలంగాణ సోషల్ వెల్ఫేర్ బాలికల రెసిడెన్షియల్ కళాశాలలో గతం తో పోలిస్తే పరిస్థితులు ఎంతో బాగు న్నాయని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కితాబునిచ్చారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కొండమల్లేపల్లి లోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్ వంటగది, స్టోర్ రూమ్, కూరగాయలు ,బియ్యం నిల్వ ఉంచే స్థలాలను, శుభ్రం చేసే స్థలం, తరగతి గదులను, కళాశాల పరిసరాలను, పరిశుభ్రతను పరిశీలించారు. గతంలో తాను సందర్శించినప్పుడు పాఠశాలలో పరిశుభ్రత సరిగా లేదని, ప్రస్తుతం కిచెన్ తో పాటు, పరిసరాలు అన్ని శుభ్రంగా ఉండడం, అలాగే బియ్యం నిల్వంచే చోట స్టాండ్లు ఏర్పాటు చేయడం, కొత్త స్టవ్ లు,కూరగాయలకు స్టాండ్ ఏర్పాటు చేయడం పట్ల కలెక్టర్ ప్రిన్సిపాల్ ను, సిబ్బందిని అభినందించారు . విద్యార్థినిలతో ఇంగ్లీష్ ,మాథ్స్ పై వివిధ రకాల ప్రశ్నలను అడిగి జాబులను రాబట్టారు .నాలెడ్జ్ స్పెల్లింగ్ తోపాటు, మ్యాథమెటిక్స్ లో అడిగిన అన్ని ప్రశ్నలకు విద్యార్తినిలు సరైన సమాధానాలు చెప్పడం పట్ల వారిని అభినందించి చాక్లెట్లు పంపిణీ చేశారు.పాఠశాలలో విద్యార్థినిలకు గుణాత్మక విద్యను అందించాలని, అన్ని అంశాల పట్ల అవగాహన కలిగి ఉండేలా తీర్చిదిద్దాలని, అలాగే పాఠశాల చుట్టూ ఎలాంటి ముళ్లపొదలు లేకుండా పిచ్చి మొక్కలన్నింటిని తొలగించి శుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులు అనారోగ్యం పాలు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు.పాఠశాల కళాశాల ప్రిన్సిపల్ ఎం. షారీలు, కొండమల్లేపల్లి ఎంపీడీవో బాలరాజు రెడ్డి ఉన్నారు .

సంపాదకీయం

ఎన్నికల మాయోపాయాలు

మోదీ నాయకత్వంలోని బీజేపీ కేవలం శుష్క వాగ్దానాలకు మాత్రమే ప్రసిద్ధమైంది కాదు. ఎన్నికలలో విజయం సాధించడానికి ఎన్ని మాయోపాయాలైనా పన్నగలదని నిరూపించింది. తమకు కావలసిన వాళ్లని ఎన్నికల కమిషన్ ప్రధానాధికారులుగా నియమించడంలో మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం కేవలం ఎన్నికల కమిషన్‌ను తమ చేతిలోని పావుగా మార్చడానికి మాత్రమే కాదు. అసలు ఓటర్ల జాబితా తయారీ నుంచే బీజేపీ పరిస్థితిని తనకు అనుకూలంగా మార్చుకునేందుకు సకల కట్టుదిట్టాలు చేస్తోంది. ఓటర్ గుర్తింపు కార్డులవల్ల ఒకరికి బదులు మరొకరు ఓటు వేసే అవకాశం తగ్గి ఉండొచ్చు. శేషన్ లాంటి ఎన్నికల ప్రధానాధికారులు ఎన్నికలను సవ్యంగా నిర్వహించడానికి అనేక చర్యలు తీసుకుని ఉండొచ్చు. కానీ శేషన్ ఎన్నికల కమిషన్ ప్రధానాధికారిగా ఉన్నప్పుడే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం శేషన్‌కు తోడు మరో ఇద్దరు ఎన్నికల కమిషనర్లను నియమించింది. ఇలాంటి ఎత్తుగడలన్నీ బీజేపీ పన్నాగాల ముందు కురుచనైపోయాయి. ఎన్నికలకు ముందు సంక్షేమ పథకాలతో ఓటర్లను ఆకట్టుకోవడానికి ప్రయత్నించడం లాంటి ఎత్తుగడలు ఒక్క బీజేపీకే పరిమితం కాలేదు. కానీ కేంద్రంలో అధికా రంలో ఉన్న పార్టీ తమ గెలుపు కోసం ఎన్ని కుట్రలు పన్నడానికి అవకాశం ఉందో చూస్తే ఆశ్చర్యం వేస్తుంది. పోలింగ్ కేంద్ర స్థాయిలో తమ కార్యకర్తలను ఇన్‌చార్జీలుగా నియమించే అవకాశం మరే పార్టీకీ లేదు. ఓటర్ల జాబితాలో పేజీల వారీగా "పన్నా ప్రముఖ్" లను నియమించడం బీజేపీకి మాత్రమే సాధ్యమయ్యే అంశమూ కావచ్చు. అంతిమ ఫలితాలను తమకు అనుకూలంగా మలుచుకోవ డానికి మోదీ ఏలుబడిలో బీజేపీ ప్రభుత్వాధికారాన్ని వినియోగించే తీరు చూస్తే కళ్లు బైర్లు కమ్మే పరిస్థితి ఏర్పడింది. ఇటీవల దిల్లీ శాసనసభ ఎన్నికలకు ముందు బీజేపీ నేతల ఇళ్ల చిరునామాలలో పదుల మంది పేర్లు ఓటర్లుగా నమోదు అయ్యాయి. ఇందులో బీజేపీ మంత్రులూ, ఎంపీలు కూడా ఉన్నారు. ఒక్కో ఇంట్లో ఇంతమంది ఓటర్లుగా నమోదు కావడం ఏమిటి అన్న ప్రశ్న ఎన్నికల కమిషన్‌కు రానేలేదు. ప్రతి వ్యక్తి ఆధార్ కార్డు మీద ఒక విశిష్టమైన గుర్తింపు సంఖ్య ఉంటుంది. ఆధార్ కార్డులు దేశంలో ఉన్న వారెవరైనా తీసుకోవచ్చు. కానీ ఏ ఇద్దరి ఆధార్ కార్డుల నెంబర్లూ ఒకటే ఉండవు. ఇలా ఉన్నట్టు ఫిర్యాదులు ఎన్నడూ రాలేదు. కానీ మోదీ హయాంలో, మొన్నటి దాకా రాజీవ్ కుమార్ ఎన్నికల ప్రధానాధి కారిగా ఉన్నప్పుడు, ఇప్పుడు జ్ఞానేశ్ కుమార్ ఎన్నికల కమిషన్ ప్రధానాధికారిగా ఉన్నప్పుడు ఓటర్ల గుర్తింపు కార్డుల మీద ఒకే సంఖ్య ఒకరికన్నా ఎక్కువ మందికి ఉన్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయి. ఇటీవల తృణమూల్ కాంగ్రెస్ ఓటర్ల జాబితాలో జరుగుతున్న అక్రమాలను బయట పెట్టింది. ఓటర్ల జాబితాను బీజేపీకి అనుకూల ఫలితాలు వచ్చేట్టుగా తయారు చేస్తున్నారని మమతా బెనర్జీ ఆరోపిస్తున్నారు. వచ్చే ఏడాది పశ్చిమ బెంగాల్ శాసనసభ ఎన్నికలు జరగనున్నాయి కనక ఇప్పటి నుంచే బీజేపీ కేంద్రంలో తమ చేతిలో ఉన్న అధికారాన్ని, చెప్పిన మాట సుగ్రీవాజ్ఞలా భావించే ఎన్నికల కమిషన్ అధికార్లతో కుమ్మక్కై తమ విజయాన్ని సునిశ్చితం చేసుకోవడానికి ప్రయత్నిస్తోంది. ఇటీవల మహారాష్ట్ర, దిల్లీ శాసన సభ ఎన్నికల సందర్భంగా ఓటర్ల జాబితాలో అక్రమాలు జరిగాయని ప్రతిపక్షాలు గోల చేసినా మోదీ పెదవి విప్పలేదు. ప్రతిపక్షాలు లేవనెత్తిన ప్రశ్నలకు ఎన్నికల కమిషన్ జవాబు చెప్పనూ లేదు. ఇప్పుడు అందుతున్న ఫిర్యాదులనుబట్టి చూస్తే ప్రతిపక్షాల ఫిర్యాదులు నిజమేననిపిస్తోంది.

బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వాదన ప్రకారం ప్రతి శాసనసభ నియోజకవర్గంలో ఆ రాష్ట్రానికి చెందని 20-30 వేల మందిని ఓటర్లుగా నమోదు చేశారు. ఒక రాష్ట్రంలో ఇతర రాష్ట్రాల వారు ఓటర్లుగా ఉండకూడదని కాదు. కానీ పనిగట్టుకుని కేంద్ర ప్రభుత్వం పనుపున ఇలా అక్రమంగా ఓటర్లను నమోదు చేయించ డం ఎన్నికల కమిషన్ పూర్తి పక్షపాత ధోరణికి నిదర్శనం. ఒకే సంఖ్య ఉన్న ఓటరు గుర్తింపు కార్డులున్న ఉదంతాలను మమతా బెనర్జీ ఎత్తి చూపారు. ఎన్నికల కమిషన్ తాను చేసిన తప్పులను 24 గంటల్లోగా అంగీకరించి సరిదిద్దక పోతే ఎన్నికల కమిషన్ పాల్పడుతున్న అక్రమాలు మరిన్ని బయట పెడ్తామని మమతా బెనర్జీ ప్రకటించారు. నాల్గో తేదీ సాయంత్రానికి ఎన్నికల కమిషన్ నుంచి ఎలాంటి స్పందనా వచ్చిన దాఖలాలు లేవు. వంద రోజుల్లోగా ఓటర్ల జాబితాలో చేసిన అక్రమాలను తొలగించాలని మమతా బెనర్జీ పట్టుబడుతున్నారు. భిన్నమైన రాష్ట్రాలకు చెందిన కొంతమంది ఓటరు గుర్తింపు కార్డుల మీద ఒకే విశిష్ట గుర్తింపు సంఖ్య ఉందని రెండో తేదీన ఎన్నికల కమిషన్ ఒప్పుకోవడం గుడ్డిలో మెల్ల అనుకోవచ్చు. ఓటర్ల జాబితాలో దొంగ చాటుగా చేర్చి బీజేపీ మహారాష్ట్ర, దిల్లీ ఎన్నికలలో విజయం సాధించిందన్న ఆరోపణలు చాలా తీవ్రంగా ఉన్నాయి. హర్యానాకు చెందిన అనేకమంది పేర్లు బెంగాల్ ఓటర్ల జాబితాలో దూర్చేశారు. జరిగిన తప్పుల్ని దిద్దక పోతే ఉద్యమిస్తామని మమతా బెనర్జీ హెచ్చరించడాన్ని కేవలం హుంకరింపులా కొట్టి పారేయడానికి వీలు లేదు. ఇలాంటి అక్రమాలను నిరోధించడానికి ప్రతిపక్ష పార్టీలు, ప్రజలు చాలా జాగ్రత్తగా ఉండాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తోంది. సోమవారం కాంగ్రెస్ కూడా సరిగ్గా ఇదే ఆరోపణ చేసింది. ఓటరు గుర్తింపు కార్డులలో ఒకటి కన్నా ఎక్కువ సందర్భాలలో ఒకే గుర్తింపు సంఖ్య ఉండడాన్ని ఎత్తి చూపింది. మహా రాష్ట్రలో మొత్తం వయోజనులకన్నా నమోదైన ఓటర్ల సంఖ్యే ఎక్కువ అని రాహుల్ గాంధీ ఫిబ్రవరి ఏడున ఆరోపించారు. 2024 లోక్‌సభ ఎన్నికల తరవాత 2024 నవంబర్‌లో మహారాష్ట్రలో ఎన్నికలు జరిగిన సమయానికి నమోదైనంత మంది ఓటర్లు గత అయిదేళ్లలో కూడా నమోదు కాలేదు. అంటే ఎన్నికలకు ముందు తమ విజయాన్ని సుస్థిరం చేసుకోవడానికి బీజేపీ ఎంతటి కుట్ర పన్నిందో అర్థం చేసుకోవచ్చు. 2019లో శాసనసభ ఎన్నికల నుంచి 2024 లోక్‌సభ ఎన్నికలకు మధ్య కాలంలో మహారాష్ట్రలో 32 లక్షల మంది ఓటర్లు అమాంతం పెరిగిపోయారు. 2024 లోక్‌సభ ఎన్నికలకు 2024లో జరిగిన మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలకు మధ్య మరో 39 లక్షల మంది పేర్లు ఓటర్ల జాబితాలో దూరిపోయాయి. ఎన్నికల సమయం ముగిసిన తరవాత కూడా ఎన్నికల సంఘం పోలైన ఓట్ల శాతాన్ని మాత్రమే ప్రకటిస్తోంది. తుది వివరాలకు, తాత్కాలిక అంచనాలకు మధ్య విపరీతమైన తేడా ఉంటోంది. ఓటర్ల జాబితా నుంచి పేర్లను తొలగించడంలో కూడా అనేక అక్రమాలు జరుగుతున్నాయి. దిల్లీలో కొందరి పేర్లు తొలగించి కొందరి పేర్లు చేర్చిన తరవాత 895881 మంది పేర్లు నమోదై పోయాయి. అంటే ఇతర రాష్ట్రాల వారి పేర్లు అక్రమంగా చేరుస్తున్నారు.

అప్పులతోనే రాష్ట్రాభివృద్ధా!


పతకమూరు దామోదర్ ప్రసాద్

నవ్యాంధ్రను అభివృద్ధి పథంలో నడిపేందుకు తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన రూ3,22,359 కోట్ల బడ్జెట్ భారీగా కనిపిస్తున్నా అమలుకు అవసరమైన వనరుల కొరత స్పష్టంగా కనిపిస్తోంది. సంక్షేమం, అభివృద్ధి మధ్య సమతుల్యత పాటిస్తూ ఎన్నికల హామీల అమలుకు ప్రాధాన్యమిస్తామని రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ శాసనసభలో చెప్పినా రాష్ట్ర సొంత ఆదాయం అంతంత మాత్రంగానే ఉన్నందున, నిధుల సమీకరణకు చేసే ప్రయత్నాలు సఫలం కాకపోతే బాహుబలి బడ్జెట్ పూర్తిగా అమలు కావడం సందేహాస్పదమే. అప్పులు, వడ్డీలకే రూ.60 వేల కోట్లు చెల్లించవలసి ఉంటుంది. కార్పొరేషన్ల రుణాలు అదనం. నరేంద్ర మోదీ నాయకత్వంలోని జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్డీయే) ప్రభుత్వం కూడా గత 11 ఏళ్ల ఏలుబడిలో ఎడా పెడా రుణాలు దూసి తెచ్చి అప్పుల భారతాన్ని మిగిల్చింది. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అదే బాటలో నడుస్తూ అప్పులపై ఆధారపడిన భారీ బడ్జెట్‌ను శాసనసభలో ప్రవేశపెట్టింది. ఈ బడ్జెట్ ప్రతిపాదనలు అమలు చేయాలంటే లక్ష కోట్లకు పైగా రుణాలు తీసుకోక తప్పదని అంచనా. జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో దొరికిన చోటల్లా అప్పులు తెచ్చి సాగించిన విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించడం, పునర్నిర్మాణం కూటమికి కత్తిమీద సామేనని భావిస్తున్నారు. స్వర్ణాంధ్ర -2047 దార్శనిక పత్రంలో పేర్కొన్న లక్ష్యాల సాధనకు కూటమి ప్రభుత్వ తొలి బడ్జెట్ పునాది వంటిదే. కేంద్ర ప్రభుత్వ పథకాలు 95 అమలు నిలిపి వేయడం వల్ల రూ 40వేల కోట్లు కోల్పోవలసి వచ్చింది. కేంద్ర ప్రాయోజిత పథకాలకు దీటుగా నిధులు కేటాయించకపోవడం, కేంద్ర నిధులను మళ్లించడం వల్ల నవ్యాంధ్రకు రావలసిన లబ్ధి చేకూరలేదు. మూలధన చెల్లింపులు రూ 24,430కోట్లు కాగా మూలధన వసూళ్లు రూ1,04,382కోట్లు. రెవెన్యూ వసూళ్లు రూ2,17,976 కోట్లు, చెల్లింపులు 2,51,162 కోట్లు. ద్రవ్యలోటు 79,926కోట్లు, రెవెన్యూ లోటు రూ33,185కోట్లు. ఈ అంతరం ఆందోళన కలిగించేదే.

ఇప్పటికే భారీ రుణభారంతో తల్లడిల్లుతున్న ఆంధ్రప్రదేశ్‌కు కొత్త అప్పులు తేవడం మరింత భారమే. అయినా రాజకీయ పార్టీలు ఎన్నికలలో గెలవడానికి పోటా పోటీగా అలవిగాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చాయి. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఆ హామీలను అమలు చేసి తీరవలసిందే. మార్కెట్ నుంచి, ఆర్థిక సంస్థల నుంచి భారీగా అప్పులు చేయక తప్పదు. ప్రతిపాదిత రూ40,635 కోట్ల మూలధన వ్యయం నిధుల కొరత దృష్ట్యా ఏమేరకు సాధ్యమో వేచి చూడాల్సిందే. రాష్ట్రానికి కీలకమైన సేద్యపు రంగాన్ని రూ 48,341 కోట్ల బడ్జెట్‌తో మెరుగుపరచాలని ప్రతిపాదించారు. జగన్ ప్రభుత్వం పట్టించుకోని బిందు, తుంపర సేద్యానికి కూటమి ప్రభుత్వం మళ్లీ సబ్సిడీలను పునరుద్ధరించడం పూలు, పండ్లతోటలు ఇతర ఉద్యాన పంటల అధికోత్పత్తికి, పండ్ల ఎగుమతులకు తోడ్పడగలదు. ఇటీవల అనంతపురం నుంచి ప్రత్యేక రైలులో విదేశాలకు ముంబై ద్వారా అరటిపండ్లు ఎగుమతి చేశారు. సరైన అరటి మొక్కలు రాష్ట్రంలోనే రైతులకు సరఫరా చేస్తే పండ్ల ఉత్పత్తిని పెంచి ఎగుమతుల ద్వారా విదేశీ మారక ద్రవ్యం ఆర్జనకు తోడ్పడగలదు. కొన్ని హైదరాబాద్ కంపెనీలు వైరస్ సోకిన అరటి పిలకలను సరఫరాచేయడం వల్ల అరటి గెలలు కోతకు ముందే నేలకూలి రైతులు లక్షల్లో నష్టపోయారు. నకిలీ, రోగగ్రస్థ మొక్కల కంపెనీలపై ఉద్యాన, వ్యవసాయ అధికారులు తగు నిఘా వుంచి అన్నదాతలను నష్టాలబారి నుంచి కాపాడాలి. బడ్జెట్‌లో వివిధ శాఖలకు, రంగాలకు చేసిన కేటాయింపులు అంకెల గారడీ అని ప్రతిపక్షాలు విమర్శలు గుప్పించాయి. సంపద సృష్టించి అభివృద్ధి ఫలాలను పేదలకు అందించి రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీస్డిపి)ని 2047 నాటికి రూ2.4 లక్షల కోట్లకు పెంచాలనే బృహత్ లక్ష్యం అమలుకు ఎన్నో అవరోధాలున్నాయి. ఇందుకు కేంద్రం, వివిధ సంస్థలు, అంతర్జాతీయ సహాయ సహకారాలతో నవ్యాంధ్రలో సేద్యం, పరిశ్రమలు, ఐటీ, ఫార్మా, సేవా, శాస్త్ర, విజ్ఞాన సాంకేతిక రంగాలను ఉత్తేజితం చేసి, పారిశ్రామికీకరణ ద్వారా ఉద్యోగ ఉపాధి కల్పనను మెరుగు పరచాలి.

భారత్‌కు స్వాతంత్ర్యం లభించి 2047కు వందేళ్లు పూర్తయ్యే నాటికి భారత్ ను అభివృద్ధిచెందిన దేశంగా మార్చాలంటే రాష్ట్రాలు, కేంద్రం పరస్పర అవగాహన, సమన్వయంతో వ్యవహరిస్తేనే లక్ష్యాలను సాధించగలం.

ఆంధ్రప్రదేశ్‌కు 972 కి.మీ విస్తారమైన సముద్ర తీరం ఉండటం ఒక వరం. మౌలిక సదుపాయాలను వృద్ధి చేస్తూ, భారత ప్రభుత్వ సాగర మాల పథకం కింద విశాఖపట్నం, కాకినాడ, మచిలీపట్నం, రామాయంపేట, నిజాంపట్నం, కృష్ణపట్నం రేవులను ఇతోధికంగా అభివృద్ధి చేసి ఉత్పత్తి కేం ంద్రాలతో అనుసంధానించి గరిష్ఠ ప్రయోజనం పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం గట్టి ప్రయత్నాలు చేయాలి. సోదర తెలుగు రాష్ట్రం తెలంగాణాకు సముద్రతీరం లేనందున మచిలీపట్నం తదితర రేవులను తెలంగాణ సహకారంతో ఉభయ తారకంగా అభివృద్ధి చేయడానికి గల అవకాశాలను పరిశీలించాలి. భారత ప్రభుత్వం ప్రజలకు రక్షిత మంచినీటి సరఫరా కోసం జలజీవన్ మిషన్ అనే ఉదాత్త కార్యక్రమం ప్రారంభించింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి78 ఏళ్లైనా ఇప్పటికీ రక్షిత మంచినీరు సరఫరా లేని గ్రామాలెన్నో ఉన్నాయి. ప్రస్తుతం ఎండలు మండుతున్నాయి. కనుక జలజీవన్ ద్వారా ఈ గ్రామాలకు రక్షిత నీటిని సరఫరా చేయాలి. రాష్ట్రానికి జీవనాడి పోలవరం ప్రాజెక్టుకు బడ్జెట్లో రూ6వేలకోట్లు కేటాయించారు. కేంద్రప్రభుత్వం పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా గుర్తించినందున వచ్చే మూడేళ్లలో పూర్తి చేసి గరిష్ఠ ప్రయోజనాన్ని ప్రజలకు అందించాలి. నిర్వాసితులకు సహాయపునరావాసానికి కేంద్రం నుంచి గరిష్టంగా నిధులు రాబట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం గట్టి కృషి చేయాలి. వెనుకబడిన కరవు ప్రాంతాలలో నీటి పారుదల ప్రాజెక్టుల పూర్తికి ప్రత్యేక శ్రద్ధ వహించాలి. నేటి బాలలే రేపటి పౌరులు గనుక సంపూర్ణ అక్షరాస్యత సాధనకు తల్లికి వందనం ఎంతో మేలు చేస్తుంది. రాష్ట్రంలో ఇంజినీరింగ్ కళాశాలలు, ఐటిఐ, పాలిటెక్నిక్, ఇతర సాంకేతిక సంస్థలను అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా నవీకరించి, కృత్రిమ మేధ ఇతర అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తే ప్రపంచంలో వారు ఎక్కడైనా రాణించి దేశ ప్రతిష్ఠ పెంచుతూ స్వయం ఉపాధి పొందగలరు. మన పల్లె సీమల్లో ప్రజల ఆదాయాలు పెరగాలంటే పాడిపశువులు, కోళ్లు, గొర్రెలు, చేపలపెంపకాన్ని ప్రోత్సహించి ఉపాధికి తోడ్పడాలి. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం, గ్రామీణ రోడ్ల నిర్మాణం వంటి కేంద్ర పథకాలను గరిష్టంగా ఉపయోగించుకోవాలి. కేంద్రం నుంచి పంచాయతీరాజ్ నిధులను రాబట్టి గ్రామసీమల రూపురేఖలు మార్చడానికి ఉపముఖ్యమంత్రి కేంద్రంతో ఎప్పటికప్పుడు సంప్రదిస్తూ నిధులను రాబట్టాలి. రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణ, నదులు, కాలువలు, ఏర్ల ఆక్రమణలు తొలగించి వాటిని పరిశుభ్రంగా ఉంచే కార్యక్రమాలను ప్రజా భాగస్వామ్యంతో చేపట్టాలి. కేంద్రంలో నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వానికి చంద్రబాబు సారథ్యంలోని తెలుగుదేశం ప్రాణవాయువు అందిస్తున్నదున అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి పేదలకు అందించాలి. ప్రజాసేవ అంటే డబ్బు వెదజల్లి గెలిచి మళ్లీ ప్రజల నుంచి ప్రతి పనికి కమిషన్ లు గుంజే దోపిడీకి స్వస్తి చెప్పి ప్రజలకు మేలు చేసే పనులపై ప్రజాప్రతినిధులు శ్రద్ధ వహించి రాజకీయమంటే సేవచేసే పవిత్ర కర్తవ్య మనే భావనను పెంపొందిస్తే వారిపై గౌరవం పెరుగుతుంది. బడ్జెట్ అమలుపై ప్రజాప్రతినిధులు నిమగ్నమైతేనే సార్థకత.

> ఇప్పటికే భారీ రుణభారంతో తల్లడిల్లుతున్న ఆంధ్రప్రదేశ్‌కు కొత్త అప్పులు తేవడం మరింత భారమే. అయినా రాజకీయ పార్టీలు ఎన్నికలలో గెలవడానికి పోటా పోటీగా అలవిగాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చాయి. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఆ హామీలను అమలు చేసి తీరవలసిందే. మార్కెట్ నుంచి, ఆర్థిక సంస్థల నుంచి భారీగా అప్పులు చేయక తప్పదు. ప్రతిపాదిత రూ.40,635 కోట్ల మూలధన వ్యయం నిధుల కొరత దృష్ట్యా ఏమేరకు సాధ్యమో వేచి చూడాల్సిందే.

సీనియర్ జర్నలిస్టు, 9440990381

బీహార్‌లో గంగ అలవిగాని కాలుష్యం

-డా॥ అరుణ్ మిత్ర

బీహార్‌లో పారుతున్న గంగ అలవిగాని కాలుష్యంతో నిండి ఉందని ఆ రాష్ట్రంలో కాలుష్య నియంత్రణ బోర్డు వెల్లడించింది. గంగ నీటిలో స్నానం చేయడానికి కూడ వీలుకాదని సర్వే తెలిపింది. ఎందుకంటే అత్యధికంగా చెడు బ్యాక్టీరియా ఆ నీటిలో ఉంది. బీహార్ రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు అధ్యయనం చేసి నివేదిక విడుదల చేసింది. క్రమం తప్పకుండా గంగలో కాలుష్య నియంత్రణ బోర్డు అధ్యయనం చేస్తూ ఉంటుంది. ప్రయాగ్‌రాజ్ వద్ద లక్షలాది మంది పవిత్ర స్నానాలు చేసినప్పుడు కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు అధ్యయనం చేసి స్నానానికి కూడా అక్కడి నీరు ఉపయోగపడదని చెప్పింది. లక్షలాది మంది భక్తులు కుంభమేళా ప్రాంతానికి చేరుకున్నప్పుడు తీవ్రంగా తొక్కిసలాట జరిగి అనేక పదుల మంది మరణించినట్టుగా వార్తలు వచ్చాయి. పరిమితి కంటే మించి బీహార్‌లో గంగ నీరు కలుషితమైందని కాలుష్య నియంత్రణ బోర్డు వెల్లడించింది. నీరంతా దుర్గంధ పూరితమైందని అధ్యయనంలో తేలింది. 2025 ఫిబ్రవరి 16 వ తేదీన జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) ఆ రాష్ట్రంలో పారే గంగ నీరు ఎక్కువగా కలుషితం అయి ఉన్నప్పటికీ అక్కడ కోట్లాది మంది పవిత్ర స్నానం చేసేందుకు ఉత్తరప్రదేశ్ రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు అనుమతించడాన్ని తీవ్రంగా మందలించింది. కలుషిత నీటిలో స్నానాలు చేయడం వల్ల వివిధ రకాల చర్మ రోగాలు భక్తులకు వచ్చినట్టుగా వార్తలు అందాయి. అక్కడి నీటిని భక్తులు తాగేందుకు కూడా అనుమతించారని తెలుస్తోంది. అయితే యూపీ ముఖ్యమంత్రి యోగీఆదిత్యనాథ్ ప్రయాగ్‌రాజ్ వద్ద గంగ నీరు తాగేందుకు ఉపయోగపడేదేనని వాదించారు. ప్రభుత్వ సంస్థ అయిన ఎన్‌జీటీ ఇచ్చిన నివేదికను కూడా యోగీఆదిత్యనాథ్ పట్టించుకోలేదు. రాష్ట్రంలోని గంగలో అనేక ప్రాంతాలలో నీటి నాణ్యత ఏమాత్రం ప్రమాణానికి దగ్గరగా లేదని కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు చేసిన అధ్యయనం తెలిపింది. 2025 జనవరి 12, 23 తేదీలలో గంగ నీటిని పరీక్షించారు. నీటిలో బయో కెమికల్ ఆక్సిజన్ స్థాయిలు ఉండవలసిన దానికంటే అధికంగా ఉన్నాయని వెల్లడయ్యింది. బయో కెమికల్ ఆక్సిజన్ మూడు మిల్లీగ్రాముల కంటే ఎక్కువ ఉన్నట్లయితే అది కలుషితమయినట్లుగా పరిగణిస్తారు. డ్రైన్లలో ఏమాత్రం శుభ్రపరచని నీటిని నేరుగా గంగలోకి వదులుతున్నందున ఆ నీరు అపారంగా కలుషితమవుతున్నాయి. కొన్ని ప్రాంతాలలో గంగ నీటిని పైపుల ద్వారా విడుదల చేస్తున్నారు. ఈ నీరు సైతం కలుషితమైందే. ఈ నీటిని పట్టణాలు, నగరాలు ఎక్కువగా పరిశుభ్రం చేసినట్లయితే ప్రజలు వాడుకొనేందుకు ఉపయోగపడుతుంది. నది నీటిని వాడుకోరాదని శాస్త్రీయపరమైన హెచ్చరిక చేస్తున్నప్పటికీ ప్రజలు స్నానం చేయడానికి, తాగేందుకు కూడా ఉపయోగిస్తుంటారు. కుంభ్ సమయంలో ప్రజలు విశ్వాసంతో గంగ నీటిలో స్నానాలు చేశారు. దేవుడి ఆశీర్వచనాలతో తమకు ఏమీ కాదని ప్రజలు విశ్వసిస్తున్నారు. నదీ నీళ్లలో శవాలు సైతం ఉంటాయన్నది వాస్తవం. వ్యక్తిగత విశ్వాసమే ఎక్కువగా పని చేసింది. పైగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న జాగ్రత్త చర్యలు సక్రమంగా లేవని తీవ్ర విమర్శలు వచ్చాయి. కలుషిత నీటిని వినియోగించరాదని చట్టాలు ఉన్నప్పటికీ ఈ విషయాలను ఎవరూ పెద్దగా పట్టించుకోవటం లేదు.

2017 ఏప్రిల్ 12 న ఒక ఆంగ్ల పత్రికలో ప్రచురితమైన వార్తా సమాచారం ఇలా ఉంది. యమునా నదిని "ఆర్ట్ ఆఫ్ లివింగ్ (ఎఓఎల్)" ఫౌండేషన్ స్థాపకుడు శ్రీ శ్రీ రవిశంకర్ యమునా నదిని కలుషితం చేసినందున వంద నుంచి నూటఇరవై కోట్ల రూపాయల జరిమానా చెల్లించాలని నలుగురు సభ్యుల కమిటీ సిఫారసు చేసింది. యమున ఒడ్డున వారం రోజుల పాటు అంతర్జాతీయ స్థాయి ఉత్సవాన్ని ఆయన నిర్వహించారు. 2016లో దిల్లీలోని యమున ఒడ్డున ఎఓఎల్ ఆధ్వర్యంలో భారీగా ఉత్సవం జరిగింది. అప్పుడు యమునా నది అలవిగానంత కలుషితమైంది. దాన్ని బాగు చేయటం కోసమే ఈ జరిమానా చెల్లించాలని ప్రభుత్వ అధ్యయన కమిటీ సిఫారసు చేసింది. అయితే ప్రభుత్వ ఆదరణ అత్యధికంగా ఉన్నందున జరిమానా చెల్లించలేదని తెలుస్తోంది. ప్రజలను వాస్తవాల నుంచి దూరంగా కల్పితాలలో పాలకులు ఉంచుతున్నారు. ఏమాత్రం శాస్త్రీయం కాని అంశాల వైపు ప్రజలను తీసుకువెళుతున్నారు. ఉదాహరణకు కేన్సర్‌తో సహా వివిధ తీవ్రమైన వ్యాధులు గోవు మూత్రం తాగితే నయమవుతుందని ప్రచారం సాగిస్తున్నారు. గోమూత్రం తాగితే రొమ్ము కేన్సర్ కూడా నయమైందని బీజేపీ పార్లమెంటు సభ్యురాలు ప్రగ్యా ఠాకూర్ ప్రచారం చేశారు. అనేక వ్యాధులకు గోవు పేడ కూడా ఉపయోగపడుతుందని ప్రచారం సాగుతోంది. ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి త్రివేంద్రసింగ్ రావత్ 2019 జులైలో గోవు మాత్రమే ఉచ్ఛ్వాస, నిశ్వాసలు చేస్తుందని చెప్పారు. గోవు శ్వాసను ప్రజలు పీల్చినట్లయితే వారికి ఉన్న శ్వాసకోశ సమస్యలు నయమవుతాయని ముఖ్యమంత్రి చెప్పారు. గోవు ప్రాణవాయువును అందిస్తుందని ఆయన వివరించారు. ఆంధ్రప్రదేశ్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ జలంధర్‌లో జరిగిన ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ సభలో మాట్లాడుతూ నూరుగురు కౌరవులు కుండల్లో జన్మించారని చెప్పారు. ఇలాంటి అశాస్త్రీయమైన అంశాలపై ప్రచారం సాగించి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. అంతేకాదు శాస్త్ర పరిజ్ఞానం వైపు విద్యార్థులు వెళ్లకుండా నిరోధిస్తున్నారు. బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రధానమంత్రి నరేంద్రమోదీ 2014 అక్టోబరులో ముంబైలో ఒక ఆసుపత్రిని ప్రారంభించారు. అప్పుడు మాట్లాడుతూ హిందూ దేవుడు గణేశుడికి ఏనుగు తలను అమర్చారనీ, ప్రాచీన భారతంలో ప్లాస్టిక్ సర్జరీ కూడా ఉన్నదని చెప్పారు. తప్పుడు కథలను వ్యాప్తి చేయడానికి మోదీ పూనుకున్నారు. ఇప్పటికైనా శాస్త్ర పరిజ్ఞానాన్ని పెంపొందించడానికి బీజేపీ ప్రభుత్వం సిద్ధపడుతుందని ఆశిద్దాం.

ఇప్టాకన్నా ముందే ప్రజానాట్యమండలి

ఆర్వీ రామారావ్

బొంబాయిలో 1943 మే 25న అఖిలభారత ప్రజానాట్య మండలి (ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ - ఇప్టా) ఏర్పడిన రోజుననే అక్కడే ఆంధ్ర ప్రజానాట్య మండలి కమిటీ కూడా ఏర్పడింది. 1943 మే 23 నుంచి జూన్ ఒకటవ తేదీ వరకు బొంబాయిలో భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ప్రథమ మహాసభలు జరిగాయి. సీపీఐ 1925లో కాన్పూర్‌లో ఏర్పడినా దీర్ఘకాలం నిషేధంలో ఉన్నందువల్ల మహాసభలు నిర్వహించడానికి అవకాశం లేకుండా పోయింది. అప్పటి సీపీఐ అగ్రనాయకులు పి.సి.జోషి ప్రతి రాష్ట్రం నుంచి కళాకారుల బృందాన్ని పంపించాలని కోరారు. కళలు ప్రజల్ని చైతన్యవంతులను చేయడానికి ఉపయోగ పడ్తాయి కనక కళాకారులను సమైక్య పరిచి జాతీయోద్యమంలో వారిని భాగస్వాములను చేయాలనేది పి.సి.జోషి ఆలోచన. ఆ సందర్భంగానే కళాకారుల సమావేశం బొంబాయిలో జరిగింది.

మిక్కిలినేని, కోసూరి పున్నయ్య, సిరివిశెట్టి సుబ్బా రావు, కోడూరి అచ్చయ్య, ఎస్.వి.కె. ప్రసాద్, కొండెపూడి లక్ష్మి నారాయణ, తమ్మారెడ్డి సత్యనారాయణ, మానికొండ సూర్యావతి, కాట్రగడ్డ హనుమాయమ్మ, చంద్ర సావిత్రి, వెల్లంకి అన్నపూర్ణ, పెరుమాళ్లు, డా. రాజారావు ఆంధ్రా నుంచి ఈ సమావేశాలకు హాజరయ్యారు. ఆంధ్ర నుంచి వెళ్లిన కళాకారుల బృందానికి ముక్కామల నాగభూషణం నాయకత్వం వహించారు. కళ కళ కోసం కాదు ప్రజల కోసం అని దేశంలో మొట్టమొదటి సారి చాటి చెప్పింది ప్రజానాట్య మండలే. కళ ప్రజల కోసమేనని దేశవ్యాప్తంగా ప్రచారం చేసింది. జానపద కళా రూపాలను వెలికి తీసి ఆధునిక ఇతివృత్తాలతో జనరంజకం చేయడానికి ఇప్టా నిర్ణయించింది. స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలకోసం, ఆర్థిక, సామాజిక న్యాయం కోసం పోరాడే ప్రజల పక్షాన నిలవాలని బొంబాయి సమావేశంలో నిర్ణయించారు.

ఈ లక్ష్య సాధన కోసం ఎస్.ఎం.జోషి

అధ్యక్షులుగా, అనిల్ డి సిల్వా ప్రధాన కార్యదర్శిగా ఒక కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీలో ఆంధ్ర ప్రాంతం నుంచి డాక్టర్ రాజారావు, హైదరాబాద్ సంస్థానం నుంచి మఖ్దూం మొహియుద్దీన్ నియమితులయ్యారు. అప్పటికి ఏ.ఐ.టి.యు.సి. అధ్యక్షులుగా ఉన్న ఎస్.ఎ.డాంగే, కిసాన్ సభ నాయకులు బంకిం ముఖర్జీ, అఖిలభారత అభ్యుదయ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి సజ్జాద్ జహీర్, ఎ.ఐ.ఎస్.ఎఫ్. నాయకులు అరుణ్ బోస్ కూడా ఈ కమిటీ సభ్యులుగా ఉన్నారు.

ముక్కామల నాగభూషణం

మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి

కొండపల్లి కోటేశ్వరమ్మ

అల్లు రామలింగయ్య

ఆంధ్రరాష్ట్రంలో ప్రజానాట్య మండలి బాధ్యతలు ముక్కామల నాగభూషణం, డా. రాజారావు, కోడూరి అచ్చయ్యకు అప్పగిస్తూ తాత్కాలిక కమిటీ ఏర్పాటు అయింది. ఆ సమయంలో రెండో ప్రపంచ యుద్ధం సాగుతోంది. హిట్లర్ సైన్యాలు యూరప్‌ను ఆక్రమిస్తున్నాయి. హిట్లర్ నాజీయిజాన్ని నిరసిస్తూ ప్రపంచ వ్యాప్తంగా ఉద్యమం ప్రారంభమైంది. మన రాష్ట్రంలో 1943 మార్చి నెలలో కృష్ణా జిల్లా కొడాలిలో ఫాసిస్టు వ్యతిరేక ప్రచారం చేయడానికి యువజన శిక్షణా శిబిరం జరిగింది. అప్పుడు యువకులుగా ఉన్న కోగంటి గోపాల కృష్ణయ్య, తమ్మా రెడ్డి సత్యనారాయణ, కొడాలి ఆదిశేషయ్య, సుంకర సత్యనారాయణ ఆ శిబిరానికి హాజరయ్యారు. యుద్ధ వ్యతిరేక పాటలు, ఇతర కళారూపాలు తయారు చేసి ఫాసిజానికి వ్యతిరేకంగా ప్రచారం చేశారు. ఈ లెక్కన చూస్తే బొంబాయిలో ఇప్టా అవతరించడానికి, ఆంధ్ర రాష్ట్రంలో ప్రజా నాట్య మండలికి పునాదులు పడ్డాయి. ఈ శిబిరంలో పాల్గొన్నవారే ఆంధ్రలో 1943లో ప్రజానాట్య మండలి అవతరణలో పాత్రధారులయ్యారు.

కృష్ణా జిల్లా తిరువూరులో చిన్న వ్యవసాయ కుటుంబంలో పుట్టిన సుంకర సోదరులు సత్యనారాయణ, వీరభద్ర రావుకు కళలు సాహిత్యం మీద అభిరుచి ఉండేది. గుంటూరు జిల్లా పొన్నెకల్లులో నాజర్ నిరుపేద కుటుంబంలో జన్మించారు. ఆయనకు సంగీతం మీద ఆసక్తి అపారం. అప్పుడు గుంటూరు జిల్లా కమ్యూనిస్టు నాయకులుగా ఉన్న వేములపల్లి శ్రీకృష్ణ నాజర్‌ను ప్రజానాట్యమండలిలో చేర్చారు. ఆ సమయంలో నాజర్ "కష్ట జీవి" బుర్ర కథ రాశారు. దీనితోనే ప్రజానాట్య మండలి బుర్రకథ దళాలకు అంకురార్పణ జరిగింది. నాజర్ దళమే కాక రాష్ట్రవ్యాప్తంగా అనేక బుర్రకథ దళాలు ఏర్పడ్డాయి. డప్పు దళితులకు సొంతం అయిన వాయిద్య కళారూపం. దీన్ని మొట్టమొదట వెలుగులోకి తెచ్చింది ప్రజానాట్య మండలే. అమృతయ్య, ఏసుదాసులను ఉత్తమ డప్పు కళాకారులుగా దిద్ది తీర్చింది ప్రజానాట్య మండలే.

ఆ సమయంలో పౌరాణిక నాటకాలకు ఆంధ్ర ప్రాంతంలో ఆదరణ ఉండేది. ఆధునిక నాటకం ప్రారంభం అవుతున్న తొలి దశ అది. ప్రజానాట్య మండలి ఆవిర్భావం తరవాత తెలుగు నాటక రంగంలో గుణాత్మకమైన మార్పు తీసుకొచ్చింది. ఆ నాడు ప్రజానాట్య మండలి అధ్వర్యంలో ముందడుగు, మాభూమి నాటకాలు జనాన్ని ఉర్రూతలూగించాయి. తెలంగాణ సాయుధ పోరాటం ఇతివృత్తంగా మాభూమి నాటక ఇతివృత్తం. కష్టజీవి బుర్ర కథ ఇతివృత్తమూ అదే. మాభూమి నాటక ప్రదర్శనలకు ఒక కేంద్ర దళం, కృష్ణా జిల్లా దళం ఉండేవి. రాష్ట్ర దళానికి డా. రాజారావు దర్శకులు. కృష్ణా జిల్లా దళానికి కోడూరి అచ్చయ్య దర్శకులు. డా. రాజారావు, కోడూరి అచ్చయ్య, కోగంటి గోపాల కృష్ణయ్య, మిక్కిలినేని రాధాకృష్ణ, కోసూరి పున్నయ్య, నాజర్, పెరుమాళ్లు, అల్లు రామలింగయ్య, చదలవాడ కుటుంబరావు, మాచినేని వెంకటేశ్వర రావు, వల్లం నరసింహా రావు, వెంపటి రాధాకృష్ణ, సాలార్, కర్నాటి లక్ష్మీ నరసయ్య, రామకోటి, జమున, వీరమాచినేని సరోజిని, తాపీ రాజమ్మ, అన్నపూర్ణ, కొండేపూడి రాధ, కొండపల్లి కోటేశ్వరమ్మ, టి. చలపతి రావు, సి. మోహన్ దాస్, వి. మధుసూదన్ రావు, ప్రత్యగాత్మ, కె.బి.తిలక్, డప్పు కళాకారులు అమృతయ్య, ఏసుదాసు, రూపశిల్పి కుమార్ ఆ రోజుల్లో ఈ రెండు దళాల్లోనూ పని చేశారు. మాభూమి నాటకం ప్రదర్శించే దళాలు ఆ నాడు వందకు పైగా ఉండేవి. ఒక్క రాష్ట్ర దళమే వెయ్యికి పైగా ప్రదర్శనలిచ్చింది. తెలంగాణ ప్రాంతంలో ప్రసిద్ధి చెందిన జానపద కళా రూపాలు ఒగ్గు కథ, గొల్ల సుద్దులను కూడా ప్రజానాట్యం మండలి ఆధునీకరించి విస్తృతంగా ప్రదర్శించింది. కేంద్ర ప్రభుత్వం సాయుధ మిలటరీ దళాలను పంపి మాభూమి నాటకాన్ని, కష్టజీవి బుర్రకథను నిషేధించింది. ప్రజానాట్యమండలి మీద కూడా నిషేధం విధించింది. 1948లో నిషేధం తరవాత అనేకమంది కళాకారులు మద్రాసు వెళ్లారు. డా. రాజారావు రాజమండ్రిలో ప్రజా వైద్యశాల ఏర్పాటు చేసి వైద్యం చేశారు. సమాంతరంగా "రాఘవా కళా నిలయం" పేరుతో నాటకాలు ప్రదర్శించేవారు. 1955 తరవాత ప్రజానాట్యమండలిలో కూడా స్తబ్దత ఆవరించింది. ఆ తరవాత 1973లో హైదరాబాద్‌లో ప్రజానాట్యమండలి కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. 1974 నాటికి ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి పునరుద్ధరణ సాధ్యమైంది. ఈ పునరుద్ధరణలో నల్లూరి వెంకటేశ్వర్లు, కందిమళ్ల ప్రతాప రెడ్డి కృషి అపారమైంది.

ఉపాధ్యాయినిగా రాష్ట్రపతి ముర్ము

న్యూఢిల్లీ: భారత రాష్ట్రపతిగా ద్రౌపదీ ముర్ము బాధ్యతలు చేపట్టి రెండేళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఆమె తనకెంతో ఇష్టమైన వృత్తి అయిన ఉపాధ్యాయురాలిగా మారారు. మంగళవారం ప్రెసిడెంట్ ఎస్టేట్‌లోని డా.రాజేంద్ర ప్రసాద్ కేంద్రీయ విద్యాలయ పాఠశాలకు వెళ్లి తొమ్మిదో తరగతి విద్యార్థులకు పాఠాలు బోధించారు. తొలుత విద్యార్థుల పేర్లు అడిగిన రాష్ట్రపతి వారి అభిరుచులు, లక్ష్యాలు తెలుసుకున్నారు. ఈ తరం విద్యార్థులు ఎంతో ప్రతిభావంతులని, సాంకేతికంగా వీరికి పుష్కలమైన అవకాశాలు ఉన్నాయని ముర్ము అన్నారు. అనంతరం గ్లోబల్ వార్మింగ్‌పై వారికి బోధించారు. భావితరాల కోసం పర్యావరణాన్ని కాపాడుకోవాలని విద్యార్థులకు తెలియజేశారు. నీటి సంరక్షణ ప్రాముఖ్యాన్ని వివరించారు. పర్యావరణ మార్పు ప్రభావం మనపై పడకుండా ఉండాలంటే వీలైనన్ని ఎక్కువ మొక్కలు నాటాలని విద్యార్థులను ప్రోత్సహించారు. నీటి సంరక్షణ ప్రాముఖ్యాన్ని విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ పిలుపునిచ్చిన 'ఏక్ పేడ్ మా కే నామ్ (అమ్మ పేరుతో ఒక మొక్కను నాటండి)' గురించి ప్రస్తావించారు. ప్రతీ విద్యార్థి తమ పుట్టిన రోజున ఓ మొక్క నాటాలని రాష్ట్రపతి ఆకాంక్షించారు. ఒడిశాకు చెందిన ద్రౌపదీ ముర్ము దేశ 15వ రాష్ట్రపతిగా 2022 జులై 25న ప్రమాణస్వీకారం చేశారు. దేశ అత్యున్నత పీఠాన్ని అధిరోహించిన తొలి ఆదివాసీ వ్యక్తిగా ఆమె చరిత్ర సృష్టించారు.

'సోషల్ మీడియా'పై ఇక ఐటీ కన్ను

న్యూఢిల్లీ : ఆదాయపు పన్ను విభాగం అధికారులు ఇకపై వ్యక్తుల సోషల్‌మీడియా ఖాతాలు, ఇ-మెయిల్స్, ఆన్‌లైన్‌లో చేసిన పెట్టుబడులు, ట్రేడింగ్ ఖాతాల వివరాలు సైతం కోరవచ్చు. పన్ను ఎగవేతకు పాల్పడడం లేదా ఆదాయానికి మించి ఆస్తులు, నగదు, బంగారం కలిగి ఉన్నట్లు గుర్తిస్తే మీ ఖాతాలన్నింటినీ వారు తనిఖీ చేయొచ్చు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొస్తున్న ఆదాయపు పన్ను బిల్లులో దీనికి సంబంధించిన నిబంధనలను పొందుపరిచారు. ఆయా నిబంధనలు ఐటీ అధికారులకు కొత్త అధికారాలను కట్టబెట్టనున్నాయి. ప్రస్తుతం అమలులో ఉన్న ఆదాయపు పన్ను చట్టం-1961 ప్రకారం ఆదాయపు పన్ను అధికారులకు కొన్ని పరిమిత అధికారాలు మాత్రమే ఉన్నాయి. ఎవరైనా ఆదాయపు పన్ను ఎగవేతకు పాల్పడినట్లు విశ్వసనీయ సమాచారం ఉంటే సోదాలు, తనిఖీలు నిర్వహిస్తారు. లావాదేవీలకు సంబంధించిన ఏవైనా డాక్యుమెంట్లు, ఆర్థిక వివరాలకు సంబంధించిన పత్రాలను దాచిపెట్టినట్లు అనుమానం వస్తే డోర్లు, లాకర్లు పగలగొట్టే అధికారం ఐటీ అధికారులకు ఉంది. అయితే కొత్త ఆదాయపు పన్నుకు సంబంధించిన బిల్లులో మరిన్ని కొత్త అధికారాలు చేర్చారు. ఇకపై వ్యక్తుల వర్చువల్ డిజిటల్ సిస్టమ్ లేదా కంప్యూటర్ సిస్టమ్‌లోకి చొచ్చుకెళ్లే అధికారం కూడా ఉంటుంది. దీని ప్రకారం... ఆదాయపు పన్ను ఎగవేతకు సంబంధించి సమాచారం ఉంటే అధికారులు సంబంధిత వ్యక్తి ఇ-మెయిల్స్, బ్యాంక్ ఖాతాలు, ట్రేడింగ్ ఖాతాలు, సోషల్ మీడియా కార్యకలాపాలను ఆరా తీయొచ్చు. పార్లమెంటు ఆమోదం పొందితే 2026 ఏప్రిల్ 1 నుంచి కొత్త చట్టం అమలులోకి రానుంది.

రెజ్లర్ సుశీల్‌కుమార్‌కు బెయిల్

న్యూఢిల్లీ : భారత స్టార్ రెజ్లర్ ఒలింపియన్ సుశీల్ కుమార్‌కు ఢిల్లీ హైకోర్టులో ఊరట లభించింది. జూనియర్ రెజ్లర్ సాగర్ ధన్కర్ హత్య కేసులో సుశీల్ కుమార్‌కు రెగ్యులర్ బెయిల్ దక్కింది. జూనియర్ రెజ్లర్ సాగర్ ధన్కర్ 2021లో హత్యకు గురయ్యాడు. దాంతో పోలీసులు 2021 మే నెలలో సుశీల్ కుమార్‌ను అరెస్ట్ చేశారు. ఇదే కేసులో గతంలో కూడా సుశీల్‌కు బెయిల్ దొరికింది. 2023 జులైలో మోకాలి శస్త్ర చికిత్స కోసం ఆయనకు ఏడు రోజుల పాటు మధ్యంతర బెయిల్ లభించింది. మంగళవారం ఢిల్లీ హైకోర్టు రెగ్యులర్ బెయిల్ ఇచ్చింది. కాగా సుశీల్ కుమార్ ఒలింపిక్స్‌లో భారతదేశానికి రజత, కాంస్య పతకాలు అందించారు. సాగర్ ధన్కర్ హత్య కేసులో మొత్తం 18 మంది నిందితులుగా ఉన్నారు. వారిలో సుశీల్ కుమార్ కూడా ఒకరిగా ఉన్నాడు. కాగా, ఢిల్లీలోని ఛత్రసాల్ స్టేడియం వద్ద 2021 మే 4న సాగర్‌తో పాటు అతని స్నేహితులు సోను, అమిత్ కుమార్‌పై సుశీల్ కుమార్, అతని స్నేహితులు దాడి చేసినట్లు ఆరోపణలున్నాయి. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన సాగర్ అక్కడికక్కడే మృతి చెందాడు. సుశీల్ కుమార్, అతని స్నేహితులపై హత్య కేసులు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు.

రెండుగా విడిపోయిన రైలు...

ప్రయాణికుల్లో టెన్షన్

లక్నో : ఉత్తర ప్రదేశ్‌లో ఒక రైలు రెండుగా విడిపోయిన ఘటన చోటుచేసుకుంది. దీంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అయితే ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. నందన్ కానన్ ఎక్స్‌ప్రెస్ రైలు సోమవారం ఢిల్లీ నుంచి ఒడిశాలోని పూరికి బయలుదేరింది. అయితే ఈ రైలు ఉత్తర ప్రదేశ్‌కు చెందిన చందౌలీలో గల పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జంక్షన్ సమీపంలోకి రాగానే రెండుగా విడిపోయింది. కప్లింగ్ విరిగిపోవడంతో ఎస్-4, ఎస్-5 కోచ్‌లు రెండుగా విడిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అప్రమత్తమైన అధికారులు చర్యలు చేపట్టారు. ప్రయాణికులను మరొక కోచ్‌కు తరలించారు. దాదాపు నాలుగు గంటలు శ్రమించి సమస్యను పరిష్కరించారు. రైలు వేగం తక్కువగా ఉండటంతో ప్రమాదం తప్పినట్లు ఒక ప్రయాణికుడు తెలిపాడు.

నిరంకుశత్వాన్ని ఎదిరిస్తాం

మల్లికార్జున ఖర్గే

న్యూఢిల్లీ: నిరంకుశత్వాన్ని ఎదిరిస్తామని, సమాచార హక్కు సహా ప్రజల హక్కుల పరిరక్షణ కోసం పోరాడతామని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మంగళవారం ఉద్ఘాటించారు. డేటా పరిరక్షణ చట్టం ద్వారా సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ)ని బలహీనపర్చేందుకు మోదీ ప్రభుత్వం యత్నిస్తోందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ఎట్టిపరిస్థితుల్లోనూ ఆర్టీఐని బలహీనపడనివ్వబోదన్నారు. ఇందుకోసం వీధుల నుంచి పార్లమెంటు వరకు పోరాడతామని... గళాన్ని వినిపిస్తామని ఖర్గే అన్నారు. కొన్నేళ్లుగా తప్పుడు సమాచారం వ్యాప్తిలో భారత్ రాణిస్తోందని ఎద్దేవా చేశారు. డేటా పరిరక్షణ చట్టం ద్వారా యూపీఏ తెచ్చిన ఆర్టీఐ చట్టాన్ని నీరుగార్చాలని మోదీ ప్రభుత్వం భావిస్తోందని 'ఎక్స్'లో పేర్కొన్నారు. 'రేషన్ కార్డుల జాబితా మొదలు గ్రామీణ ఉపాధి హామీ లబ్ధిదారులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందే వారి పేర్లు, ఓటర్ల జాబితా, ప్రభుత్వ బ్యాంకులకు శఠగోపం పెట్టి విదేశాలకు పలయానం సాగించిన ఆర్థిక నేరగాళ్ల పేర్లు వంటవన్నీ ప్రజలకు తెలియాలని, ప్రభుత్వ రంగానికి సంబంధించిన సమాచారం ప్రజలకు అందుబాటులో ఉండాలని ఖర్గే అన్నారు. సమాచార హక్కు చట్టాన్ని బలహీనపర్చడం ద్వారా ఆయా సమాచారం ప్రజా క్షేత్రంలోకి రాకుండా చేయడమే మోదీ ప్రభుత్వ ఉద్దేశమని ఆరోపించారు. వ్యక్తిగత హక్కు అన్నది ప్రాథమిక హక్కు అని ఇందుకోసం కాంగ్రెస్ పోరాడిందని గుర్తుచేశారు. ప్రజా సంక్షేమానికి సంబంధించినంత వరకు సమాచార హక్కు అవసరమని అన్నారు. 'ఆర్టీఐని కాంగ్రెస్ పార్టీ బలహీనం కానివ్వదు. గతంలోనూ ఇందుకోసం గళం వినిపించాం. ఇప్పుడు కూడా గొంతెత్తుతాం. వీధుల నుంచి పార్లమెంటు వరకు పోరాడతాం. ప్రజల హక్కుల పరిరక్షణ కోసం నిరంకుశ ప్రభుత్వంపై పోరాడటాన్ని కొనసాగిస్తాం' అని ఖర్గే పేర్కొన్నారు.

బంగారు రుణాల పెరుగుదల మోదీ సృష్టించిన సంక్షోభ ప్రభావమే...

బంగారు రుణాలు ఏకంగా 71.3శాతం మేర పెరగడం మోదీ సృష్టిత ఆర్థిక సంక్షోభ ప్రభావమని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ విమర్శించారు. ఆర్బీఐ-ఫిబ్రవరి డేటా ఆధారంగా ఆయన ఈ మేరకు పేర్కొన్నారు. '2024లో ఆర్థిక మాంద్యం వల్ల బంగారు రుణాలు ఐదేళ్లలో 300 శాతం పెరిగాయి. తొలిసారి లక్ష కోట్ల రూపాయల మార్కును దాటాయి. ఇది భారతీయ మహిళలకు దుర్వార్త. ఆర్బీఐ ప్రకారం 2025 ఫిబ్రవరిలో స్వర్ణ రుణం ఏకంగా 71.3శాతం మేర పెరిగింది' అని జైరాం రమేశ్ 'ఎక్స్'లో పేర్కొన్నారు.

అన్ని రంగాల్లో బంగారు రుణాలు మందగిలించినట్లు తెలిపారు. ఇంటి రుణాలు మొదలు కార్ల లోన్ల వరకు మందగమనం కనిపిస్తోందన్నారు. బంగారు రుణాల్లో దాదాపు 40శాతం మేర మహిళలకు ఇవ్వగా... తమ ఆభరణాలను తనఖా పెట్టిన మహిళల సంఖ్య ఐదేళ్లలో 22శాతం పెరిగిందని సిబిల్-నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం తెలుస్తోందని జైరాం రమేశ్ వెల్లడించారు. ఆర్థికపరమైన అసమర్థతను మోదీ ప్రభుత్వం మళ్లీ బయట పెట్టుకున్నదని దుయ్యబట్టారు. మోదీ ప్రభుత్వ ఆర్థికపరమైన అసమర్థతకు భారతీయ మహిళలు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోందని పేర్కొన్నారు.

వన్యప్రాణులతో మోదీ ఆట

జామ్‌నగర్: ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా సోమవారం గుజరాత్‌లోని గిర్ అడవుల్లో సఫారీని సందర్శించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రెండోరోజైన మంగళవారం వన్యప్రాణులతో సన్నిహితంగా మెలుగుతూ...వాటి ఆడుతూ గడిపారు. వాటికి ఆహారం అందజేశారు. జామ్‌నగర్ జిల్లాలోని వన్యప్రాణుల రక్షణ, పునరావాసం, సంరక్షణ కేంద్రం 'వంతారా'ను సందర్శించారు. రిలయెన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముకేశ్ అంబానీ, ఆయన భార్య నీతా అంబానీ, కుమారుడు అనంత అంబానీ, కోడలు రాధికా మర్చంట్ సైతం పాల్గొన్నారు. వన్యప్రాణుల పునరావాస కేంద్రలో ఆశ్రయం పొందుతున్న వివిధ జాతుల జంతువులతో ప్రధాని సన్నిహితంగా మెలుగుతూ, అక్కడి ఆసియా సింహం పిల్లలు, తెల్ల సింహం పిల్లలు, అరుదైన క్లౌడెడ్ చిరుత పిల్లలకు స్వయంగా ఆహారం అందజేశారు. ఇందుకు సంబంధించిన వీడియోలు, ఫోటోలు మోదీ అఫీషియల్ యూట్యూబ్ హ్యాండిల్‌లో షేర్ చేశారు. వంతారాలోని పునరావాస కేంద్రలోని, ఆసుపత్రి, వెటర్నరీ సౌకర్యాలను, అక్కడ ఏర్పాటు చేసిన ఎంఆర్ఐ, సీటీ స్కాన్, ఐసీయూ తదితర సౌకర్యాలను మోదీ వీక్షించారు. ప్రధాని మోదీ ఆహారం అందించిన తెల్లటి సింహం పిల్లకు ఒక చిన్న కథ ఉంది. పెద్ద సింహాన్ని సంరక్షించి పునరావాస కేంద్రానికి తరలించిన తర్వాత దానికి ఈ పిల్ల పుట్టింది. ఆసుపత్రిలోని ఆపరేషన్ థియేటర్‌లో లైఫ్ సేఫింగ్ సర్జరీ జరుగుతున్న మరో చిరుతను మోదీ సందర్శించారు. హైవేపై కారు గుద్దడంతో తీవ్ర ప్రాణాపాయ పరిస్థితుల్లో ఉన్న ఈ చిరుతను పునరావస కేంద్రానికి తెచ్చారు. సర్కస్ నుంచి కాపాడి పునరావాస కేంద్రానికి తీసుకువచ్చిన గోల్డెన్ టైగర్, 4 స్నో టైగర్లతో మోదీ కాసేపు ఎదురెదురుగా కూర్చుని సన్నిహితంగా మెలిగారు. పునరావాస కేంద్రంలోని అతి పెద్ద కొండచిలువ, రెండు తలల పాము, రెండు తలల తాబేలు తదితర వన్యప్రాణాలతో కొద్దిసేపు గడిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఎలిఫెంట్ ఆసుపత్రిని కూడా వంతరాలో ఆయన సందర్శించారు. అక్కడి వైద్యులు, సహాయక సిబ్బంది, వర్కర్లతో సంభాషించారు. వంతారా అనేది కృత్రిమ అడవి. గుజరాత్‌లోని జామ్‌నగర్ రిలయెన్స్ రిఫైనరీ కాంప్లెక్స్‌లో 3 వేల ఎకరాల్లో వంతారా ఉంది. ఇక్కడ 25 వేల చదరపు అడుగుల విస్తీర్ణం ఏనుగుల కోసం ప్రత్యేక ఆసుపత్రి కూడా ఉంది. ఇందులో రెండు వేల వన్యప్రాణులను సంరక్షిస్తున్నారు. వంతారాలో 2,000కు పైగా ప్రత్యేక జాతుల జంతువులు ఉన్నాయి. గాయపడిన, ఇబ్బందుల్లో ఉన్న 1.5 లక్షల జంతువులను రక్షించి ఈ పునరావస కేంద్రంలో ఆవాసం కల్పిస్తున్నారు. 2,100 మంది నిపుణులైన సిబ్బంది ఇందులో పనిచేస్తున్నారు. వీరు జంతువుల పరిరక్షణతో పాటు వన్యప్రాణుల సంరక్షణ, బయోడైవర్సిటీ ప్రాధాన్యతపై సందర్శకులకు అవగాహన కల్పిస్తున్నారు.

'విపశ్యన ధ్యానం' కోర్సుకు కేజ్రీవాల్

న్యూఢిల్లీ : ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ 'విపశ్యన ధ్యానం కోర్సు'కు వెళ్లనున్నట్లు తెలిసింది. పది రోజుల పాటు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఇటీవల ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ ఓటమి తర్వాత కేజ్రీవాల్ ప్రస్తుతం పార్టీ కార్యకలాపాలకే పరిమితమయ్యారు. ఈ నేపథ్యంలో ధ్యానం కోర్సుకు పంజాబ్‌లోని హోషియాపూర్ వెళ్లనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. మార్చి 5 నుంచి 15వ తేదీ వరకు ఆయన ధ్యాన కేంద్రంలోనే ఉండనున్నట్లు తెలిసింది. కాగా, గతంలోనూ కేజ్రీవాల్ పది రోజుల పాటు విపశ్యన ధ్యానం చేసిన విషయం తెలిసిందే. 2023 డిసెంబరులో హోషియాపూర్‌లోని ధ్యాన కేంద్రంలోనే ఉన్నారు. విపశ్యన పురాతన భారతీయ ధ్యాన పద్ధతి. ఇందులో అభ్యాసకులు వారి మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోడానికి కోర్సు పూర్తయ్యే వరకు పది రోజుల పాటు ఎవరితో మాట్లాడకుండా ఉంటారు. అలాగే అభ్యాసన కేంద్రం నుంచి బయటకు రావడం అనేది ఉండదు. బయటి వ్యక్తులకు ఇందులో ప్రవేశం ఉండదు. కాగా, కేజ్రీవాల్ చాలా కాలంగా విపశ్యన ధ్యాన సాధన చేస్తున్నారు. గతంలో బెంగళూరు, జైపూర్‌తో సహా అనేక ప్రాంతాల్లో ఆయన ధ్యానం సాధన చేశారు.

మందుల ధరలపై నియంత్రణేది?

సుప్రీంకోర్టు ఆగ్రహం

న్యూఢిల్లీ: ప్రజలకు భరించదగిన ధరల్లో వైద్యం, మందులు, ఇతర సదుపాయాలు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సుప్రీంకోర్టు ఆక్షేపించింది. రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యమే ప్రైవేటు ఆస్పత్రులకు ప్రోత్సాహకంగా మారిందని వ్యాఖ్యానించింది. ప్రైవేటు ఆస్పత్రులన్నీ రోగులు, వారి బంధువులతో బలవంతంగా అధిక ధరలతో కూడిన మందులను కొనుగోలు చేయిస్తున్నాయని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంలో విచారణ జరిగింది. తమ ఫార్మసీల నుంచే ఔషధాలు కొనుగోలు చేయాలని రోగులను బలవంతం చేయకుండా ప్రైవేటు ఆసుపత్రులకు ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్ కోర్టుకు విజ్ఞప్తి చేశారు. నియంత్రణ చర్యలు తీసుకోవడంలో కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని, దానివల్ల రోగులు దోపిడీకి గురవుతున్నారని పేర్కొన్నారు. పిటిషనర్ వాదనతో సుప్రీం ధర్మాసనం పూర్తిగా ఏకీభవించింది. రోగులకు సూచించిన ఔషధం వేరే చోట తక్కువ ధరకు లభిస్తున్నప్పుడు... దానిని తమ ఫార్మసీలోనే కొనుగోలు చేయాలని ప్రైవేటు ఆసుపత్రులు బలవంతం చేయకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. ముఖ్యంగా పేద వర్గాలకు ప్రాణాధార ఔషధాలు అందుబాటు ధరల్లో లభించడం కష్టమైపోయిందని వ్యాఖ్యానించింది. పౌరులు ఈ రకమైన దోపిడీకీ గురికాకుండా రక్షించేందుకు తగిన మార్గదర్శకాలు రూపొందించాలని కేంద్రాన్ని ఆదేశించింది. ఇదే విషయమై గతంలో సుప్రీంకోర్టు రాష్ట్రాలకు నోటీసులు ఇచ్చింది. వాటికి ఒడిశా, అరుణాచల్ ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, బిహార్, తమిళనాడు, హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలు స్పందించాయి. కౌంటర్ అఫిడవిట్‌ను దాఖలు చేశాయి. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ధరల నియంత్రణ ఆదేశాలపైనే తాము ఆధారపడతామని పేర్కొన్నాయి. అత్యవసర ఔషధాలు అందుబాటు రేటులో లభ్యమయ్యేలా చూసేందుకు వాటి ధరలను నిర్ణయించినట్లు తెలిపాయి. కాగా ఆసుపత్రిలోని ఫార్మసీలోని మందులు కొనుగోలు చేయాలనే ఒత్తిడి ఏదీ లేదని కేంద్రం కోర్టుకు సమాధానమిచ్చింది.

అయోధ్య ఆలయంపై దాడికి కుట్ర

ఐఎస్ఐ అనుమానిత ఉగ్రవాది అరెస్ట్

లక్నో : అయోధ్య రామమందిరంపై దాడికి కుట్ర పన్నిన ఉగ్రవాదిని పోలీసులు అరెస్టు చేశారు. ఉత్తర ప్రదేశ్‌లోని ఫైజాబాద్‌కు చెందిన రెహ్మాన్ (17) ను హర్యానా-గుజరాత్ పోలీసుల బృందం అరెస్టు చేసింది. రెండు హ్యాండ్ గ్రెనేడ్‌లతో రామమందిరాన్ని పేల్చాలని ప్రణాళిక చేశాడని, పాకిస్తాన్ ఉగ్రవాద సంస్థలతో రెహ్మాన్‌కు సంబంధం ఉన్నట్లుగా పోలీసులు గుర్తించారు. రెహ్మాన్ మాంసం దుకాణం నిర్వహిస్తుండటంతో పాటు ఆటో నడుపుతున్నాడు. హర్యానా స్పెషల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు నిందితుడిని స్థానిక కోర్టులో హాజరుపరిచారు. రెహ్మాన్‌ను 10 రోజుల పోలీసు కస్టడీకి న్యాయస్థానం అప్పగించింది. పాకిస్తాన్ ఐఎస్ఐ కొంతకాలంగా అయోధ్యపై దాడికి కుట్ర పన్నినట్లుగా వర్గాలు పేర్కొన్నాయి. రెహ్మాన్... ఇస్లామిక్ సమావేశాల్లో కూడా పాల్గొన్నట్లు గుర్తించారు. 2024, జనవరిలో అయోధ్య రామమందిరం ప్రారంభమైంది. ఆ సమయంలో రెహ్మాన్ అనేక రౌండ్లు వేసినట్లుగా తెలుస్తోంది. అంతేకాకుండా నిఘా కూడా ఉంచినట్లు కనిపెట్టారు. ఇక్కడ సమాచారాన్ని ఎప్పటికప్పుడు పాకిస్తాన్‌కు చెందిన ఐఎస్ఐతో పంచుకున్నట్లు వర్గాలు తెలిపాయి.

రెండు హ్యాండ్ గ్రెనేడ్‌లను రైలులో అయోధ్యకు తీసుకువెళ్లాలని రెహ్మాన్ ప్రణాళిక చేశాడని, అయితే కేంద్ర భద్రతా సంస్థల నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా హర్యానా ఎస్‌టీఎఫ్, గుజరాత్‌లోని ఉగ్రవాద వ్యతిరేక బృందం రంగంలోకి దిగి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి దగ్గర నుంచి రెండు హ్యాండ్ గ్రెనేడ్లు స్వాధీనం చేసుకున్నారు. ఫరీదాబాద్ నుంచి 12 కి.మీ దూరంలో ఉన్న పాలి గ్రామం సమీపంలోని ఒక పాడుబడిన ఇంట్లో రెహ్మాన్ వాటి దాచిపెట్టాడు. రెండింటినీ బాంబ్ స్క్వాడ్ నిర్వీర్యం చేసింది. నిందితుడిని ఏటీఎస్ బృందం గుజరాత్‌కు తీసుకెళ్లి విచారిస్తున్నారు. అయితే ఈ కుట్రలో మరింత మంది పాత్ర ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితుడి నుంచి మరింత సమాచారాన్ని రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నారు.

ఉత్తరాదిలో మూడో భాష ఏది?

కేంద్రానికి తమిళనాడు సీఎం స్టాలిన్ ప్రశ్న

చెన్నై : త్రిభాషా సూత్రాన్ని తాను వ్యతిరేకిస్తున్నట్లు తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ మంగళవారం మరోసారి స్పష్టం చేశారు. ఉత్తరాదిలో మూడో భాషగా దేనిని నేర్పుతున్నారని కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. జాతీయ విద్యావిధానం అమలు విషయంలో కేంద్రం, తమిళనాడు ప్రభుత్వం మధ్య తీవ్ర వాగ్యుద్ధం జరుగుతోంది. కేంద్రం ప్రతిపాదించిన త్రిభాషా సూత్రాన్ని స్టాలిన్ ప్రభుత్వం ముందు నుంచీ వ్యతిరేకిస్తూ వస్తోంది. తమిళనాడు ప్రభుత్వం నిర్ణయంపై అనేక వర్గాల నుంచి మద్దతు లభిస్తుండగా... మరికొంతమంది వ్యతిరేకిస్తున్నారు. తమిళనాడులో విద్యార్థులకు మూడో భాషను నేర్చుకోవడానికి ఎందుకు అనుమతించడం లేదని కొందరు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై సీఎం స్టాలిన్ తాజాగా స్పందించారు. మూడు భాషల ఫార్ములాను తాను వ్యతిరేకిస్తున్నట్లు స్టాలిన్ స్పష్టం చేశారు. 'తమిళనాడు విద్యార్థులు మూడో భాషను నేర్చుకునేందుకు ఎందుకు నిరాకరిస్తున్నారంటూ మమ్మల్ని ప్రశ్నిస్తున్నారు. మరి ఉత్తరాదిలో మూడో భాషగా దేనిని నేర్పుతున్నారో మాత్రం చెప్పరెందుకు? అక్కడ రెండు భాషలను మాత్రమే బోధిస్తున్నట్లయితే ఇక్కడ మాత్రం మూడు భాషలను నేర్చుకోవాల్సిన అవసరం ఏముంది? అని కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని సీఎం స్టాలిన్ నిలదీశారు. మరోవైపు, స్టాలిన్ కుమారుడు, తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ సైతం ఇదే అంశంపై కేంద్రాన్ని నిలదీశారు. జాతీయ విద్యావిధానం ముసుగులో కేంద్రం తమపై హిందీ భాషను బలవంతంగా రుద్దుతోందని ఆరోపించారు. ఇలాంటి ప్రయత్నాలను తాము అంగీకరించబోమని స్పష్టం చేశారు. తాము మాత్రం ఎప్పటికీ జాతీయ విద్యా విధానాన్ని అమలు చేయబోమని ఆయన తేల్చిచెప్పారు.

యుద్ధ విమానాల తయారీలోకి 'ప్రైవేటు'

రక్షణ కమిటీ ఆమోదం

న్యూఢిల్లీ : భారత్‌లో యుద్ధ విమానాల తయారీలోకి ప్రైవేటు రంగం కూడా అడుగుపెట్టేందుకు మార్గం మరింత సుగమం అయింది. తాజాగా దీనికి సంబంధించి రక్షణ సాధికారిత కమిటీ ఈ మేరకు అనేక సూచనలు చేసింది. తేలికపాటి యుద్ధ విమానం తేజస్ ఉత్పత్తిని వేగవంతం చేసేందుకు ఐదుగురు సభ్యుల కమిటీని ఇటీవల నియమించిన విషయం తెలిసిందే. ఇది తాజాగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు నివేదిక సమర్పించింది. తాజాగా ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వ్యక్తులు ఒక ఆంగ్ల పత్రికతో మాట్లాడుతూ రక్షణ మంత్రి ఈ సూచనల అమలును దశలవారీగా చేపట్టినట్లు తెలిపారని అన్నారు. వైమానిక దళ ప్రధానాధికారి అమర్ ప్రీత్ సింగ్ కొన్ని నెలల నుంచి భారత్‌లో తేజస్ ఉత్పత్తి, సరఫరాలో జాప్యంపై బహిరంగంగానే విమర్శలు చేస్తున్నారు. ఒక పక్క వాయుసేన ఆపరేషనల్ స్క్వాడ్రన్ల సంఖ్య పడిపోతుండటంపై కూడా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కమిటీకి రక్షణ శాఖ కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్ అధ్యక్షత వహించారు. తాజాగా ఇది స్వల్పకాల, మధ్యకాల, దీర్ఘకాలంలో తీసుకోవాల్సిన చర్యలతో తేజస్ తయారీల్లోని సమస్యలను అధిగమించవచ్చని పేర్కొంది. ముఖ్యంగా ప్రైవేటు రంగాన్ని భాగస్వామిని చేయడంతో ఈ సమస్యలను అధిగమించవచ్చని తెలిపింది. వాయుసేన వచ్చే 20 ఏళ్లలో వివిధ శ్రేణులకు చెందిన దాదాపు 350 తేజస్ విమానాలను వినియోగించాలని భావిస్తోంది. కానీ అమెరికా నుంచి ఇంజిన్ల రాకలో జాప్యం, మందకొడి ఉత్పత్తి వంటి కారణాలతో ప్రణాళిక అమల్లో తీవ్ర జాప్యం చోటు చేసుకొంది.

పాకిస్థానీ అని పిలవడం...

మత విశ్వాసం కించపరిచినట్లు కాదు

సుప్రీం

న్యూఢిల్లీ : పాకిస్తానీ అని ఎవరినైనా పిలిస్తే అది మత విశ్వాసాలను కించపరిచినట్లు కాదని సుప్రీం కోర్టు తెలిపింది. మియాన్-తియాన్ లేదా పాకిస్తానీ అని పిలవడం హేళనకరమే అయినా, కానీ దాంట్లో మత విశ్వాసాలను దెబ్బతీసే ఉద్దేశం లేదన్నారు. న్యాయమూర్తులు జస్టిస్ బి.వి.నాగరత్న, సతీశ్ చంద్ర శర్మతో కూడిన ధర్మాసనం ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. ఓ ప్రభుత్వ ఉద్యోగిని పాకిస్తానీ అని పిలవడంతో అతను కేసును దాఖలు చేశారు. ఆ కేసులో మంగళవారం విచారణ చేపట్టిన సుప్రీం కోర్టు ఈ అభిప్రాయాన్ని వెలిబుచ్చింది. జార్ఖండ్‌కు చెందిన ఒక ఉర్దూ అనువాదకుడు ఈ ఫిర్యాదు చేశారు. సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసుకున్న నిందితుడికి సమాచారం ఇచ్చేందుకు ఇంటికి వెళ్లిన సమయంలో ప్రభుత్వ ఉద్యోగిపై ఆవేశానికి లోనయ్యాడు. ఆ ఉద్యోగి మతాన్ని దూషిస్తూ కొన్ని వ్యాఖ్యలు చేశాడు. విధులను అడ్డుకున్నట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఆ వ్యక్తిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఐపీసీలోని 298 (మతపరమైన విశ్వాసాలు), 504 (అవమానకర ప్రవర్తన), 353(ఉద్యోగిపై దాడి) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులో జార్ఖండ్ హైకోర్టు ఆదేశాలను సుప్రీం కోర్టు కొట్టిపారేసింది. పాకిస్తానీ అని పిలవడం అమర్యాదకరంగా ఉన్నా, అది మత విశ్వాసాలను దెబ్బతీసినట్లు కాదని సుప్రీం ధర్మాసనం తెలిపింది. శాంతికి విఘాతం కలిగించే రీతిలో నిందితుడు ప్రవర్తించలేదని, ఐపీసీలోని 353 సెక్షన్ కింద నిందితుడికి శిక్ష విధించే అవకాశం లేదని కోర్టు పేర్కొంది.

ఫడ్నవీస్ ప్రభుత్వాన్ని రద్దు చేయాలి

ఆదిత్య ఠాక్రే డిమాండ్

ముంబై: మహారాష్ట్రలోని దేవంద్ర ఫడ్నవీస్ ప్రభుత్వాన్ని రద్దు చేయాలని శివసేన (యూబీటీ) ఎమ్మెల్యే ఆదిత్య ఠాక్రే మంగళవారం డిమాండ్ చేశారు. బీడ్ జిల్లా సర్పంచ్ హత్య కేసులో ప్రధాన నిందితుడితో సంబంధాలు ఉన్నట్లు ఆరోపణలు రావడంతో మంత్రి ముండే పదవి నుంచి తప్పుకున్నారు. ఈ క్రమంలో ఆదిత్య ఎక్స్‌లో విమర్శలు గుప్పించారు. 'రాజీనామాకు ఇంత సమయం ఎందుకు పట్టింది? సర్పంచ్ హత్యకు గురైన నెలల తర్వాత కూడా హంతకుడు ఎవరో చెప్పేందుకు సరిపడ ఆధారాలు లేవు. ముఖ్యమంత్రి... మీ చేతులు కట్టేసినది ఎవరు?' అని నిలదీశారు. ఆదిత్య మీడియాతోనూ మాట్లాడారు. రాజీమానా చేస్తే సరిపోదు... ఈ ప్రభుత్వాన్ని రద్దు చేయాలని స్పష్టంచేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితి దారుణంగా ఉందని, దీనిని ఎవరూ నియంత్రించలేరని అన్నారు. బీడ్‌లో ఏం జరిగిందో ప్రభుత్వానికి తెలిసినా ఇంత కాలంగా మౌనం వహిస్తోందని ఆదిత్య ఠాక్రే దుయ్యబట్టారు. ఇదిలావుంటే బీడ్‌లోని మస్సాజోగ్ గ్రామ సర్పంచ్ సంతోశ్ దేశ్‌ముఖ్ గతేడాది డిసెంబరు 9న హత్యకు గురయ్యారు. ఈ కేసులో బీడ్‌కు గార్డియన్ మంత్రి ముండేకు సన్నిహితుడైన వాల్మిక్ కరాడ్‌తో పాటు ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. మరొక నిందితుడు పరారీలో ఉన్నారు. దేశ్‌ముఖ్ హత్యకు సంబంధించిన ఫొటోలు, వీడియోలతో పాటు లీకైన చార్జిషీటును సీఐడీ సోమవారం విడుదల చేసింది. ఈ క్రమంలో మంగళవారం తన రాజీనామాను మంత్రి ముండే 'ఎక్స్'లో ప్రకటించారు.

విశాలాంధ్ర హైదరాబాద్

గల్ఫ్ అమరుల సభకు సన్నాహాలు

మృతుల కుటుంబాలతో సహపంక్తి భోజనం చేయనున్న సీఎం

విశాలాంధ్ర - హైదరాబాద్ : గల్ఫ్ దేశాలలో మరణించిన కార్మికుల కుటుంబాలతో హైదరాబాద్, ప్రజాభవన్‌లో త్వరలో 'గల్ఫ్ అమరుల సంస్మరణ సభ' ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని తెలంగాణ రాష్ట్ర మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే అనిల్ ఈరవత్రి ఒక ప్రకటనలో తెలిపారు. గల్ఫ్ మృతుల కుటుంబ సభ్యులతో సీఎం రేవంత్ రెడ్డి సహపంక్తి భోజన కార్యక్రమంలో పాల్గొని వారికి భరోసా ఇవ్వనున్నారని ఆయన తెలిపారు. చనిపోయిన వారిని స్మరించండి ! బ్రతికున్న వారి కోసం పోరాడండి ! అనే స్ఫూర్తితో గల్ఫ్ దేశాల్లో ఏ కారణంగా చనిపోయినా, విధి నిర్వహణలో మరణం (ఆన్ డ్యూటీ డెత్) గా పరిగణించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియా ఆర్థిక సహాయం అందజేస్తున్నదని, ఇది దేశ చరిత్రలోనే ప్రథమం అని తెలిపారు. తన విజ్ఞప్తి మేరకు స్పందించిన ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి 94 మంది గల్ఫ్ మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున రూ.4 కోట్ల 70 లక్షల రూపాయల ఎక్స్ గ్రేషియా సొమ్ము వారి ఖాతాలకు ఈనెల ఒకటిన జమ చేయించారని అనిల్ తెలిపారు. గల్ఫ్ కార్మికులు ఆయురారోగ్యాలతో, క్షేమంగా మాతృభూమికి తిరిగి రావాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఆశిస్తున్నది. కానీ, దురదృష్ట వశాత్తు గల్ఫ్ దేశాలలో అకాల మరణం చెందిన మన తెలంగాణ ప్రవాసీ కార్మికుల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని ప్రభుత్వం సంకల్పించిందని అనిల్ వివరించారు.

చదువుతోనే సమాజంలో మనిషికి గుర్తింపు : జడ్జి కాటం స్వరూప

విశాలాంధ్ర - ఆమనగల్లు : చదువుతోనే సమాజంలో మనిషికి గుర్తింపు ఉంటుందని జడ్జి కాటం స్వరూప అన్నారు. పట్టణంలోని వివేక విద్యాభారతి పాఠశాలలో డిస్కవర్ హాబ్ (సైన్స్ -ఫెయిర్) మంగళవారం నిర్వహించారు. సైన్స్ ఫెయిర్ పలు ప్రదర్శనలు విద్యార్థుల మేధస్సుకు అద్దం పడుతున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సివిల్ జడ్జి స్వరూప, టాస్క్ సి.ఓ.ఓ, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి,ఆమనగల్లు మున్సిపల్ కమిషనర్ శంకర్, ఎంఈఓ పాండు హాజరై సైన్స్ ఫెయిర్ ను పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్, ప్రిన్సిపల్ మహమూద్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైన్స్ ఫెయిర్‌తో విద్యా ర్థుల్లో సృజనాత్మకత పెంపొందుతుందని, చదువుతోనే సమాజంలో మనిషికి గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సేవకులు పాపిశెట్టి రాము, ఎఎస్ఐ సీతారాం రెడ్డి, అల్లాజీ,శివలింగం,సుధీర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, నిరంజన్, వెంకటేష్, సంజీవ్ కుమార్, శ్రీనివాసులు, వెంకన్న, పాఠశాల యాజమాన్యం ఎవి శర్మ, మల్లేష్, కరుణాకర్, విజేందర్, అత్రి, స్వప్న, అరుణ, మీనా, స్వాతి, రత్నకుమారి, సుష్మిత, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలపై కుల సంఘాలతో సమావేశం

సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచారకులు ఆర్ కోటజీ

విశాలాంధ్ర - హైదరాబాద్ : డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని కుల సంఘ ప్రతినిధులతో సన్నాహక సమావేశం ఏర్పాటు చేసినట్లు సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు కోటాజి ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 5న డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్, , ఏప్రిల్ 14న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతులను పురస్కరించుకొని నేడు బుధవారం(మార్చ్ 5న) మధ్యాహ్నం 2.00 గంటలకు రోడ్డు నెంబర్ 10, జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ భవన్‌లో సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో కుల సంఘాల ప్రతినిధులు సమావేశమునకు హాజరై తమ తమ అమూల్యమైన సందేశాలను ఇవ్వవలసిందిగా ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

అర్హులందరికీ రుణాలు అందించాలి

మంజూరైన రుణాలపై సమీక్ష : డిఆర్ఓ ఈ.వెంకటాచారి

విశాలాంధ్ర - హైదరా బాద్ : జిల్లా పరిశ్రమల కేంద్రం ద్వారా షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల లబ్దిదారులకు రుణాల మం జూరిలో జాప్యం లేకుండా అర్హత మేరకు రుణాల అందించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఈ. వెంకటాచారి సంబం ధిత అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిఐసి ఆధ్వర్యంలో రుణాల మంజూరుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ జిల్లాలోని లబ్దిదారులకు సర్వీస్ సెక్టార్‌లలో ఎక్కువగా రుణాలు అందించినట్టు అన్నారు. షెడ్యూల్ కులాలకు చెందిన 14 మంది లబ్దిదారులకు టిఎస్ఐపాస్ మేరకు వివిధ సెక్టార్లలో రుణాలను అందించామని, అలాగే షెడ్యూల్ తెగలకు చెందిన 15 మంది లబ్దిదారులకు సర్వీస్ సెక్టార్లలో రుణాలను అందించామని అన్నారు. లబ్దిదారులు రుణాలకు సంబంధించిన యూటీలైజేషన్ సర్టిఫికెట్స్‌లను సంబంధిత బ్యాంకులలో అందచేయాలనీ సూచించారు. రుణాల మంజూరు, యూనిట్ల గ్రౌండింగ్, సబ్సిడీ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో జిఎం డిఐసి పవన్ కుమార్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కోటాజీ, ఈడి ఎస్సీ కార్పొరేషన్ రమేష్, ఎల్డిఎం సుబ్రహ్మణ్యం, డిసిటిఓ పుష్పలత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదుల వెల్లువ

విశాలాంధ్ర- శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి జోన్వ్యాప్తంగా సోమవారం ప్రజా వాణి కార్యక్రమం కొనసాగింది. జోనల్ కార్యాలయం తోపాటు షేర్ లింగంపల్లి ,చందానగర్ ,యూసుఫ్ గూడా ,పటాన్చెరువు సర్కిల్లో అధికారులు ప్రజల నుంచి విన తులను స్వీకరించారు. కాగా మొత్తం 22 వినతులు అధికారులకు అందాయి .ఇందు లో జోనల్ కార్యాలయంలో 3, శేర్లింగంపల్లి సర్కిల్ కార్యాలయంలో 12, యూసఫ్ గూడ సర్కిల్ కార్యాలయంలో 4 ,చందానగర్ సర్కిల్ కార్యాలయంలో 3 చొప్పున విన తులు వచ్చాయి. ఇందులో పట్టణ ప్రణాళిక, పన్ను విభాగం, ఇంజనీరింగ్ కు సంబం ధించి సమస్యలను ప్రజలు వినతిపత్రం రూపంలో అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన వినతు లపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు .అత్యంత ప్రాధా న్యతగా భావించి క్షేత్రస్థాయి పరిశీలనలు యుద్ధ ప్రాతిపదికన చేపట్టి తీసుకున్న చర్య లను తిరిగి ప్రజలకు నివేదించాలని జోనల్ కమిషనర్ సూచించారు. చందానగర్ సర్కి కార్యాలయంలో డిసి మోహన్ రెడ్డి ఆయా విభాగాల అధికారులతో ప్రజావాణిలో వినతులను స్వీకరించారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లండి

మంత్రి పొన్నం ప్రభాకర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : హుస్నాబాద్ నియోజకవర్గానికి శాసన సభ్యుడిగా గెలిచిన తరువాత మంత్రి పొన్నం ప్రభాకర్ తనదైన మార్కు చూపుతున్నారు. ఇప్పటికే ప్రతి మండలంలో అభివృద్ధి వేగంగా పరుగులు పెడుతుండగా అభివృద్ధి తో పాటు ప్రజా సమస్యల పై మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక దృష్టి సారించారు. ఒక రోజు మొత్తం మండలాల వారీగా ప్రత్యేక సమయాన్ని కేటాయించి వారికి ఉన్న వ్యక్తిగత సమస్యలు ఆయా గ్రామాలు, మండలాల వారీగా ఉన్న సమస్యల పై హుస్నాబాద్ క్యాంప్ కార్యాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ వినతులు స్వీకరించారు. అక్కడే పలు అంశాలతో అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారం చేశారు. మరిన్ని సమస్యల పై పరిష్కారానికి మార్గాలు చూపుతూ తాను న్నానంటూ భరోసానిచ్చారు. ప్రధానంగా సమస్యల్లో తమకు ఉపాధి అవకాశాలు కల్పించాలని చదువుకున్న యువకులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. విద్య, వైద్యం, ఉపాధి కల్పన, సాగునీరు అందించడమే తమ ప్రథమ కర్తవ్యంగా ముందుకు పోతున్న మంత్రి పొన్నం ప్రభాకర్ నియోజకవర్గంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడానికి రేపు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మెగా జాబ్ మేళా ను ఏర్పాటు చేశారు. వేసవి కాలం గ్రామాల్లో తాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అటు అధికారులకు ఇటు గ్రామశాఖ అధ్యక్షులకు సూచించారు. గ్రామాల్లో ఉన్న పార్టీ ముఖ్య నేతలకు పలు అంశాల పై సూచించారు. యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని , గౌరవెల్లి గండిపల్లి ప్రాజెక్టు కాలువల భూసేకరణ వేగంగా జరుగుతుందని త్వరలోనే ఈ ప్రాజెక్టు ల ద్వారా సాగునీరు అందిస్తామన్నారు. నియోజకవర్గంలో పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేసి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని వెల్లడించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేయడమే లక్ష్యంగా అన్ని మండల అధ్య క్షులు గ్రామ శాఖ అధ్యక్షులు అనుబంధ సంఘాల నేతలు పనిచేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభు త్వం ఇచ్చిన హామీలు అమలు చేస్తుందని సంక్షేమ పథకాలపై గ్రామాల్లో విస్తృత అవగా హన కల్పిం చాలని సూచించారు. గత ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని ఇప్పుడు అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు అందిస్తున్నామని ఎన్నికల కోడ్ అయిపోయిన తరవాత కొత్త రేషన్ కార్డులు వస్తా యని పేర్కొన్నారు. ఇప్పటికే భూమి లేని ఉపాధి కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులు విడుదల అయ్యాయని ఎవరికైనా భూమిలేని ఉపాధి కూలీ లకు డబ్బులు జమ కాక పోతే తెలిపాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం తమ నాయకుడు రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం ఎవరెంతో వారికంత న్యాయం చేయడానికి కుల గణన చేశామని ఈనెల 6 న జరిగే కేబినెట్ లో 42 శాతం రిజర్వేషన్‌ల చట్టబద్ధత పై కేబినెట్ ఆమోదించు కుంటుందని తెలిపారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

ఉదయం 8:30 గం లోపు చేరుకోవాలని విజ్ఞప్తి

విశాలాంధ్ర - ఆమనగల్లు : నేటి నుంచి ప్రారంభమవుతున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఆమనగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చీఫ్ సూపరింటెండెంట్ మాధవరావు, డిపార్ట్మెంటల్ అధికారి అనంతరెడ్డి అన్ని ఏర్పాటు చేశారు. నేడు ప్రారంభమవుతున్న మొదటి సంవత్సరం పరీక్షలకు ముందస్తుగా ఇన్విజిలేటర్లతో సమావేశం నిర్వహించారు. పరీక్ష రూములలో నెంబర్లను వేయడాన్ని పర్యవేక్షించారు . విద్యార్థులందరూ విధిగా పరీక్షా కేంద్రానికి ఉదయం 8:30 గంటలకు వరకు చేరుకోవాలని మాధవరావు విజ్ఞప్తి చేశారు.

యువత రాజకీయ గొంతుకగా యంగ్ ఇండియాకె బోల్

విశాలాంధ్ర - హైదరాబాద్ : నేటి యువత రాజకీయంగా ఎదుగుతూ వారి వాయిస్ ని వినిపించడానికి యంగ్ ఇండియాకె బోల్ గొప్ప అవకాశం అని అని ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి అన్నారు. నేటి సమాజంలో జరుగుతున్న పొరపాట్లపై యువత తమ గొంతుక వినిపించాల్సిన అవసరముందని పేర్కొన్నారు. యువత రాజకీయాల పై అవగాహన పెంచుకుంటేనే నవ భారత నిర్మాణం సాధ్యమని తెలిపారు. మంగళవారం నేటి యువత వారి వాయిస్ ని వినిపించడానికి అదే విధంగా నేటి యువత రాజకీయంగా ఎదగడానికి సీజన్ ల వారిగా యంగ్ ఇండియా కి బోల్ సీజన్ - 5 నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర కాంపిటీషన్ లో భాగంగా మంగళవారం ఇందిరా భవన్ లో నౌక్రి దో నషా నహి అంటూ రాష్ట్ర ఫైనల్ కాంపిటీషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిపిసిసి అధికార ప్రతినిధి శ్రీ అద్దంకి దయాకర్ ఏఐసిసి మెంబర్ సనత్ నగర్ ఇంచార్జ్ కోట నిలిమ, సీనియర్ జర్నలిస్టు పిల్లలమర్రి శ్రీనివాస్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఇంచార్జి సురభి ద్వివేది, యంగ్ ఇండియా కె బోల్ రాష్ట్ర ఇంచార్జ్ నీతూ హాజరవడం జరిగింది. ఈ సందర్భంగా జక్కిడి శివ చరణ్ రెడ్డి మాట్లాడుతూ యువత ఇలాంటి కార్యక్రమాలల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని, మునుముందు కూడా యువత ఇలాంటి కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొనా లని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంతో ఎంతోమంది యువతీ యువకులను దేశ ప్రజానీకానికి పరిచయం చేస్తున్నామని తెలిపారు.

ఆరెకటిక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

- తెలంగాణ ఆరెకటిక సంఘం అధ్యక్షులు శ్రీనివాస్

విశాలాంధ్ర - బషీర్ బాగ్: ఆరెకటిక కార్పొరేషన్ ఏర్పాటు చేసి 200 కోట్లు నిధులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ ఆరెకటిక సంఘం అధ్యక్షులు చకోలెకర్ శ్రీనివాస్ కోరారు. మంగళవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం సంఘం నేతలు డా. విజయభాస్కర్, నర్సింగ్ రావు, ఎస్. రవికుమార్లతో కలిసి ఆయన మాట్లాడారు. ప్రభుత్వం కోకాపేటలోని ఆరెకటిక సంఘ భవనానికి నిధులు కేటాయించాలని కోరారు. ఆరెకటిక సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ఆరెకటిక కులస్తులను కనీసం చర్చించిన దాఖలు లేవన్నారు. ఆరె కులస్తులకు ఎమ్మెల్సీ పదవీ ఇవ్వాలని కోరారు. ఈనెల 10న హైదరాబాద్ లో ఆరెకటికులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఆరెకటికలకు సంక్షేమ పథకాలలో, రేషన్ కార్డ్స్, సబ్సిడీ లోన్లు వాటిపై ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో సంఘం నేతలు, అశోక్, సునీత, యశ్వంత్ రావు, జితేందర్ కృష్ణ పాల్గొన్నారు.

వర్షాకాలంలోగా గ్రంథాలయ మరమ్మతులు పూర్తి చేయాలి

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



విశాలాంధ్ర - హైదరాబాద్ : అఫ్జల్‌గంజ్‌లో గల స్టేట్ సెంట్రల్ లైబ్రరీలో చేపట్టిన మరమ్మతు పనులను రానున్న వర్షాకాలంలోగా పూర్తి చేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ అఫ్జల్‌గంజ్‌లోని రాష్ట్ర కేంద్ర గ్రంథాలయంను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి గ్రంథాలయములోని అన్ని విభాగాలను పరిశీలించారు. కేంద్ర గ్రంథాలయంలో రూ.5.5 కోట్ల వ్యయం తో చేపట్టిన మరమ్మతు పనులు పరిశీలించి, పనులను త్వరితగతిన వర్షాకాలం రాకముందే పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు తెలుగులో ఉన్నాయా, గ్రంథాలయమునకు ఇంకా ఏమైనా పుస్తకాలు కావాలా అని చీఫ్ లైబ్రేరియన్ అడుగగా కేంద్ర గ్రంథాలయంలో వివిధ భాషలకు చెందిన 5లక్షల 31 వేల పుస్తకాలు కలవని లైబ్రరియన్ తెలిపారు. యూపీఎస్సీ పరీక్షలకు సన్నద్ధం అయ్యే అభ్యర్థుల కోసం వారికి కావలసిన పుస్తకాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. పోటీ పరీక్షలు రాస్తున్న అభ్యర్థులు లక్ష్యం నిర్దేశించుకుని పరీక్షలకు సన్నద్ధం కావాలని గ్రం థాలయాలు జ్ఞాన భాండాగారాలని వాటిని సద్వినియం చేసుకోవా లన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కదిరవన్ పలని, గ్రంథాలయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీహరి శంకర్, హెచ్ఎండి డిఈ అభిలాష్, గ్రంథాలయ చీఫ్ లైబ్రేరియన్, టిజివి రాణి, సీని యర్ లైబ్రేరియన్ కేసరి హనుమంతు, లైబ్రరియన్ అపర్ణ పాల్గొన్నారు.

వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సూర్యా ధనంజయ్ "ఉమెన్ ఆఫ్ ది 2025 పురస్కారం ఎంపిక "

విశాలాంధ్ర - బషీర్‌బాగ్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ప్రముఖ సాహిత్యవేత్త, సీనియర్ ప్రొఫెసర్, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సూర్యా ధనంజయ్‌కి ఈ ఏడాది రాష్ట్రం నుంచి ఒక్కరికే ఇచ్చే అవార్డు "ఉమెన్ ఆఫ్ ది ఇయర్ 2025 "ఉత్తమ మహిళా పురస్కారానికి ఎంపిక చేసినట్లు తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ అధ్యక్షులు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ నేడు పత్రికా ప్రకటనలో తెలిపారు .ఈ సందర్భంగా హైకోర్టు మాజీ న్యాయమూర్తి అడ్మిస్ట్రేషన్ ట్రిబ్యునల్ కోర్టు చైర్మన్ జస్టిస్ వామన్ రావు దేశ్పాండే, అమెరికా దేశ చికాగో స్టేట్ ,అమీర్ గ్లోబల్ పీస్ ఫౌండేషన్ చైర్మన్ ఫరూక్ అలీ ఖాన్,హైకోర్టు ప్రముఖ న్యాయవాది , ఇట్టా ఉదయశ్రీ తదితరులు పాల్గొని ఈనెల 7వ తేదీన యూనివర్సిటీలో ఈ అవార్డును ప్రదానం చేస్తారని తెలిపారు. ప్రొ. సూర్యాధనంజయ్ ప్రముఖ విద్యావేత్త, ఉస్మానియా యూనివర్సిటీలో తెలుగు శాఖ అధిపతిగా, ఉమెన్ స్టడీస్ డైరెక్టర్ గా మరెన్నో పదవులను అలంకరించడమే కాకుండా బాధ్యతగా నిర్వర్తించారు. ప్రస్తుతం వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం హైదరాబాద్ వైస్ ఛాన్సలర్ గా పనిచేస్తున్నారు.ఆమె ప్రముఖ సృజనాత్మక రచయిత్రి, విద్యా ,సాహిత్య రంగాలలో ఆమె సాధించిన నైపుణ్యం ఎందరికో స్ఫూర్తిదాయకం, ఉస్మానియా యూనివర్సిటీలో తెలుగు శాఖలో ప్రొఫెసర్ గా నియమితులైన మొదటి గిరిజన మహిళ అని అన్నారు. వీరనారి చాకలి అయిలమ్మ మహిళ విశ్వ విద్యాలయానికి తొలి వైస్ ఛాన్సలర్ గా చరిత్ర సృష్టించారని పేర్కొన్నారు.

విద్యా వ్యాపారం చేస్తూ ఎమ్మెల్సీగా గెలిచిన వారిని అనర్హులుగా ప్రకటించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : బహుముఖ ప్రజ్ఞాశాలి, ప్రపంచ ఖ్యాతి పొందిన మేధావి డా.బి.ఆర్.అంబేద్కర్ రచించిన రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు 41వ సెక్షన్ ప్రకారం దేశంలోని పౌరులకు ఉచిత, నిర్బంధ విద్యాను అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై, ప్రజాప్రతినిధులపై ఉందని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.యస్.బోస్ అన్నారు. విద్యా వ్యాపారంలో ఉండి ఎమ్మెల్సీగా గెలిచిన వారి ఎన్నికలను రద్దు చేయవల్సిందిగా ఎన్నికల కమీషన్‌ను ఆయన డిమాండ్ చేశారు. రాజ్యాంగ విలువలను కాపాడాల్సిన ప్రజా ప్రతినిధుల సభలో రాజ్యాంగానికి విరుద్ధంగా విద్యను వ్యాపారంగా మార్చి, విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుండి అధిక మొత్తంలో అన్యాయంగా ఫీజులు వసూలు చేసిన వ్యక్తులు భారత రాజ్యాంగానికి న్యాయం చేయలేరని అన్నారు. అందుబాటులో ఉన్న మార్గంలో ప్రజలను దోచుకునే మనస్థత్వం ఉన్నవారు, దోపిడీకి అలవాటు పడినవారు ప్రజాసేవ దృక్పథంతో ఉండరని ఆయన అన్నారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ ద్రోహులను ప్రజా ప్రతినిధులుగా కాకుండా న్యాయ స్థానాలు సుమోటోగా కేసులు తీసుకొని అలాంటి వారిని ప్రజా ప్రతినిధులు కాకుండా నివారించి రాజ్యాంగాన్ని, రాజ్యాంగ ధర్మాన్ని కాపాడవల్సిందిగా కోరారు.

టాప్ డిఫాల్టర్‌లపై డిస్ట్రెస్ వారెంట్‌లు జారీ

విశాలాంధ్ర - శేరి లింగంపల్లి: డిప్యూటీ కమి షనర్ పి. మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ విభాగం (టాక్స్ సెక్షన్) తొ డిప్యూటీ కమీషనర్ ఛాంబర్ లొ సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. డిప్యూటీ కమీషనర్ గారు మాట్లాడుతూ... ఆస్థి పన్ను లక్ష్య సాధనకు, రాబోయే ఆర్థిక సంవత్సరాంతాన్ని దృష్టిలో ఉంచుకుని, పన్ను ఎగవేతదారులపై ప్రత్యేక దృష్టి సారించాలని రెవెన్యూ సిబ్బందికి ఆదేశాలిచ్చారు. టాప్ డిఫాల్టర్‌లపై డిస్ట్రెస్ వారెంట్‌లు జారీ చేయాలని రెవెన్యూ సిబ్బందికి ఆదేశాలిచ్చారు. నోటీసుల తర్వాత కూడా పన్ను చెల్లించకపోతే, డిస్ట్రెస్ నోటీసులు జారీ చేసి, ఆ తర్వాత ఆస్తులను స్వాధీనం చేసుకోవాల్సి వస్తుందని తెలియజేశారు. నివాస భవనాల పేరుతో అనుమతి తీసుకుని కమర్షియల్ పొంది, వాణిజ్య కార్యకలాపాలకు ఉపయోగిస్తున్న భవనాల యజమానులపై ప్రత్యేక దృష్టి సారించాలని, పన్ను తప్పించుకునేందుకు ఇలాంటి వ్యవహారాలకు పాల్పడుతున్న వారిని నివాస మరియు నివాసేతార పన్ను విధించేల చర్యలు తీసుకుంటామని తెలిపారు. బకాయిలున్న యజమానులు (ఏరియర్స్ ఇంట్రెస్ట్) వన్ టైమ్ సెటిల్మెంట్ 90% మాఫీ ఉండకపోవచ్చని, కావున బకాయిదారులు తమ యొక్క ఆస్థి పన్ను నిర్ణీత గడువులో చెల్లించి మహా నగర్ అభివృద్ధికి తోడ్పడాల్సిందిగా డిప్యూటీ కమీషనర్ కోరారు. ప్రజలు తమ యొక్క ఆస్థి పన్ను ఆన్లైన్ ద్వారా, మీసేవ కేంద్రాలలో మరియు బిల్ కలెక్టర్ వద్ద చెల్లించుకోవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో మహేందర్ రెడ్డి, కృష్ణ , టాక్స్ ఇన్స్పెక్టర్ లు బిల్ కలెక్టర్‌లు పాల్గొన్నారు.

అరెస్టయిన అంగన్‌వాడీలను వెంటనే విడుదల చేయాలి

విశాలాంధ్ర బ్యూరో - మేడ్చల్-మల్కాజిగిరి : గత సంవత్సరంగా పెండింగ్లో ఉన్న మినీ అంగన్వాడీల వేతనాలను విడుదల చేయాలనీ , పెరిగిన వేతనాలను వెంటనే అమలు చేయాలని ప్రజా దర్బార్ హైదరాబాదులోని ప్రజావాణిలో, తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటీయు)అద్వర్యంలో ప్రజా పాలనలో తమ గోడును విన్నవించుకోవడానికి తమ సమస్యల పరిష్కారం కోసం వినతి పత్రం ఇవ్వడానికి బయలుదేరుతున్న మినీ అంగన్వాడీలను ప్రభుత్వం పోలీసుల చేత అక్రమ అరెస్టు పాల్పడుతోందని, మినీ అంగన్వాడీలతో పాటు ప్రధాన అంగన్వాడీలను కూడా అరెస్టు చేసి పోలీస్ స్టేషనులకు తరలించడం హౌస్ అరెస్టులు చేస్తూ, అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్నారని అంగన్వాడీలపైన నిర్బంధ కాండను ఆపాలని సిఐటియు జిల్లా కోశాధికారి కె.ఉన్ని కృష్ణ డిమాండ్ చేశారు. అంగన్వాడి యూనియన్ జిల్లా కార్యదర్శి బి.శోభారాణి మాట్లాడుతూ కానీ అంగన్వాడీ కార్యకర్తలు సంవత్సర కాలంగా వేతనాలు లేకుండా పనిచేశారు. అయినప్పటికీ వాళ్ల వేతనం కోసం అడగటానికి వెళ్లిన వారిని అరెస్టులు చేయించడం కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ పాలనకు నిదర్శనం. ప్రజాపాలన పేరుతో ప్రజల సమస్యలను తీరుస్తామంటూ చెబుతున్న ప్రభుత్వం అంగన్వాడీ టీచర్లు ప్రజలు కాదా, వాళ్ల సమస్యలు ప్రభుత్వానికి పట్టదా ఇదేనా ప్రజా పాలన అని ప్రశ్నించారు. అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని, తప్పుడు చేసి పోలీస్ స్టేషన్లలో పెట్టడం, నిర్బంధాన్ని ప్రయోగించడం చేయడం వల్ల సమస్య పరిష్కారం కాదన్నా సంగతి ప్రభుత్వము గ్రహించాలని కోరారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని మల్కాజిగిరి, మేడ్చల్, జవహర్ నగర్, కీసర, షామీర్‌పేట్, నేరేడ్‌మెట్, మేడిపల్లి, అల్వాల్ తదితర మండలాల్లో అరెస్ట్ చేసిన అంగన్వాడీలను వెంటనే భేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అల్వాల్ ప్రాజెక్టులో డ్యూటీలో అటెండ్ అయిన అంగన్వాడిని అరెస్టు చేయడం అత్యంత శోచనీయమన్నారు. ప్రజాస్వామ్యంలో ఇదేనా గౌరవ వేతనం తోటి అరకొర సుఖాల తోటి పనిచేస్తూ ప్రజలకు సేవలు అందించే మహిళా కార్యకర్తలపై ఇలాంటి ఘటనలు చేయడ మనేది ప్రభుత్వం సిగ్గుపడే విషయంగా పరిగణించాలన్నారు.

ఉచిత విద్య, వైద్యం అందించడమే లక్ష్యం

కనకం శ్రీనివాసరావు

విశాలాంధ్ర- బషీర్ బాగ్ : దేశ వ్యాప్తంగా ఉచిత విద్యా, వైద్యం అందించడమే లక్ష్యంగా తమ పార్టీ కృషి చేస్తుందని నేషనల్ నవక్రాంతి పార్టీ జాతీయ అధ్యక్షుడు కనకం శ్రీనివాసరావు అన్నారు. నేషనల్ నవక్రాంతి పార్టీ 9వ వార్షికోత్సవం సందర్భంగా బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఇంద్రాగౌడ్, జాతీయ కార్యదర్శి లంకసిరి రాజ్కుమార్, కర్నె రవిలతో కలిసి కనకం శ్రీనివాస్ రావు మాట్లాడుతూ తెలంగాణ, ఏపీలో ఓటుకు నోటు కాకుండా ప్రజా పాలన తీసుకురావాలన్నదే మా ఉద్దేశమని అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలలో బీసీ, ఎస్సీ, ఎస్టీలనే ముఖ్య మంత్రులుగా చేసే విధంగా పార్టీ కృషి చేస్తుందన్నారు. రైతును రాజును చేయడం మా పార్టీ లక్ష్యమన్నారు. మహిళలకు వడ్డీలేని రుణాలు ఇచ్చి వారి ఆర్థిక అభివృద్ధికి, కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసి మహిళలను మహారాణులుగా చేస్తామన్నారు. రైతులకు స్వామినాథన్ కమిటీ సిఫారస్సులు అమలు చేయాలని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించి, విత్తనాలు, ఏరువులు సబ్సిడిపై ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఘోర రోడ్డు ప్రమాదం : వ్యక్తి దుర్మరణం

విశాలాంధ్ర - దుండిగల్ : మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధి గండిమైసమ్మ ఔటర్ రింగ్ రోడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కారుని డీసీఎం ఢీ కొట్టడంతో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు.ఇతరులకు స్వల్ప గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న దుండిగల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.వివరాల్లోకి వెళితే ఖమ్మం జిల్లాకు చెందిన కార్తీక్(38) తన కుటుంబంతో నిజాంపేట్ లో స్థిరపడ్డారు. మార్చి 4 వ తేదీ మంగళవారం తెల్లవారుజామున ఖమ్మం నుండి భార్య సింధు కుమారుడితో తన వెర్నా కారులో బయలుదేరాడు.ఉదయం 7.50 నిమిషాలకు గండి మైసమ్మ ఔటర్ రింగ్ రోడ్ ఎగ్జిట్ 5 దగ్గరకు చేరుకోగానే అదే రోడ్డులో మేడ్చల్ నుండి మల్లంపేట్ వైపు వెళ్తున్న డీసీఎం కారుని వెనకనుంచి ఢీ కొట్టడంతో డ్రైవింగ్ చేస్తున్న కార్తీక్ అక్కడికక్కడే మృతి చెందాడు.ఈ ప్రమాదంలో సింధు, కివిలకు తీవ్ర గాయాలు కావడంతో వారిని చికిత్స నిమిత్తం యశోద ఆసుపత్రికి వెంటనే తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సతీష్ వెల్లడించారు.దీనికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



ప్రభుత్వ భూమి కబ్జాపై చట్టప్రకారం చర్యలు

విశాలాంధ్ర శేరిలింగంపల్లి: చందానగర్ స. నెం. 27, శ్మశాన ప్రభుత్వ భూమి. అప్పటి సిఐ క్యాస్ట్రో ఎలాంటి అనుమతులు లేకుండా, భూమి కేటాయింపులు లేకుండా ఏకపక్షంగా స్థానికులు అభ్యంతరపెడుతున్నా, జీహెచ్ఎంసీ డ్రైనేజీపై నిబంధనలకు విరుద్ధంగా 1 కోటి రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని కబ్జా చేశాడని, ఓ పోలీసు అధికారి ఇలా అక్రమ నిర్మాణం చేయడం తప్పుడు సంకేతాలనిచ్చిందని కసిరెడ్డి భాస్కరరెడ్డి డిప్యూటీ కలెక్టర్ దృష్టికి తేవడంతో ఆయన సానుకూలంగా స్పందించారు. కబ్జాలు చేసే వారిపై కేసులు పెట్టే సిఐనే కబ్జా చేస్తే ఎవరికి చెప్పుకోవాలని ఈ సందర్భంగా 'జనం కోసం' డిప్యూటీ కలెక్టర్ దృష్టికి తేవడంతోఆయన వెంటనే రిపోర్టు సబ్మిట్ చేయాలని గిర్దావర్‌ను ఆదేశించారు.

ప్రశాంతంగా పరీక్షలు రాయండి

ఇంటర్ విద్యార్థులకు అంజయ్య యాదవ్ శుభాకాంక్షలు



విశాలాంధ్ర - షాద్ నగర్,రూరల్: ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలను పొందాలని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఇంటర్ విద్యార్థులకు సూచించారు. బుధవారం నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో పరీక్షలు రాసే విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపిన అనంతరం పరీక్షలు అంటే భయపడవలసిన అవసరం లేదని అభిప్రాయపడ్డారు. అధ్యాపకులు, తల్లిదండ్రులు పరీక్షల పేరుతో తమ పిల్లలపై ఒత్తిడి తేవద్దని, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసే విధంగా ప్రోత్సహించాలని కోరారు. సమయపాలన పాటిస్తూ, ఆందోళనకు గురి కాకుండా పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలను పొందాలని ఆకాంక్షించారు. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించి ఉన్నత చదువులు చదవాలని కోరారు.

భార్గవినీ రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి

డిహెచ్‌పిఎస్ రాష్ట్ర బృందం వినతి

విశాలాంధ్ర - హైదరాబాద్ : బక్కి వెంకటయ్య గారు, చైర్మన్ ఎస్సీ, ఎస్టీ కమిషన్ తెలంగాణ రాష్ట్రం, గారిని డి హెచ్ పి ఎస్ రాష్ట్ర అధ్యక్షులు కేసు రత్నం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ రాష్ట్ర సహాయ కార్యదర్శి జే కుమారస్వామి, భార్గవి తో కలిసి ఎస్సీ కమిషన్ చైర్మన్ గారికి వినతి పత్రం ఇచ్చినారు.వడ్లకొండ క్రిష్ణ (బంటి) భార్య అయిన భార్గవికి ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం అందించుట గురించి. ప్రేమించి, కులాంతర వాహం చేసుకుందని భార్గవి కుటుంబ సభ్యులు అత్యంత దారుణంగా దళిత కులముకు చెందిన వడ్లకొండ కృష్ణను 26 జనవరి 2025 రోజున సూర్యాపేటలో అతి దారుణంగా హత్య చేశారు. కులాంతర వివాహము చేసుకున్న వారికి పోలిస్ వారు ఎలాంటి రక్షణ కల్పించలేదు. వారి నిర్లక్ష్యం వలన భార్గవి ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్తను కోల్పోయింది. వడ్లకొండ కృష్ణకు ఎలాంటి ఆస్తు లేవు. కనీసం నివాస గృహము లేనటువంటి దుస్థితిలో ఉన్నారు. వృద్ధాప్యంలో ఉన్న కృష్ణ తండ్రిని పోషించే బాధ్యత భార్గవి పైనే ఉంది. కులాంతర వివాహం చేసుకొని భర్తను కోలిపోయిన ఉన్నత విద్య చదివిన భార్గవికి మానవతాదృక్పథంతో ప్రభుత్వ పరంగా ఉండడానికి ఇల్లు, ప్రభుత్వ ఉద్యోగం కల్పించి, కులాంతర వివాహ చట్ట ప్రకారం ప్రభుత్వము నుండి అన్ని విధాల సహాయ సహకారాలు అందించాలని కోరారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

విశాలాంధ్ర - షాద్ నగర్,రూరల్: ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు బోర్డ్ సర్వం సిద్ధం చేసిందనీ మొదటి సంవత్సరం పరీక్షలు. మార్చి 5వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయని అలాగే ద్వితీయ సంవత్సరం పరీక్షలు మార్చి 5వ తేదీ నుంచి మొదలవనున్నాయని విద్యార్థులు తగు జాగ్రత్తలతో పరీక్షలకు హాజరుకావాలని నియోజకవర్గంలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు అందరికీ రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి విద్యార్థి తమ హాల్ టికెట్, అదేవిధంగా పరీక్షకు కావలసిన అన్ని వనరులను వెంట తీసుకువెళ్లాలని పరీక్ష సమయాన్ని కంటే ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. విద్యార్థులు ఎవరైనా పరీక్షల కోసం లిఫ్ట్ అడిగితే వాహనాల ద్వారా వారిని స్వచ్ఛందంగా పరీక్షా కేంద్రం వద్దకు మానవతా దృక్పథంతో చేర్పించాలని సూచించారు. విద్యార్థులకు ఎప్పుడు ఏ అవసరం ఉన్న తమను సంప్రదించవచ్చని, విద్యార్థులు నిర్భయంగా పరీక్షలు రాయాలని కోరారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు ఇతర ప్రైవేటు కళాశాలలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు అందరూ మంచి ఉత్తీర్ణత సాధించాలని ప్రశాంతంగా పరీక్షలు రాయాలని ఎమ్మెల్యే సూచించారు.

ప్రీమియం నివాసాలను అభివృద్ధికి జువారీ ఇన్‌ఫ్రావరల్డ్ గంగోత్రి

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : ప్రముఖ రియల్ ఎస్టేట్ డెవలపర్ అయిన జువారీ ఇన్‌ఫ్రావరల్డ్ ఇండియా లిమిటెడ్, కొల్లూరు మైక్రో మార్కెట్‌లోని ప్రీమియం నివాస ప్రాజెక్ట్ జువారీ గంగోత్రి త్రిభుజ కోసం గంగోత్రి డెవలపర్‌తో చేతులు కలుపడం ద్వారా హైదరాబాద్ మార్కెట్లో తమ కార్యకలాపాలను విస్తరించింది. దాదాపు 9.4 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ ఉన్నత స్థాయి డెవలప్‌మెంట్ ని గంగోత్రి గ్రూప్ చేస్తోంది, డెవలప్‌మెంట్ మేనేజర్‌గా జువారీ ఇన్‌ఫ్రావరల్డ్ వ్యవహరిస్తోంది, ఇది భారతదేశం అంతటా అధిక-వృద్ధి మార్కెట్లలో దాని వ్యూహాత్మక విస్తరణలో ఒక ముఖ్యమైన అడుగును సూచిస్తుంది. జువారీ గ్రూప్ ప్రమోటర్ అక్షయ్ పొద్దార్ మాట్లాడుతూ దేశం యొక్క ప్రధాన రంగ వృద్ధికి మా గ్రూప్ ప్రధాన సహకారిగా ఉంది. సిమెంట్‌తో హైదరాబాద్ ప్రాంతంలో మా ప్రయాణాన్ని ప్రారంభించిన తర్వాత, దానిని హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ ముందుకు తీసుకెళ్లడానికి ఇప్పుడు ఆసక్తిగా ఉన్నాము. ఉజ్వల భవిష్యత్తుతో వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో హైదరాబాద్ ఒకటి అని మేము విశ్వసిస్తున్నాము, దానిలో భాగం కావాలని మేము కోరుకుంటున్నాము. మా గ్రూప్ యొక్క రియల్ ఎస్టేట్ విభాగం, జువారీ ఇన్‌ఫ్రావరల్డ్, భారతదేశం అంతటా, అంతర్జాతీయంగా తమ కార్యకలాపాలను నిరంతరం విస్తరిస్తూ, రియల్ ఎస్టేట్ రంగంలో కీలక పాత్ర పోషిస్తోంది. దుబాయ్‌లోనీ మా ఇటీవలి ప్రవేశం తో పాటుగా , ప్రీమియం అభివృద్ధిలో బలమైన ట్రాక్ రికార్డ్‌తో, పట్టణ జీవనంలో కొత్త ప్రమాణాలను నిర్దేశించే కమ్యూనిటీలను నిర్మించడానికి మేము కట్టుబడి ఉన్నాము అని అన్నారు. ఈ అభివృద్ధిపై జువారీ ఇన్‌ఫ్రావరల్డ్ ఇండియా లిమిటెడ్ సీఈఓ, హెచ్ డైరెక్టర్ హరీష్ వెర్మ మాట్లాడుతూ హైదరాబాద్‌లో జువారీ ఇన్‌ఫ్రావరల్డ్ ప్రవేశం మా వృద్ధి కథలో ఒక మైలురాయి. హైదరాబాద్ యొక్క వేగవంతమైన పట్టణ వృద్ధితో, గృహకొనుగోలుదారుల ఆకాంక్షలను అనుసంధానించడం, భవిష్యత్ జీవనశైలిని కోరుకునే గృహ కొనుగోలుదారుల కలలను తీర్చడానికి ఈ ప్రాజెక్ట్ రూపకల్పన చేయబడింది.

గంగోత్రి గ్రూప్ మేనేజింగ్ పార్టనర్ కె. మధుకర రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ లో రెసిడెన్షియల్ రియల్ ఎస్టేట్ రంగం వేగంగా అభివృద్ధి చెందుతోంది. కొల్లూరు మైక్రో మార్కెట్ ఈ పరివర్తనకు కేంద్రంగా ఉంది. జువారీ ఇన్‌ఫ్రావరల్డ్ మా భాగస్వామిగా జువారీ గంగోత్రి త్రిభుజ విలాసవంతమైన, పర్యావరణ అనుకూల జీవనంలో కొత్త ప్రమాణాలను ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉంది. ప్రీమియం జీవనశైలి అనుభవాన్ని అందించడానికి రూపొందించబడిన ఈ ప్రాజెక్ట్‌లో 76% కార్పెట్ యూనిట్లు, 1 లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న క్లబ్‌హౌస్, హై-స్పీడ్ ఎలివేటర్లు, హోమ్ ఆటోమేషన్ ప్రొవిజన్లు, 50 కంటే ఎక్కువ అగ్రశ్రేణి జీవనశైలి సౌకర్యాలు ఉన్నాయి. ఓఆర్ఆర్ - ఎగ్జిట్ 2 నుండి కేవలం రెండు నిమిషాల దూరంలో ఉన్న ఈ డెవలప్‌మెంట్ హైటెక్ సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, ఇతర వ్యాపార కేంద్రాలకు అద్భుతమైన కనెక్టివిటీని నిర్ధారిస్తుంది.

జీడిమెట్ల సిఐ మల్లేష్‌కు స్మార్ట్ పోలీసింగ్ అవార్డు

విశాలాంధ్ర - కుత్బుల్లాపూర్ : జీడిమెట్ల సిఐ మల్లేష్‌కు స్మార్ట్ పోలీసింగ్ అవార్డు వరించింది. మంగళవారం ఢిల్లీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ వారు ఏర్పాటు చేసిన స్మార్ట్ పోలీసింగ్ అవార్డులో భాగంగా, తెలంగాణ రాష్ట్ర పోలీస్ నుండి జీడిమెట్ల ఎస్ హెచ్ ఓ మల్లేష్ కు స్పెషల్ జూరీ అవార్డును వారు అందజేశారు. సైబర్ క్రైమ్ మేనేజ్మెంట్ అనే విభాగంలో దాదాపు దేశవ్యాప్తంగా 129 ఎంట్రీస్ వివిధ రాష్ట్రాల పోలీస్ విభాగాలు సెంట్రల్ పోలీస్ ఫోర్సెస్ నుంచి రాగా,అందులో సిఐ మల్లేష్ కు స్పెషల్ జూరీ అవార్డు రావడం జరిగింది.ఈ సందర్భంగా సిఐ మల్లేష్ మాట్లాడుతూ అయన ఈ అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందని,అలగే నాకు ఈ అవకాశం ఇచ్చినటువంటి ఉన్నతాధికారులు, రాష్ట్ర డీజీపీ శ్రీ జితేందర్ కు,అలాగే సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి కి,బాలానగర్ డీసీపీ కొల్లు సురేష్ కుమార్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నగరం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వ సహకారం

- బేగంపేట్ సర్కిల్‌లో రూ.59.40 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన - మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

విశాలాంధ్ర - హైదరాబాద్ : నగర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి మద్దతుగా నిలిచి అన్ని విధాల సహకారాన్ని అందిస్తుందని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. బేగంపేట్ సర్కిల్‌లో రూ.59.40 లక్షల వ్యయం తో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మంగళవారం ఎంపి ఈటెల రాజేందర్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేష్, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డితో కలిసి మేయర్ శంకుస్థాపన చేశారు. మోండా మార్కెట్ డివిజన్‌లో మూడు స్థలాల్లో రూ. 32.50 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణం, ఈస్ట్ మారేడ్ పల్లిలో రూ.25.50 లక్షల వ్యయంతో వి.డి.సి.సి రోడ్డు వేయడం, జిహెచ్ఎంసీ నర్సరీకి కార్పెంటింగ్ అందించడం, ఈస్ట్ మారేడ్‌పల్లిలో రూ.1.40 లక్షలతో జిహెచ్ఎంసీ పార్కు-2 కాంపౌండ్ వాల్ మరమ్మతు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గత ఏ ప్రభుత్వం ఇవ్వని విధంగా ప్రజా పాలన ప్రభుత్వం గత నాలుగు నెలల్లో జిహెచ్ ఎంసీకి 700 కోట్ల రూపాయల నిధులు విడుదల చేసిందని, ఇందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నగర ప్రజల తరపున, జిహెచ్ ఎంసీ తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. జిహెచ్ఎంసీ పరిధిలోని అన్ని జోన్లలో అభివృద్ధి పనులకు ప్రతి జోన్‌కు రూ.25 కోట్ల చొప్పున నిధులు విడుదల చేస్తున్నామని తెలిపారు. నగర ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు జిహెచ్ ఎంసీ నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ రాజేందర్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేష్, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, కార్పొరేటర్ దీపిక, డిప్యూటీ కమిషనర్, జిహెచ్ఎంసీ అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలని కుల గణన ఎన్యుమరేటర్ల నిరసన

విశాలాంధ్ర - జవహర్ నగర్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 160 కోట్ల కు.గణన కుటుంబ సర్వే కోసం ఆర్భాటంగా కేటాయించిన ఎన్యుమరేటర్లకు జీతాలు ఇవ్వలేని దౌర్భాగ్య పరిస్థితి రాష్ట్రంలో నెలకొన్నది.దీనికి ఉదాహరణ జవహర్ నగర్ లో దాదాపు 230 మంది హైరా మహిళలతో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటలు విశ్రాంతి లేకుండా నిరంతరాయంగా, విధుల్లో భాగంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొని ఇంటింటికి తిరిగి అవమానాలు ఇబ్బందులు ఓర్చుకొని జవహర్ నగర్ లోని బడుగు బలహీన వర్గాల మహిళలు ప్రతి ఇంటింటికి తిరిగి కుల గణన సర్వేలు దాదాపు నెల రోజులు సర్వే విజయవంతంగా నిర్వహించారు. గృహిణిలు, చిన్న పిల్లల తల్లులు ఉపాధి లేక గతంలో పనిచేసిన జవహర్ నగర్ కమిషనర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రతి మహిళలకు మూడు రోజుల శిక్షణ అందించి పదివేల చొప్పున జీతం అందుతుందని అని ఆశతో కష్టపడి పని చేసినప్పటికీ కలెక్టరేట్ మున్సిపల్ కార్యాలయం చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగిన అధికారులు ఇప్పటివరకు మాకు రావలసిన పదివేల రూపాయల జీతం ఇప్పటివరకు మా ఖాతాల్లో జమ చేయలేదని జవహర్ నగర్ మున్సిపల్ కార్యాలయం ఎదుట మంగళవారం మహిళా ఎన్యుమరేటర్లు పెద్ద ఎత్తున ధర్నాకు దిగారు. వారికి మద్దతుగా బిఆర్ఎస్,బిజెపి నాయకులు అధికారులు,కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు.కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం వారికి ఇవ్వాల్సిన జీతం ఇవ్వకుండా క్రమపద్దతి చేయడం చాలా ప్రభుత్వం చేతగానితనానికి అద్దం పడుతుందని బిఆర్ఎస్ బిజెపి నాయకులు ప్రభుత్వ తీరును దుయ్యబట్టారు.దాదాపు ఐదు నెలల నుండి మున్సిపల్ ఆఫీస్ చుట్టూ, కలెక్టర్ ఆఫీస్ చుట్టూ మహిళ తిరగడం ఇది మహిళలకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కష్టపడ్డ మహిళలకు వేతనాలు చెల్లించకపోతే ఇవ్వాలిస్తాం రేపు ఇస్తాం సమాచారం తెలిసిన వెంటనే మీకు వేతనాలు ఇస్తాం అంటు మహిళలను ఇబ్బంది లకు గురి చేయడం దురదృష్టకరమని వాపోయారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట కమిషనర్ కు వ్యతిరేకంగా భారీ ఎత్తున మహిళల నిరసన వ్యక్తం చేయడంతో జవహర్ నగర్ కమిషనర్ వసంత స్పందించి త్వరలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ఎన్యుమరేటర్ల వేతనాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ బిజెపి నాయకులు ఆలూరి రాజశేఖర్, బిజెపి బీసీ మోర్చా నాయకులు రంగుల శంకర్, బిఆర్ఎస్ నాయకులు మొహమ్మద్ ఫాషా,జవహర్ నగర్ బిఆర్ఎస్ ఫేస్ 2 అధ్యక్షులు జక్కుల భాస్కర్ మహిళా ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ సహాయక చర్యలు వేగవంతం

- కన్వేయర్ బెల్ట్ పునరుద్ధరణ
- గంటకు 800 టన్నుల మట్టి బయటికి చేరవేత
- ఢిల్లీ నుండి నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ ప్రతినిధుల బృందం

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఎస్ఎల్బీసి రెస్క్యూ చర్యలను వేగవంతం చేయడం, బృందాల మధ్య సమన్వయం పెంచడం వంటి పై అధికారులు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కన్వేయర్ బెల్ట్ ను పునరుద్ధరించిన కారణంగా గంటకు 800 టన్నుల మట్టిని బయటకు తీసుకురాగలుగుతున్నారని వెల్లడించారు. మంగళవారం నాగర్ కర్నూల్ జిల్లాలో దోమల పెంట ఎస్ ఎల్ బి సి టన్నెల్ రెస్క్యూ ఆపరేషన్ పై సమీక్ష సమావేశాన్ని డిజాస్టర్ మేనేజ్మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్ , జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ నిర్వహించారు. ఈ సమావేశంలో టన్నెల్ ఇన్ లెట్ ఆఫీస్ వద్ద రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొంటున్న బృందాల అధికారులతో జరిగిన సమీక్షలో శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ ప్రాజెక్టు (ఎస్ఎల్బీసి) సొరంగంలో జరుగుతున్న సహాయక చర్యలపై డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫైర్ సర్వీసెస్ డిజిపి నాగిరెడ్డి, టీఎస్ఎస్‌పిడిసిఎల్ సిఎండీ ముషారఫ్ అలీ, జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, కల్నల్ పరీక్షిత్ మెహ్రా, ఎన్డీఆర్ఎఫ్ అధికారి ప్రసన్న, హైడ్రా, సింగరేణి మైన్స్ రెస్క్యూ, ఎన్జీఆర్ఐ అధికారి, ఫైర్ సర్వీసెస్, దక్షిణ మధ్య రైల్వే ప్లాస్మా కట్టర్స్, ర్యాట్ మైనర్స్, ప్రతినిధులు పాల్గొన్నారు. టన్నెల్ రెస్క్యూ ఆపరేషన్ పురోగతి, ఎదుర్కొంటున్న సవాళ్లు, మైనింగ్, ఫైర్ సర్వీసెస్ బృందాల కృషి, ర్యాట్ మైనింగ్ ప్రత్యేకతలు, ప్లాస్మా కట్టర్స్ వినియోగం వంటి అంశాలపై సమీక్ష జరిగింది. టన్నెల్ లో కొనసాగుతున్న సహాయక చర్యలపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. గ్రౌండ్ పెనిట్రేటింగ్ రాడార్ ద్వారా గుర్తించిన ప్రదేశాల్లో తవ్వకాలు జరుగుతున్నాయని, కన్వేయర్ బెల్ట్ సిద్ధంగా ఉండటంతో వీలైనంత త్వరగా మట్టిని బయటకు పంపించే ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. రెండు ఎస్కలేటర్లను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. టన్నెల్ బోరింగ్ మిషన్ వివిధ భాగాలను గ్యాస్ కట్టర్ ద్వారా తొలగించి లోకో ట్రైన్ ద్వారా బయటకు తీసుకురానున్నట్లు తెలిపారు. సహాయక చర్యలకు ఆటంకం గా మారుతున్న నీటిని ఎప్పటికప్పుడు పంపు ద్వారా బయటకు పంపిస్తున్నట్లు వివరించారు. సహాయక బృందాలకు అవసరమైన ఆహారం, ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు తెలియజేశారు.

పార్టీ సంస్థాగత నిర్మాణానికి కృషి చేయాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్రంలో సంస్థాగతంగా పార్టీ నిర్మాణం కోసం కృషి చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. మంగళవారం రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం పార్టీ నేతలు జవాబుదారీతనంతో కృషి చేయాలని సూచించారు. మంగళవారం గాంధీ భవన్లో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన మెదక్, మల్కాజ్ గిరి లోక్ సభ నియోజకవర్గాల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏఐసిసి ఇంచార్జి మీనాక్షి నటరాజన్, పార్లమెంట్ సెగ్మెంట్ పరిధి లోని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డీసీసీ అధ్యక్షులు, పోటీ చేసిన అభ్యర్థులు, కాంగ్రెస్ అనుబంధ సంఘాల చైర్మన్లు, ప్రజా ప్రతినిధులు, ఇతర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్‌గౌడ్ ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికలలో పార్టీ స్థితిగతులు, ఫలితాలపై సమీక్ష నిర్వహించారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం 14 నెలల ప్రజాపాలనలో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు పై చర్చించారు. చారిత్రాత్మక నిర్ణయాలు కుల గణన సర్వే, ఎస్సీ వర్గీకరణ పై సమీక్ష చేయడంతో పాటు సంస్థాగతంగా పార్టీ నిర్మాణం, కమిటీల ఏర్పాటు పై చర్చ జరిపారు. ఈ సందర్భంగా వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై నేతలకు దిశా నిర్దేశం చేశారు. పార్టీలో పాత, కొత్త నేతల మధ్య సమన్వయం లోపించకుండ ఐక్యతతో ముందుకు సాగాలని హితవు పలికారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను క్షేత్ర స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఎవరైనా పార్టీ లైన్ దాటితే ఎంతటి వారైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. నియోజక వర్గ ఇంచార్జిలు బాధ్యతాయుతంగా వ్యవహరించి అందరిని కలుపుకుపోవాల్సిన అవసరం ఉందన్నారు. నియోజక వర్గ ఎమ్మెల్యేలు ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఏఐసిసి ఇంచార్జి మీనాక్షి నటరాజన్ నిజాయితీకి నిలువెత్తు నిదర్శనమన్నారు. ఆమె నాయకురాలిగా రావడం పార్టీకి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. గాంధీ సిద్ధాంతాలను నిలువెత్తు రూపమన్నారు. మండల కమిటీల ఏర్పాటు పై సమీక్షించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో జరగనిపనులను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన కుల సర్వే, ఎస్సీ వర్గీకరణ గురించి క్షేత్ర స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవశ్యకత ఉందని వివరించారు.

పర్యాటక అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడానికి ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. మంగళవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలోని ఉప ముఖ్యమంత్రి కార్యాలయంలో 2025- 26 వార్షిక సంవత్సరానికి సంబంధించి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, టూరిజం, కల్చర్, ఆర్కియాలజీ శాఖలకు సంబంధించి ప్రీ బడ్జెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో నూతన టూరిజం పాలసీని తీసుకురావడానికి ప్రభుత్వం చేస్తున్న ఆలోచనకు అనుగుణంగానే బడ్జెట్ ప్రతిపాదనలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఎకో టూరిజం, మెడికల్ - వెల్నెస్ టూరిజం, టెంపుల్ టూరిజం, స్పిర్చువల్ టూరిజం అభివృద్ధి కోసం పర్యటక శాఖ రూపొందించిన ప్రతిపాదనలకు అనుగుణంగా బడ్జెట్లో తగిన ప్రాధాన్యతను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. పర్యాటక అభివృద్ధిలో భాగంగా టూరిజం శాఖకు కేటాయించిన ప్రాంతాలు అత్యంత విలువైన ఆస్తులుగా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడిస్తని అన్నారు. వాటిని నిర్దేశిత కాలంలో అభివృద్ధి చేసి ప్రజలకు ఉపయోగపడే విధంగా వినియోగంలోకి తీసుకురావడం వల్ల రాష్ట్రానికి ఆదాయ వనరులు పెరుగుతాయన్నారు. పి పి పి (పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్షిప్) పద్ధతిలో టూరిజం ప్రాజెక్టులను చేపట్టడానికి రాష్ట్రంలో చాలా మంది ఆసక్తిగా ఉన్నారని చెప్పారు. పిపిపి పద్ధతిలో చేపట్టే పర్యటక ప్రాంతాలను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఇప్పటికే పీపీపీ పద్ధతిలో నడుస్తున్న టూరిజం ప్రాజెక్టుల నుంచి రావాల్సిన ఆదాయం ప్రభుత్వానికి రాని యెడల వాటిని సమీక్షించాలని సూచించారు. నగర ప్రజలు మానసిక ఒత్తిడి నిదూరం చేసుకోవడానికి అనుగుణంగా హైదరాబాద్ నగరం చుట్టూ అటవీ శాఖ 59 బ్లాక్ లను గుర్తించి అర్బన్ పార్కులుగా అభివృద్ధి చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారని, టూరిజం శాఖ కూడా కొత్త ప్రాంతాలను గుర్తించి అభివృద్ధి చేయడానికి కావలసిన ప్రతిపాదనలు తయారు చేసుకోవాలని సూచించారు. హైదరాబాద్ చుట్టూ అనేక రకాలుగా పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడానికి అవకాశాలు ఉన్నాయని, ఐటి శాఖతో సంప్రదించి టూరిజం శాఖలు సమన్వయంతో పని చేస్తే మంచి ఫలితాలు వచ్చే అవకాశం ఉందన్నారు. వర్క్ ఫ్రమ్ హోమ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న సాఫ్ట్వేర్ ఉద్యోగులను దృష్టిలో పెట్టుకొని సాఫ్ట్వేర్ ఇండస్ట్రీ పరిసర ప్రాంతాల్లో టూరిజం శాఖ ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పిస్తూ కొత్త ప్రాజెక్టులను తీసుకురావాలని సూచించారు. సాఫ్ట్వేర్ ఉద్యోగులు అక్కడికి వచ్చి పని చేసుకోవడానికి కావలసిన ఆహ్లాదకరమైన వాతావరణం, పనులు, తక్కువ ధరలు, వైఫై సౌకర్యం ఉండే విధంగా డిజైన్ చేసుకోవాలన్నారు. ఇలాంటి కొత్త ప్రాజెక్టులు తీసుకురావడం వల్ల ప్రభుత్వానికి ఆదాయం రావడంతో పాటు నిత్యం ఇంట్లో ఉండి పని చేస్తున్నామన్న ఫీలింగ్ ను దూరం చేసిన వారమవుతామని వివరించారు. టూరిజం శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నడుస్తున్న హరిత హోటల్స్ నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. పర్యాటకులు పెద్ద ఎత్తున హరిత హోటల్స్ ను వినియోగించుకునే విధంగా విస్తృత ప్రచారం చేయాలన్నారు. నష్టాల్లో నడుస్తున్న హోటల్స్ ను లాభాల బాట లోకి తీసుకురావడానికి అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఫైనాన్స్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, కమర్షియల్ టాక్స్ కమిషనర్ సయ్యద్ అలీ ముర్తుజా రిజ్వీ, ఎక్సైజ్ కమిషనర్ హరి కిరణ్, టూరిజం ప్రిన్సిపల్ సెక్రటరీ స్మిత సబర్వాల్, టూరిజం డైరెక్టర్ హనుమంతు జెండగే తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం ఇచ్చే స్వేచ్ఛను హరించడం దారుణం

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మల్కాజిగిరి, నేరేడ్మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో అంగన్వాడీ టీచర్లు ఆయమ్మలను, యూనియన్ జిల్లా కార్యదర్శి బి.శోభారాణి అక్రమ అరెస్టును మల్కాజిగిరి ఐద్వా కమిటీ కార్యదర్శి పి.మంగ తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలకు అండగా ఉంటామని చెబుతూ... అంగన్వాడీ టీచర్లను, ఆయమ్మలను ఉదయం 3 గంటలకే ఇంటికి వచ్చి అరెస్ట్ చేయడం మహిళల పట్ల వ్యవహరిస్తున్న తీరు ఎలా ఉందో అర్థమౌతుందన్నారు. అంగన్వాడీ వాళ్లకు రావాల్సిన జీతభత్యాలు ఇవ్వకుండా, తమ సమస్యలను తెలియజేసుకునేందుకు ప్రజావాణి కార్యక్రమానికి వెళ్తామనుకున్న వారిని అరెస్టు చేయడం ఎంత వరకు సరైందని ఆమె ప్రశ్నించారు. ప్రజావాణి కార్యక్రమం ప్రారంభించినాడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గడీలను పగలగొడుతున్నామని చెప్పి నేడు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న నిర్బంధం ఏంటని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రజా పాలన ఉంటుందా అని, ఏ సమస్య ఉన్నా వచ్చి చెప్పుకోవచ్చని చెప్పిన ముఖ్యమంత్రి నేడు ప్రజావాణికి కూడ రాకుండా అడ్డుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. అంగన్వాడి టీచర్లు, ఆయమ్మలను అరెస్టు చేయడం ఈ కాంగ్రెస్ ప్రభుత్వం దొంగ వైఖరికి నిదర్శనమని, ఇది మానుకోపోతే రాబోయే కాలంలో తీవ్రంగా పోరాటం చేస్తామని ఐద్వాగా హెచ్చరించారు. తెలంగాణ అంగన్వాడి టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బి.శోభారాణి మాట్లాడుతూ... మినీ అంగన్వాడీ టీచర్లను ఏడాది కాలం ముందు ప్రభుత్వం మెయిన్ టీచర్‌గా ఉత్తర్వు జారీ చేశారని, కానీ ఈ ఏడాది కాలంలో వారికి రావాల్సిన జీతభత్యాన్ని నేటికి చెల్లించలేదని, మాకు రావాల్సిన బకాయలను ప్రభుత్వ కార్యక్రమంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లడానికి ప్రయత్నం చేస్తే దాన్ని అడ్డుకోవడం దారుణమన్నారు. ప్రజావాణిలో వినతి పత్రం ఇవ్వడానికి వెళ్తున్న కార్యకర్తలను అరెస్టు చేయడం అన్యాయం అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అరెస్టులలో అంగన్వాడీ టీచర్లు, ఆయమ్మలు భయపడవద్దని, వారికి రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని లేనిపక్షంలో పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు రమాదేవి, శ్రీదేవి, స్వప్న, పుష్ప, సునీత, విజయలక్ష్మి, ప్రభావతిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

టీచర్స్ ఎమ్మెల్సీగా గెలిచిన మల్క కొమురయ్య

విద్యారంగ సమస్యలపై గళమెత్తాలి

విశాలాంధ్ర - కాప్రా : టీచర్స్ ఎమ్మెల్సీగా గెలిచిన మల్క కొమురయ్య ప్రభుత్వ విద్యారంగ సమస్యలపై గళమెత్తాలని, కొమురయ్య వైస్ చైర్మన్ గా ఉన్న ఢిల్లీ పబ్లిక్ స్కూల్ లో విద్యా హక్కు చట్టాన్ని అమలు చేసి ఎస్సీ,ఎస్టీ, బీసీ విద్యార్థులకు ఉచిత సీట్లు కేటాయించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ టీచర్స్ ఎమ్మెల్సీగా గెలిచిన మల్క కొమురయ్యకు వారు అభినందనలు తెలిపారు.ఢిల్లీ పబ్లిక్ స్కూల్ లో విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలని, ధనార్జనే పరమావధిగా వ్యవహరించకుండా ఇప్పటికైనా ఢిల్లీ పబ్లిక్ స్కూల్ పేద విద్యార్థుల పక్షాన ఉండాలని వారు డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఎన్నికలు వ్యాపారమయం అయ్యాయని, కార్పొరేట్ వ్యవస్థ లను నడిపే వ్యక్తులే ప్రజాప్రతినిధులుగా వాళ్ళ వ్యాపార సామ్రాజ్యాన్ని కాపాడుకోవడానికి కుయుక్తులు పన్నుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు రాజు కిరణ్,నదీమ్, మనోహర్, రమేష్, కీర్తన్,ప్రభాస్ పాల్గొన్నారు.

కరాటేలో డక్కన్ స్ప్రింగ్ గ్లోబల్ స్కూలుకు బహుమతుల పంట

విశాలాంధ్ర - కాప్రా : కరాటే పోటీలలో డక్కన్ స్ప్రింగ్ గ్లోబల్ స్కూలుకు బహుమతుల పంట పండింది. విద్యార్థులు ఈ పోటీలలో ప్రతిభ కనబర్చి 8బంగారు, 3వెండి, 2 కాంస్య పతకాలను సాధించి విజయకేతనం ఎగురవేశారు. ఇటీవల సరూర్ నగర్ స్టేడియంలో నిర్వహించిన తల్వార్ కెజిఎఫ్ కప్ 2025 కరాటే పోటీలలో కాప్రాలోని డక్కన్ స్ప్రింగ్ గ్లోబల్ స్కూల్ విద్యార్థులు వివిధ కేటగిరీలలో పాల్గొని తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శించారు. పాఠశాల చైర్మన్ నవనీతరావు , మేనేజింగ్ డైరెక్టర్ సునీల్ కుమార్, డైరెక్టర్ డాక్టర్ కమల మనోహర్, కోర్ హెడ్ ఆపరేషన్ కిషోర్ కుమార్ రెడ్డి , ప్రిన్సిపాల్ డాక్టర్ సుమా మీనన్ అన్నారు. స్కూల్ విద్యార్థులు 8 బంగారు, 3 వెండి, 2 కాంస్య పతకాలను గెలుచుకోవడం ఒక అద్భుతమైన విజయమని, వారి కృషి, పట్టుదల, అంకితభావం ఈ గెలుపునకు దోహదపడిందన్నారు.

శాసనసభ్యులకు క్రీడా, సాంస్కృతిక పోటీలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: శాసన సభ్యులకు క్రీడా, సాంస్కృతిక పోటీలను నిర్వహించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు శాసనసభలో సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు మంగళవారం ప్రత్యేక ప్రకటన చేశారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రితో చర్చించిన తర్వాత శాసనసభ్యులకు సాంస్కృతిక, క్రీడా పోటీలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నెల 18,19,20 తేదీల్లో మూడు రోజుల పాటు పురుషులకు క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్ వంటి పోటీలు, అలాగే మహిళా శాసనసభ్యు రాళ్లకు బ్యాడ్మింటన్, త్రోబాల్, టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న శాసనసభ్యులు చీఫ్ విప్‌లు, విప్‌లకు పేర్లు ఇవ్వాలని స్పీకర్ అయ్యన్న పాత్రుడు సూచించారు. ప్రజాసేవలో తీరిక లేకుండా గడుపుతున్న శాసనసభ్యులకు కొంత ఆటవిడుపు కల్పించాలన్న ఉద్దే శంతో క్రీడా, సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నామని, వీటి వల్ల రోజువారీ కార్యకలాపాల నుంచి కాస్త విశ్రాంతి దక్కుతుందన్నారు. దీనిపై ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ స్పందిస్తూ ఇది మంచి నిర్ణయమన్నారు. అసెంబ్లీలో పాత సంప్రదాయాలను పునరుద్ధరిస్తున్నారంటూ అయ్యన్నపాత్రుడిని ప్రశంసించారు.

ఫిష్ మాఫియాకు కూటమి దాసోహం

- కొల్లేరు పరిరక్షణలో వైఫల్యం
- సుప్రీం ఆదేశాల ధిక్కరణ
- ఆక్రమణదారుల రక్షణకు మోదీ చర్యలు
- సీపీఐ కార్యదర్శి నారాయణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి/న్యూదిల్లీ: సుప్రీం కోర్టు ఆదేశాలకు విరుద్ధంగా ఫిష్ మాఫియాకు, కొల్లేరు అక్రమ చెరువుల నిర్మాణ దారులకు కూటమి ప్రభుత్వం అండ దండలుగా నిలుస్తోందని, దానికి ప్రధాని మోదీ వంతపాడటం విడ్డూరమని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ ధ్వజమెత్తారు. కొల్లేరు సరస్సు కాలుష్య మయంగా మారినా ఫర్వాలేదని, ప్రజలు చనిపోయినా ఫర్వాలేదన్న దుర్మార్గపూరిత వైఖరిని మోదీ తీసుకోవడం ఘోరమన్నారు. దిల్లీలో మంగళవారం నారాయణ విలేకరుల సమావేశం నిర్వహించారు. దక్షిణ అమెరికాలోని పెరు రాష్ట్రంలోని పక్షులు ఒకచోటకు చేరి మలిన విసర్జన చేస్తుంటాయని, దాన్ని అక్కడి ప్రభుత్వం ప్రోగుచేసి, అక్కడ ఒక ప్రత్యేక పోర్టు ఏర్పాటు చేసి పంటలకు పంపిస్తుంటారని, అది రైతులకు ఎంతో తోడ్పాటుగా ఉంటుందని చెప్పారు. పక్షుల రాకపోకలతో అక్కడ నిత్యం పర్యాటకుల సందడి నెలకొందని, రిసార్టులు తదితర సౌకర్యాల కల్పనతో కోట్లాది రూపాయల లాభం వస్తోందన్నారు. అక్కడి దేశ విధానాలను చూసైనా ప్రభుత్వం బుద్ధి తెచ్చుకోవాలన్నారు. పెరుని ఆదర్శంగా తీసుకుని రాష్ట్రంలోని కొల్లేరును పరిరక్షిస్తారా?, లేక కొల్లేరును ధ్వంసం చేసి... ఫిష్ మాఫియాకు దాసోహం అవుతారా? తేల్చుకోవాలన్నారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదని, ఆంధ్ర ప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఎన్డీఏకు మద్దతు ఇవ్వడమే కారణమని అన్నారు. ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యేగా కామినేని శ్రీనివాస్ ఉన్నారని విమర్శించారు. కొల్లేరులో పర్యావరణం ధ్వంసం చేసే పద్ధతుల్లో టీడీపీ, జనసేన, బీజేపీ పని చేస్తుంటే... దానికి అనుకూలంగా ప్రధాని మోదీ పని చేస్తున్నారని మండిపడ్డారు. కొల్లేరులో పెద్దఎత్తున అక్రమ చేపల చెరువులు తవ్వారని, వాటి కేంద్రంగా దాదాపు 3 వేల కోట్ల వ్యాపారం చేస్తున్నారని, దీనివల్ల కాలుష్యం పెరుగుతోందని విమర్శించారు. కొల్లేరులో ఆక్రమిత చెరువుల కారణంగా గతంలో వచ్చిన భారీ వర్షాలకు ఆ ప్రాంతం నీట మునిగిందని చెప్పారు. కొల్లేరులో అక్రమ చేపల చెరువులను నిర్మిస్తూ ఫిష్ మాఫియాకు నాయకత్వం వహిస్తున్నారన్నారు. గతంలో మూడు వారాల్లోగా కొల్లేరులోని అక్రమ చెరువులను ఖాళీ చేయించాలన్న ఉత్తర్వులు ఉండగా... దానికి వ్యతిరేకంగా పరిసర ప్రాంత అధికార ఎంపీ, ఎమ్మెల్యేలు కలిసి సుప్రీం కోర్టుకు ఉత్తర్వులకు వ్యతిరేకంగా పనిచేసేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. కొల్లేరుకు ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది పక్షులు సౌదీ అరేబియా నుంచి వస్తుంటాయని చెప్పారు. అక్కడ కాలుష్య నియంత్రణకు చర్యలు చేపట్టకుండా సుప్రీం ఆదేశాలకు వ్యతిరేకంగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై ఒత్తిళ్లు పెంచేందుకు ప్రయత్నించారన్నారు. అందులో భాగంగానే ఇటీవల గుజరాత్‌లో పర్యటించి దేశంలోని 12 అభయారణ్య ప్రాంతాల పేర్లను తెలిపి... ఆసియాలోనే అతి పెద్ద సరస్సుగా ఉన్న కొల్లేరు ప్రస్తావన తీసుకురాలేదని గుర్తు చేశారు. ఇటీవల వరదలకు విజయవాడ ముంపు బారిన పడటంతో కొల్లేరులోని ఆక్రమణల చెరువులూ ఒక కారణంగా చెబుతున్నారని నారాయణ అన్నారు. కొల్లేరు సరస్సు ప్రారంభం నుంచి ఉప్పుటేరు వరకు ఆక్రమణల నిలయంగా మారాయని, వాటిని ఖాళీ చేయించాలని అనేక సార్లు చెప్పినా పట్టించుకోలేదన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు వరదలు వచ్చినప్పుడు రాత్రింబవళ్లు కష్టపడుతూ తిరిగి మొసలికన్నీరు కార్చారేగానీ, అసలు వరదలు రావడానికి గల కారణాలను ఆయన చెప్పలేకపోయారని తెలిపారు. సుప్రీం ఆదేశాలకు వ్యతిరేకంగా ఈ కూటమి పార్టీలన్నీ ఏకమై కొల్లేరులోని ఫిష్ మాఫియాను రక్షించేందుకు కంకణం కట్టుకున్నాయని, ఆ దిశగా మోదీ భాగస్వామ్యం అయినట్లుగా అర్థమవుతోందని నారాయణ ధ్వజమెత్తారు.

స్వచ్ఛాంధ్ర దిశగా ఏపీ అడుగులు

మంత్రి నారాయణ

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: స్వచ్ఛభారత్ మిషన్ లక్ష్యంగా స్వచ్ఛాంధ్ర దిశగా ఏపీ ప్రభుత్వం ముందుకెళ్తుందని మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. 2047 నాటికి జీరో వేస్ట్ వాతావరణంలో నివసించేలా అవసరమైన లక్ష్యాలను పెట్టుకున్నామని చెప్పారు. రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో జరుగుతున్న 12 వ ఆసియా పసిఫిక్ రీజినల్ త్రీ ఆర్ సర్క్యులర్ ఎకానమీ ఫోరం సదస్సులో మంత్రి నారాయణ పాల్గొన్నారు. మంత్రితో పాటు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్,మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్, డైరెక్టర్ సంపత్ కుమార్, స్వచ్ఛాంధ్ర ఎండీ అనిల్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. సమీకృత వ్యర్థాల నిర్వహణ,పర్యావరణ పరిరక్షణ,వాతావరణ సంస్కరణలపై మూడు రోజుల పాటు అంతర్జాతీయ సదస్సులో చర్చిస్తున్నారు. ఈ సదస్సుకు కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్,పలు దేశాల ప్రతినిధులు హాజరయ్యారు. కేంద్ర మంత్రితో కలిసి వివిధ దేశాల పెవిలియన్‌లను మంత్రి నారాయణ పరిశీలించారు. ఆ తర్వాత వ్యర్థాల నిర్వహణ,పర్యావరణ పరిరక్షణపై ఏపీ విజన్‌ను మంత్రి సదస్సులో వివరించారు. 2047 నాటికి జీరో వేస్ట్ క్లైమేట్ రెసిడెన్స్ సాధించేందుకు ఏపీ కట్టుబడి ఉందన్నారు. అటు అమరావతి నిర్మాణంలో ఉత్తమ పద్ధతులతో ఆకట్టుకునేలా సర్క్యులర్ ఎకానమీ దిశగా సీఎం చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని చెప్పారు.స్వచ్ఛాంధ్ర అనేది కేవలం పరిశుభ్రత మాత్రమే కాదని..భవిష్యత్తు తరాలకు నీరు, భూమిని పరిరక్షించాలనే ప్రతిజ్ఞతో పనిచేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఆ తర్వాత జైపూర్ సమీపంలోని సేవాపుర గ్రామంలోని లెగసీ వేస్ట్ రెమెడియేషన్ ప్లాంట్‌ను మంత్రి బృందం పరిశీలించింది.

జర్మనీలో మంత్రి దుర్గేశ్‌కు ఘన స్వాగతం

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: జర్మనీలోని బెర్లిన్ ఎక్స్ పో సెంటర్ సిటీలో 4 మార్చి నుండి 6 మార్చి వరకు జరుగనున్న ఐటీబీ బెర్లిన్-2025 సదస్సుకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రతినిధిగా మంత్రి దుర్గేశ్ హాజరయ్యారు. మంత్రి దుర్గేశ్‌తో పాటు ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి కాటకు అక్కడి అధికార బృందం సాదర స్వాగతం పలికింది. అనంతరం బెర్లిన్ ఎక్స్ పో సెంటర్ సిటీలో ఐటీబీ-2025 సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి దుర్గేశ్ జర్మనీలోని భారత రాయబారి హెచ్.ఈ అజిత్ గుప్తేతో కలిసి పాల్గొన్నారు. ఆ కార్యక్రమం తర్వాత బెర్లిన్ మేయర్ కయ్ వేగ్నర్‌ని వీరు ఘనంగా సత్కరించారు. ఏపీ పర్యాటక రంగానికి అంతర్జాతీయ పెట్టుబడులు తీసుకొచ్చేందుకు మంగళవారం ఉదయం బెర్లిన్ చేరుకున్న మంత్రికి తొలుత అక్కడి జనసైనికులు, ప్రవాస భారతీయుల ఆత్మీయ స్వాగతం పలికారు. ఆంధ్రప్రదేశ్‌ను అత్యుత్తమ పర్యాటక గమ్యస్థానంగా మార్చేందుకు తామంతా తోడుంటామని అక్కడి బృందం చెప్పడం గర్వంగా ఉందని మంత్రి పేర్కొన్నారు. మార్చి 5,6వ తేదీల్లో మంత్రి కందుల దుర్గేష్ బెర్లిన్ వేదికగా ఏపీ పర్యాటక రంగంలో ఉన్న పెట్టుబడి అవకాశాలు, సుస్థిర, బాధ్యతాయుత పర్యాటక విధానాలు, టూరిజం కొత్త పాలసీ విధి విధానాలు, ఇన్వెస్టర్లకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలు, రాయితీలు తదితర విషయాలపై వివరించనున్నారు.

నెలలో రెండు సార్లు ఆర్థిక కమిటీల సమావేశం

స్పీకర్ అయ్యన్న పాత్రుడు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: శాసన సభా ఆర్థిక కమిటీలు నెలలో కనీసం రెండు సార్లు సమావేశం కావాలని శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు సూచించారు. మంగళవారం రాష్ట్ర శాసన సభా భవనంలో శాసనసభ ప్రజాపద్దుల కమిటీ (పబ్లిక్ అకౌంట్స్ కమిటీ), శాసనసభ అంచనాల కమిటీ (ఎస్టిమేట్స్ కమిటీ), ప్రభుత్వ సంస్థల కమిటీ (పబ్లిక్ అండర్ టేకింగ్స్ కమిటీ) ల ప్రాథమిక సమావేశం స్పీకర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిటీలు ఏర్పాటు చేయడంలో ఇప్పటికే ఆలస్యమైందన్నారు. కమిటీ మెంబర్లు చురుగ్గా ఉండాలని, తద్వారా అసెంబ్లీ ప్రొసీడింగ్స్‌లో కానీ, అసెంబ్లీని నడిపించడం ఎంతో సులభమవుతుందన్నారు. గతంలో ఎన్టీఆర్ హయాంలో బడ్జెట్ సమావేశాలు 60 రోజులు పాటు జరిగేవని, అవి అర్ధరాత్రి 12 గంటల వరకు కూడా జరిగేవన్నారు. అలాంటివి నేడు 15 రోజులకు తగ్గిందన్నారు. దిల్లీలో ఏర్పాటు చేసిన అన్ని రాష్ట్రాల స్పీకర్ల సమావేశంలో పాల్గొన్నప్పుడు ఏ రాష్ట్రమైనా సరే అసెంబ్లీ సమావేశాలను సంవత్సరానికి కనీసం 60 రోజులపాటు జరపాలని తీర్మానం చేయడం జరిగిందన్నారు. ఇందుకు అన్ని రాష్ట్రాల సభాపతులు ఆమోదం తెలిపారన్నారు. కాబట్టి ఈ కమిటీలు నెలలో కనీసం రెండు సార్లు సమావేశాలు నిర్వహించుకోవాలన్నారు. ఏ ఉద్దేశంతో ఈ కమిటీలు ఏర్పాటు చేశారో ఆ లక్ష్యాల సాధనకు అనుగుణంగా సభ్యులందరూ సహకరించి సమావేశాలు నిర్వహించుకోవాలన్నారు. ఇందుకు సంబంధించి పబ్లిక్ ఆడిట్ జనరల్ వారి సలహాలు, సూచనలను కమిటీ సభ్యులు తప్పక పరిగణలోకి తీసుకోవాలన్నారు. తాము కూడా ఈ కమిటీలకు సంపూర్ణ సహకారాలను అందిస్తామన్నారు. ఉప సభాపతి కనుమూరి రఘురామ కృష్ణంరాజు మాట్లాడుతూ చైర్మన్లు, సభ్యులందరూ అర్థవంతంగా చర్చల్లో పాల్గొనాలన్నారు. అలాగే క్షేత్ర స్థాయి పర్యటనలు కూడా చేయాల్సి ఉంటుందన్నారు. కమిటీల చైర్మన్లు బూర్ల రామాంజనేయులు, జోగేశ్వరరావు, కూన రవికుమార్‌లు కమిటీలకు అధ్యక్షులుగా ధన్యవాదాలు తెలిపారు. అసెంబ్లీ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవర, డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ తల్లూరి భాస్కర్, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ, శాసనసభ అంచనాల కమిటీ మరియు పబ్లిక్ అండర్ టేకింగ్స్ కమిటీల సభ్యులతో పాటు పలువురు అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

పెట్టుబడులకు హబ్‌గా ఏపీని మారుస్తాం

మంత్రి జనార్దన్ రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో భవిష్యత్‌లో ఆంధ్ర ప్రదేశ్‌ను ప్రపంచ స్థాయి పెట్టుబడులకు హబ్‌గా తీర్చిదిద్దనున్నట్లు రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్థన్ రెడ్డి తెలిపారు. మారిటైమ్-లాజిస్టిక్స్ రంగాల్లో రాష్ట్ర సామర్థ్యం మరింత మెరుగుపడేలా భాగస్వామ్య పక్షాలతో చర్చలు ఎంతో ఉపయోగకరమన్నారు. మంగళవారం విజయవాడలోని నోవాటెల్ హోటల్‌లో మారిటైం, లాజిస్టిక్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్‌పై ఆంధ్ర ప్రదేశ్ స్టేక్ హోల్డర్ కన్సల్టేషన్‌తో నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భాగస్వామ్య పక్షాల ప్రతినిధులు, వివిధ సంస్థల అధిపతులు ఈ కార్యక్రమాల్లో తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి జనార్థన్ రెడ్డి మాట్లాడుతూ 2030 నాటికి లాజిస్టిక్స్ ఫెర్ఫార్మెన్స్ ఇండెక్స్‌లో భారత్ టాప్ 25లో ఉండాలనే లక్ష్యంతో ఎన్డీఏ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఇందుకు అనుగుణంగా తాజాగా ప్రపంచ బ్యాంకు లాజిస్టిక్స్ ఫెర్ఫార్మెన్స్ ఇండెక్స్ 2023 ప్రకారం భారత్ 38 వ స్థానానికి చేరుకోవడం సంతోషించదగ్గ అంశమన్నారు. పోర్టుల అభివృద్ధిలో లాజిస్టిక్స్ రంగం చాలా కీలకమైనదన్నారు. రాష్ట్రం విషయానికి వస్తే... 1053 కి.మీ సుదీర్ఘ సముద్ర తీరంతో కూడిన అపారమైన వనరులను వినియోగించుకునే విధంగా సీఎం చంద్రబాబు నాయుడు అధ్వర్యంలో ప్రభుత్వం నూతన మారిటైమ్ పాలసీ 2024-29ని కూడా ప్రకటించిందన్నారు. ఈ పాలసీ ఆంధ్ర ప్రదేశ్ వ్యూహాత్మకంగా, ప్రపంచ స్థాయి పోర్టులతో, దృఢమైన మౌలిక సదుపాయాల కల్పనతో అద్వితీయ అభివృద్ధి దిశలో పయనించే విధంగా ఎంతోగానో తోడ్పాటు ఇవ్వనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పెట్టుబడులు మౌలిక సదుపాయాలు కార్యదర్శి యువరాజ్, ఏపీ మారిటైం బోర్డ్ సీఈవో ప్రవీణ్ ఆదిత్య, ఫిషరీస్ కమిషనర్ రామ్ శంకర్ నాయిక్, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సీఈవో శేఖర్ బాబు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మాధవి బుచ్‌పై ఎఫ్ఐఆర్... హైకోర్టు స్టే

న్యూదిల్లీ: సెబీ మాజీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్‌కు బాంబే హైకోర్టు నుంచి తాత్కాలిక ఊరట లభించింది. అవినీతి నిరోధక విభాగం ప్రత్యేక న్యాయస్థానం ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని జారీ చేసిన ఉత్తర్వులపై ఆమెతో పాటు మరో ఐదుగురు ఉన్నతాధికారులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసుపై మంగళ వారం విచారణ జరిపిన హైకోర్టు, నాలుగు వారాలపాటు కింది కోర్టు ఉత్తర్వులను నిలిపివేస్తూ ఆదేశాలు ఇచ్చింది. 'కింది కోర్టు పూర్తిస్థాయిలో పరిశీలన చేయకుండా ఈ ఉత్తర్వులు ఇచ్చినట్లు తెలుస్తోంది. రెండు పక్షాల వాదనలు పరిశీలించిన అనంతరం వాటిని తాత్కాలికంగా నిలిపివేస్తున్నాం' అని హైకోర్టు వ్యాఖ్యానించింది.

ఖడ్గేతో భేటీ ప్రోటోకాల్: డీకే

బెంగళూరు: కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మంగళవారం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గేతో భేటీ అయ్యారు. దీంతో రాష్ట్రంలో నాయకత్వ మార్పుపై ఊహాగానాల వేళ ఈ సమావేశానికి ప్రాధాన్యత ఏర్పడింది. డీకే శివ కుమార్ సీఎంగా బాధ్యతలు స్వీకరిస్తారని గత కొంత కాలంగా ప్రచారం జరుగుతున్న విషయం విదితమే. అయితే ఈ సమావేశం ప్రోటోకాల్‌కు సంబంధించిన అంశమని శివకుమార్ స్పష్టతిచ్చారు. 'మా పార్టీ అధ్యక్షుడిని ప్రోటోకాల్ ప్రకారం కలిశాను. బెంగళూరులో పార్టీ కొత్త కార్యాలయం శంకుస్థాపన కోసం వచ్చిన ఆయనకు స్వాగతం పలికాను. ఆయనతో ఎన్నో విషయాలపై చర్చించాను' అని డీకే వెల్లడించారు.

భూముల రీ సర్వే మూడేళ్లలో పూర్తి

- తప్పులతడకగా చేపట్టిన వైసీపీ ప్రభుత్వం
- 2.79 లక్షల ఫిర్యాదుల్లో 90 శాతం పరిష్కరించాం
- శాసన సభలో మంత్రి అనగాని సత్యప్రసాద్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: భూముల రీసర్వేను మూడేళ్లలో పూర్తి చేస్తామని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. హడావిడి లేకుండా భూ యజమా నులందర్నీ ఒప్పించి ప్రతిష్టాత్మకంగా ఈ ప్రాజెక్టును నిర్వహిస్తామన్నారు. వైసీపీ హయాంలో తప్పులతడకగా సాగిన భూముల రీ సర్వేను సరిదిద్దుతున్నామని చెప్పారు. తప్పులకు అస్కారం లేకుండా పకడ్బందీగా రీ సర్వే సాగుతోందన్నారు. శాసనసభలో మంగళవారం ప్రశోత్తరాల సమయంలో భాగంగా రీ సర్వేపై టీడీపీ సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు, కూన రవికుమార్, బోనెల విజయచంద్ర, రాజగోపాల్ అడిగిన ప్రశ్నలకు మంత్రి అనగాని సత్యప్రసాద్ సమాధానమిచ్చారు. జనవరి 20న తమ ప్రభుత్వం భూముల రీ సర్వేను తిరిగి ప్రారంభించిందని గుర్తుచేశారు. ప్రతి మండలానికి ఒక గ్రామాన్ని పైలెట్‌గా ఎన్నుకొని రీ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామాన్ని బ్లాకులుగా విభజించి రోజుకు 20 ఎకరాల మేరకే రీ సర్వే చేయిస్తున్నామన్నారు. రీ సర్వే చేసే ముందు ఆ భూమికి సరిహద్దులో ఉన్న భూ యజమానులందరికీ నోటీసులు ఇచ్చి వారి సమక్షంలోనే రీ సర్వే చేస్తున్నట్లు చెప్పారు. ఒక బ్లాక్‌లోని భూ యజమానులందరికీ వాట్సప్ గ్రూపు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తున్నామని మంత్రి చెప్పారు. గత ప్రభుత్వంలో 6,688 గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేశారు కానీ అంతా తప్పులభరితమన్నారు. రీ సర్వేకు సంబంధించి భూ యజమానులకు నోటీసులు ఇవ్వలేదని, సర్వే పూర్తయిన తర్వాత అభ్యంతరాలు తెలిపేందుకు ఉన్న 60 రోజుల గడువును 21 రోజులకు కుదించారన్నారు. నిబంధనల ప్రకారం కాకుండా సరిహద్దు రాళ్లపైన తమ బొమ్మలు వేసుకోవాలనే పిచ్చితో హడావిడిగా రీ సర్వే చేశారని విమర్శించారు. దీంతో భూ విస్తీర్ణం, సరిహద్దు, పేర్లు దిద్దుబాటు, భూ వర్గీకరణ సమస్యలపై భూ యజమానులు అసంతృప్తి వ్యక్తం చేశారన్నారు. తమ ప్రభుత్వం అన్ని గ్రామాల్లోనూ గ్రామ సభలు నిర్వహించి అర్జీలు స్వీకరించిందని మంత్రి చెప్పారు. దాదాపు 2,79,712 అర్జీలు రాగా 2,57,881ను పరిష్కరించామన్నారు. మిగిలిన 21,831 అర్జీలను మార్చి 31లోగా పరిష్కరిస్తామని మంత్రి అనగాని తెలిపారు. 22 ఏ 1(సి)లో పెట్టిన భూములపై నిర్ణయం తీసుకునేందుకు మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఈ సంఘం సిఫార్సులతో భూములపై నిర్ణయం త్వరలోనే తీసుకుంటామని అనగాని సత్యప్రసాద్ తెలిపారు.

ఐఎల్‌వో తీర్మానం అమలు చేయండి

13 శాతం కూలి పెంపు హర్షణీయం

చల్లా చిన ఆంజనేయులు

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : అంతర్జాతీయ కార్మిక సమాఖ్య (ఐఎల్ఓ) తీర్మానాన్ని అమలు చేయడంలో యాజమాన్యాలు నిర్లక్ష్య వైఖరి అవలంభించడం సరికాదని హమాలీ (ముఠా) ఫెడరేషన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షులు చల్లా చిన ఆంజనేయులు అన్నారు. కూలీలు 50 కేజీలకు మించి బరువు మోయకూడదన్న తీర్మానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. గుంటూరు నగర ముఠా కార్మిక సంఘం రేగుల రాఘవయ్య భవనంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుంటూరు నగరంలోని కిరాణా షాపుల్లో పని చేస్తున్న ముఠా కార్మికులకు ఏఐటీయూసీ అధ్వర్యంలో ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి కూలీ రేట్ల పెంపుదల అగ్రిమెంట్ జరుగుతుందన్నారు. దానిలోభాగంగా ఈ ఏడాది కూలీ రేట్ల పెంపుదలకు సహకరించిన యాజమాన్యానికి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. ప్రస్తుతం ఇస్తున్న కూలీ రేట్లపై 13 శాతం పెంపుదల చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ నెల 3న కిరాణా యాజమాన్యం, యూనియన్ (ఏఐటీయూసీ) మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం రెండు సంవత్సరాల పాటు 13 శాతం కూలీరెట్ల పెంపుదల చేసి అమలు చేసుకోవాల్సిందిగా కార్మిక వర్గానికి ఆయన విజ్ఞప్తి చేశారు. నగర ముఠా కార్మిక సంఘం అధ్యక్షులు జి.సురేష్ బాబు మాట్లాడుతూ నగర ముఠా కార్మిక సంఘం (ఏఐటీయూసీ) అధ్వర్యంలో కిరాణా కార్మికులు కూలి రేట్ల పెంపుదల కోసం సమ్మె నిర్వహించే పరిస్థితికి వచ్చిన నేపథ్యంలో యజమాన్యం మొండి వైఖరి విడనాడి కూలి పెంచడం హర్షణీయమని అన్నారు. ఈ ఒప్పందం ప్రకారం ప్రస్తుతం ఇస్తున్న కూలీ రేట్లపై 13 శాతం పెంపుదల చేసి సోమవారం నుంచి తీసుకోవాలని కార్మికులకు సూచించారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ నగర అధ్యక్షులు రావుల అంజిబాబు, కిరాణా ముఠా కార్మిక సంఘం నాయకులు కొండా వెంకటేశ్వర రెడ్డి, ఆదిబాబు, పప్పుల రోశి రెడ్డి, కొంగలి కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ మాసంలో ఉర్దూ పాఠశాలల పనివేళల మార్పు

సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన మైనారిటీ మంత్రి ఫరూక్

విశాలాంధ్ర-విజయవాడ: రంజాన్ మాసంలో రాష్ట్రంలోని ఉర్దూ పాఠశాలలకు పని వేళలు మార్పు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు రాష్ట్ర న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. ఈ మేరకు అమరావతిలో మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రంజాన్ పవిత్ర మాసంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేసే ముస్లిం ఉద్యోగులందరూ సాయంత్రం పనివేళల ముగింపు కంటే ఒక గంట సమయం ముందుగానే బయటకు వెళ్లేందుకు అనుమతులు మంజూరు చేస్తూ ప్రభుత్వం గత నెలాఖరులోనే ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే ఈనెల 3 నుంచి 30 తేదీ వరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1.30 గంటలకు ఉర్దూ విద్యాబోధన పాఠశాలల పని వేళలను మార్పు చేస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయ సంఘాలు తదితర సంస్థల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు మార్పు చేశామన్నారు. రాష్ట్రంలోని ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాలలు, ఉన్నత పాఠశాలలు, ఉర్దూ మీడియం సమాంతర విభాగం, ఉర్దూ మీడియం డైట్ కళాశాలలకు పనివేళల్ల మార్పు వర్తిస్తుందని తెలిపారు. రంజాన్ మాసంలో ప్రభుత్వ శాఖల్లో పని చేసే ముస్లిం ఉద్యోగులు మతపరమైన ఆచారాలు నిర్వహించుకోవడానికి ఒక గంట ముందుగా బయటకు వెళ్లేందుకు అనుమతించే నిర్ణయం, ఉర్దూ పాఠశాలల పని వేళల మార్పు పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు మంత్రి ఫరూక్ పేర్కొన్నారు.

మద్యం అక్రమార్కులపై చర్యలు తప్పవు

జే బ్రాండ్లతో రూ.3,113 కోట్లు దోచుకున్నారు: మంత్రి కొల్లు రవీంద్ర

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: మద్యం అక్రమార్కులపై చర్యలు తప్పవని మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. శాసనసభలో మంగళవారం ప్రశ్నోత్తరాల్లో భాగంగా ఆయన మద్యంలో జరిగిన అక్రమాలను సభ దృష్టికి తెచ్చారు. 2019-24లో మద్యం ఆర్డర్లన్నీ నచ్చిన వారికి ఇచ్చుకున్నారు. కొత్తగా 7 కంపెనీలను ఏర్పాటు చేసి, దాదాపు 63 శాతానికి పైగా ఆర్డర్లు వాటికే కట్టబెట్టారు. ప్రతి కేసుకు సగటున రూ.200 వరకు అనధికారికంగా వసూల్ చేసినట్లు ఆరోపణలు... మద్యం బ్రాండ్‌లు, బీర్ ద్వారా రూ.3,113 కోట్లు దోచుకున్నారనే ఆధారాలు ఉన్నాయి. గతంలో జాతీయ, అంతర్జాతీయ మద్యం కంపెనీలు మద్యం సరఫరా చేస్తే, గత ఐదేళ్లు వాటిని బెదిరించి, భయపెట్టి ఆ కంపెనీలను లాక్కున్నారు. కమీషన్లు ఇవ్వని కంపెనీలను ఎంత దారుణంగా తొక్కిపెట్టారంటే.. 2018లో ఆఫీసర్స్ ఛాయిస్ 35 లక్షల కేసులు సరఫరా చేస్తే, గత ప్రభుత్వంలో ఐదు లక్షల కేసుల ఆర్డర్లు మాత్రమే ఇచ్చారు. మెక్ డోల్స్ అయితే 22 లక్షల కేసుల నుంచి ఐదు కేసులకు కుదించారు. 2018-19లో తెలంగాణతో పోలిస్తే రెవెన్యూ వ్యత్యాసం రూ.4186 కోట్లు మాత్రమే, కానీ 2023-24 నాటికి ఏకంగా రూ.42,762 కోట్లకు చేరింది. ఇందుకు కారణం నాణ్యమైన బ్రాండ్లను దూరం చేసి కల్తీ, నాసిరకమైన జే బ్రాండ్లను తీసుకురావడమేనని మంత్రి వెల్లడించారు. కల్తీ మద్యాన్ని ప్రజల నెత్తిన రుద్దడంతో జంగారెడ్డిగూడెంలో ఏకంగా 42 మంది ప్రాణాలు కోల్పోయారు. మద్యం నాణ్యతను గాలికి వదిలేయడంతో మద్యం ఆధారిత నేరాలు, ఆత్మహత్యలు, కిడ్నీ, లివర్ సమస్యలు పెరిగాయి అని కొల్లు రవీంద్ర వెల్లడించారు. గుంటూరు జీజీహెచ్ డీఅడిక్షన్ కేంద్రంలో 2018లో 343 కేసులుంటే.. 2023 నాటికి ఆ సంఖ్య 4,913కి చేరడాన్ని ఉదహరించారు. సీఐడీ విచారణలో వెలుగులోకి వచ్చిన వివరాలన్నింటిపై ఆధారాలు సేకరించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం అక్రమాల విచారణకు సెట్ ఏర్పాటు చేసిన రోజునే తాడేపల్లి ప్యాలెస్ వద్ద పత్రాలు తగులబెట్టారన్నారు. ప్రజల జేబులు కొల్లగొట్టిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. నాణ్యమైన మద్యం అందించడమే లక్ష్యంగా పరీక్షలకు ప్రాధాన్యత ఇచ్చామని, ఏ స్థాయిలో కూడా కల్తీకి వీల్లేకుండా చర్యలు తీసుకుంటున్నామని కొల్లు రవీంద్ర వెల్లడించారు. 150కిపైగా బ్రాండ్లు అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. రూ.99కే క్వార్టర్ మద్యాన్ని లభిస్తుండటంతో పేదలు కల్తీ మద్యం వైపు, నాటు సారా వైపు మళ్లకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. తొలిసారిగా ఏపీలో కల్లుగీత కార్మికులకు 350 షాపులు కేటాయించి లైసెన్సు ఫీజులో రూ.103 కోట్ల సబ్సిడీ భరిస్తున్నామని మంత్రి రవీంద్ర వెల్లడించారు.

డ్రైవర్‌ను చెప్పుతో కొట్టిన మాజీ సీఎం కుమార్తె

గౌహతి: అసోం మాజీ సీఎం ప్రఫుల్లకుమార్ మహంత కుమార్తె ప్రజ్వయితా కశ్యప్...మద్యం మత్తులో తనను దూషించినందుకు డ్రైవర్‌పై దాడి చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ఆ వీడియోలో డ్రైవర్‌పై తీవ్రంగా విరుచుకు పడుతూ, చెప్పుతో కొడుతున్నట్లుగా కనిపిస్తోంది. ఈ ఘటన దిస్పూర్‌లోని అత్యంత భద్రత కలిగిన ఎమ్మెల్యే క్వార్టర్లలో జరిగినట్లు వీడియోలో ఉంది. దీనిపై స్పందించిన ప్రజ్వయితా కశ్యప్... డ్రైవర్ తమ వద్ద చాలా కాలంగా పని చేస్తున్నారని పేర్కొన్నారు. 'అతను ఎప్పుడూ మద్యం మత్తులో ఉండి నన్ను వేధిస్తూ, దురుసుగా ప్రవర్తించేవాడు. అతడికి ఉన్న సమస్యల వల్ల అలా ప్రవర్తిస్తాడని, సహనంతో ఉన్నాం. అలా ప్రవర్తించవద్దని ఎన్నిసార్లు చెప్పినా అతడిలో ఎటువంటి మార్పు రాలేదు. సోమవారం నేను ఇంట్లో ఉండగా తలుపును గట్టిగా బాదుతూ, బయటకు రావాలని దూషించాడు. అందుకే అతడికి తగిన బుద్ధి చెప్పాను' అని మహంత కుమార్తె కశ్యప్ తెలిపారు. అయితే డ్రైవర్ ప్రభుత్వ ఉద్యోగినా లేదా వ్యక్తిగతంగా ఏర్పాటుచేసుకున్న వ్యక్తా అనే విషయంపై స్పష్టత లేదు. అసోం గణ పరిషత్ మాజీ అధ్యక్షుడు ప్రఫుల్లకుమార్ మహంత రెండుసార్లు రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం ఆయన శాసనసభ్యుడు కాకపోయినా వారి కుటుంబం ప్రభుత్వానికి సంబంధించిన ఎమ్మెల్యే క్వార్టర్లలో నివాసం ఉండడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.